

క్రీడా సందడి

కేంద్రీయ విద్యాలయంలో జోనల్ స్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం 3

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



2

కొండను ఢీకొన్న ప్రైవేటు బస్సు

- శ్రీశైలం ఘాట్‌లో ఘటన
- డ్రైవర్ పరిస్థితి విషమం
- పలువురికి గాయాలు

శుక్రవారం | 25-4-2025 | పేజీలు: 8 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 25 | శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, బహుళ పక్షం తిథి: ద్వాదశి ఉ.11:45 తదుపరి త్రయోదశి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.8.53 తదుపరి, ఉత్తరాభాద్ర, వర్జ్యం: సా.5.30-6.56, దుర్ముహూర్తం: ఉ.8.27-9.17, మ.12.38-1.28, అమృతఘడియలు: రా.2.08-3.34, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.56, సూర్యాస్తమయం: 6.30 | ఒంగోలు సిటీ

Ongole | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Nallagonda | Nizamabad and Bengaluru

వైసీపీ ప్రభుత్వ హయాంలో మర్రిపూడి మండలంలోని 11 గ్రామాల్లో 15 జగనన్న లేఅవుట్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. వాటిలో 1,040 మందికి ఇళ్లస్థలాలను కేటాయించారు. అందులో 450 మందికి పక్కాగృహాలు మంజూరు చేశారు. 199 మంది మాత్రమే పూర్తిస్థాయిలో నిర్మించుకున్నారు. వివిధ దశల్లో కొన్ని నిలిచిపోయాయి. అనేక కారణాలతో ఎక్కువమంది లబ్ధిదారులు వెనకడుగు వేశారు. అధికారుల ఒత్తిళ్లతో అప్పులు చేసి రూ.లక్షలు వెచ్చించి నిర్మాణాలు పూర్తిచేసుకున్నవారు మౌలిక వసతులు లేక నివాసం ఉండలేక వాటిని అలాగే వదిలేశారు.

సింగరాయకొండ మండలంలో 14 చోట్ల జగనన్న కాలనీ లేఅవుట్లు వేశారు. వాటిలో దాదాపు 4వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. తొలుత 2,500 మందికి గృహాలను మంజూరు చేశారు. నివాసయోగ్యంగా లేని లేఅవుట్లలో ఇచ్చిన వాటిని రద్దు చేసి 1,696కు కుదించారు. వాటిలో ఇప్పటి వరకూ 683 మంది లబ్ధిదారులు నిర్మాణాలను పూర్తి చేశారు. 468 వివిధ దశల్లో నిలిచిపోయాయి. 500 మంది పునాదులు వేసి ఆపేశారు. మిగిలిన వారు అసలు ప్రారంభించనేలేదు.

'ఏమీలేని ఇస్తర ఎగిరెగిరి పడింది' అన్నట్లుగా.. ఇళ్లు కాదు ఊళ్లు నిర్మిస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం ఊరూవాడా మోతెక్కించింది. రూ.కోట్లు వెచ్చించి జగనన్న కాలనీల పేరుతో లేఅవుట్లు ఏర్పాటు చేసింది. అందులో పెద్దఎత్తున అవినీతి చోటుచేసుకుంది. పేదల కోసం కాకుండా అప్పటి వైసీపీ నేతలకు లబ్ధి చేకూర్చేందుకు ఊరికి దూరంగా, అనుకూలంగా లేని ప్రాంతాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అయినప్పటికీ అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. నివాసయోగ్యంగా లేకపోవడంతోపాటు చాలీచాలని సెంటున్నర స్థలం ఇవ్వడంతో పక్కా గృహాలు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు అంతగా ఆసక్తి చూపలేదు. నేతల ఒత్తిళ్లతో కొంతమంది నిర్మించుకున్నప్పటికీ అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడంతో ఆ గృహాల్లో ఉండలేకపోయారు. దీంతో రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలు ప్రస్తుతం చిట్టడవిని తలపిస్తున్నాయి. వాటిల్లోని పలుగృహాలు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి.



మర్రిపూడిలో రహదారి సౌకర్యం లేక చిల్లచెట్లతో మూసుకుపోయిన జగనన్న కాలనీ

ఊళ్లు కాదు.. చిట్టడవులు!

వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలు నిర్మిస్తామని ఆర్భాటం

నివాసయోగ్యం కాని, పనికిరాని భూముల్లో నివేశన పట్టాలు

- జగనన్న కాలనీల పేరుతో కోట్లు ఖర్చు
- చాలీచాలని యూనిట్ వ్యయం
- అధికారుల ఒత్తిళ్లతో అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్న కొందరు..
- మౌలిక వసతులు లేక వాటిలో ఉండలేని దుస్థితి
- మధ్యలోనే ఆపేసిన మరికొందరు
- వినియోగంలోకి తేవాలని వేడుకోలు

మర్రిపూడి/సింగరాయకొండ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు అంటూ గత వైసీపీ ప్రభుత్వం ఊదరగొట్టింది. రూ.కోట్లు వెచ్చించి జగనన్న కాలనీలను ఏర్పాటు చేసింది. దీంతో సొంతింటి కల నెరవేరుతుందని పేదలు ఆశపడ్డారు. గూడు ఏర్పడుతుందని సంబరపడ్డారు. కానీ దీనిపై అప్పటి సర్కారుకు చిత్తశుద్ధి లేకపోవడం, రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం, వైసీపీ నేతల అవినీతి వెరసి లబ్ధిదారుల సొంతింటి కలను కల్లలు చేసింది. ప్రస్తుతం ఆ కాలనీలను పరిశీలిస్తే ఈ విషయం ఇట్టే అర్థమవుతుంది.

మర్రిపూడి మండలంలో 15 లేఅవుట్లు

మండలంలో 15 లేఅవుట్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. 450 మందికి పక్కాగృహాలు మంజూరు చేశారు. ముందు గృహాలు నిర్మించి ఇస్తామని చెప్పిన పాలకులు అనంతరం పట్టించుకోకపోవడంతో అప్పులు చేసి ఇళ్లు కట్టుకోలేక అనేకమంది

మిగతా 2లో...



త్రిపుల్‌ఐటీ స్థలాన్ని ఎమ్మెల్యే ఉగ్రతో కలిసి పరిశీలిస్తున్న డైరెక్టర్ భాస్కర్ పటేల్

దూబగుంటలో త్రిపుల్‌ఐటీ స్థలం పరిశీలన

పామూరు ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పామూరు మండలంలోని దూబగుంట గ్రామంలో మంజూరు చేసిఉన్న ఏపీజే అబ్దుల్ కలాం త్రిపుల్‌ఐటీ స్థలాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలిసి ఆ సంస్థ డైరెక్టర్ భాస్కర్ పటేల్ గురువారం పరిశీలించారు. 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూబగుంటలో కళాశాల నిర్మాణం కోసం 208 ఎకరాలు మంజూరుచేసి భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించి పైలాన్‌ను ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఆతరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దూబగుంటలో కేటాయించిన కళాశాలను రాజకీయ కక్షలో భాగంగా కనిగిరి మండలంల బల్లిపల్లి గ్రామానికి తరలిస్తున్నట్లు ప్రకటనలు చేశారు. ఈనేపథ్యంలో రాష్ట్రంలో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చంద్రబాబు శంకుస్థాపన చేసినచోటే త్రిపుల్‌ఐటీని ఏర్పాటు చేస్తారని ప్రజల్లో నమ్మకం ఏర్పడింది. దూబగుంటలో కేటాయించిన స్థలాన్ని పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేసేందుకు ఎమ్మెల్యే ఉగ్రతో కలిసి స్థల పరిశీలన చేసినట్టు ఆ సంస్థ డైరెక్టర్ భాస్కర్‌పటేల్ తెలిపారు. భూముల వివరాలకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, వీఆర్వో కేసీ వెంకటస్వామి, సర్వేయర్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



దొనకొండలో భూములను పరిశీలిస్తున్న ఏరోస్పేస్ పయనీర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు

దొనకొండలో పరిశ్రమ ఏర్పాటుకు భూముల పరిశీలన

దొనకొండ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): దొనకొండ ప్రాంతంలో చిన్నతరహా పరిశ్రమ ఏర్పాటు నిమిత్తం గురువారం మహరాష్ట్రకు చెందిన ఏరోస్పేస్ పయనీర్ క్లీన్ యాస్ప్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు భూములను పరిశీలించారు. దాదాపు 30 నుంచి 50 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు నిమిత్తం ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కిశోర్ జెపాటిల్, మరో ఇద్దరు దొనకొండకు విచ్చేశారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్‌మోహన్, సర్వేయర్ అనీల్, డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి దొనకొండలోని వెంకటాపురం వెళ్లే రహదారిలో సర్వేనెంబర్లు 15, 16, 362, 363లోని 30 ఎకరాల ప్రభుత్వ భూమిని వారికి చూపించారు. ఆ భూమికి సంబంధించిన పూర్తి వివరాలను మ్యాప్ ద్వారా వివరించారు. ఈ ప్రాంతంలో నీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక సౌకర్యాల గురించి వారు ఆరా తీశారు. ఇక్కడ నుంచి విమానాశ్రమం ఎంత దూరం, ఆ ప్రాంతంలో ఏమైనా అనువైన భూములు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఏసయ్య, లైసెన్స్ సర్వేయర్ వెంకటరావు, సచివాలయ సర్వేయర్లు శ్రీనివాసులు, నవీన పాల్గొన్నారు.



హంతక ముఠాలపై ప్రత్యేక నిఘా

- రెండు కోణాల్లో దర్యాప్తు
- మంచి రాజకీయ భవిష్యత్ దశలో ప్రాణాలు కోల్పోయిన వీరయ్య

2

పోలీసులకు సవాల్!

ముందుకు సాగని వీరయచౌదరి హత్య కేసు

- అన్ని కోణాల్లో విచారణ
- విభేదాలున్న వ్యక్తులపై నిఘా
- పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్ష
- సీసీ పుటేజీ కోసం సెర్చ్

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. కీలకమైన క్లూ ఒక్కటీ దొరకలేదు. అదేసమయంలో ముఖ్యమంత్రి వీరయ్య చౌదరి అంత్యక్రియలకు వచ్చి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి నిందితులను పట్టుకోవాలని సీరియస్‌గా ఆదేశాలు ఇచ్చారు. దీంతో నాగులుప్పలపాడు మండలం రేషన్ మాఫియా డాన్‌గా పేరుపడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అదేక్రమంలో వీరయ్యచౌదరి వ్యాపార లావాదేవీలపై కూడా దృష్టిసారించారు. ఎవరితో కలిసి వ్యాపారాలు చేస్తున్నారు, ఎలాంటివి ఉన్నాయి, అందుకు సంబంధించి భాగస్వాములు ఎవరు, వారి మధ్య విభేదాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. లిక్కర్ సిండికేట్‌తోపాటు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిలో విభేదాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు సాంకేతిక పద్ధతులను వినియోగిస్తున్నారు. అందులో భాగంగా హత్య జరిగిన ప్రాంతానికి నిందితులు ఎటువైపు నుంచి వచ్చారు, ఘటన తర్వాత ఎటు వెళ్లారు.. తదితర వివరాల కోసం సీసీ పుటేజీ కోసం వెతుకుతున్నారు. అయితే ఇప్పటికి దొరికిన పుటేజీలలో ఎక్కడా నిందితులు స్పష్టంగా కనిపించిన దాఖలాలు లేవు. ఒకవైపు దుండగులు ఎవరు, హత్య చేసేందుకు ప్రధాన సూత్రధారులు ఎవరు అనే కోణంలో అత్యంత సీరియస్‌గా దర్యాప్తు చేస్తున్నారు. హత్య జరిగి మూడు రోజులు అవుతున్నా కీలకమైన ఆధారాలు దొరకలేదు. దీంతో హత్యకేసు మరింత సవాల్‌గా మారింది.

ప్రత్యేక దర్యాప్తు బృందాలతో సమీక్ష

ఎస్పీ ఏఆర్.దామోదర్ గురువారం తన కార్యాలయంలో వీరయ్య హత్య కేసు కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పోలీసు బృందాలతో సమీక్ష నిర్వహించారు. కేసు దర్యాప్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిన్న క్లూ దొరికినా సరే అత్యంత వేగంగా స్పందించి సమాచారం సేకరించాలని ఆదేశించారు. అన్ని కోణాలలో దర్యాప్తు చేయాలని, అత్యంత వేగంగా నిందితులను



వీరయ్య చౌదరి హత్య ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

పట్టుకోవాలని సూచించారు. కేసులో కీలకమైన సమాచారం తెచ్చిన వారికి ప్రోత్సాహకాలు కూడా ఉంటాయని తెలిపారు.

ఘటనా స్థలంలో సాక్ష్యులను విచారించిన ఎస్పీ

వీరయ్య చౌదరి హత్యకు గురైన ఆయన కార్యాలయాన్ని ఎస్పీ ఏఆర్ దామోదర్ పరిశీలించారు. అక్కడ ప్రత్యక్షంగా చూసిన కార్యాలయ సిబ్బందిని విచారించారు. దుండగులు ఎలా వచ్చారు, ఏమి మాట్లాడారు అనేది అడిగి తెలుసుకున్నారు. అత్యంత వేగంగా కార్యాలయంలోకి వచ్చిన దుండగులు నేరుగా వీరయ్యచౌదరి వద్దకు వెళ్లి చొక్కా పట్టుకొని పైకి లేపి కేవలం రెండు నిమిషాలలో ఇద్దరు వ్యక్తులు కత్తులతో పొడిచారని చెప్పారు. వీరయ్య కుప్పకూలిన తర్వాత వెళుతూ ఈ విషయం

మిగతా 2లో...



పశ్చిమం భగభగ

- పలుచోట్ల 43డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు
- ఆపై వేడిగాలులు, ఉక్కపోత
- తూర్పున కూడా ఎండల తీవ్రత

ఒంగోలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండల తీవ్రత పెరిగింది. జిల్లావ్యాప్తంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడి వాతావరణం కొనసాగింది. ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతంలో ఆ పరిస్థితి తీవ్రంగా ఉంది. పలుచోట్ల పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు, మూడు డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. ఆపై వేడిగాలులు, ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. ఉదయం 10గంటల నుంచే ఎండల ప్రభావం కనిపించగా మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4గంటల వరకు తీవ్రత అధికంగా ఉంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు పశ్చిమ ప్రాంతంలోని పలుచోట్ల 43 డిగ్రీలు కన్నా అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రప్రభుత్వ విపత్తుల సంస్థ జిల్లాలోని 38 మండలాల్లోని 130 సెంటర్ల ఉష్ణోగ్రతలు నమోదు చేస్తుండగా మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి 33 సెంటర్లలో 40 డిగ్రీలు కన్నా అధికంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల సమయంలో 44 సెంటర్లలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు కన్నా అధికంగా ఉన్నాయి. జిల్లాలో మధ్యాహ్న సమయంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా గరిష్ఠంగా దోర్నాలలో 43.74 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదైంది. మధ్యాహ్నం వైపాలెం, కనిగిరి నియోజకవర్గాలలోని పలు గ్రామాల్లో ఎండల తీవ్రత

మిగతా 2లో...



అద్దంకికి చెందిన పుష్పగిరి ఆంజనేయులుకు మొదటి బహుమతి చెక్‌ను అందిస్తున్న ఆంధ్రజ్యోతి ఒంగోలు బ్రాంచి మేనేజర్ ఐవీ సుబ్బారావు, పక్కన ఎడిషన్ ఇన్‌చార్జి ఆళ్ల శ్రీనివాసరావు, వివిధ విభాగాల బాధ్యులు

బహుమతుల పండుగ ప్రారంభం

- ఉత్సాహంగా పాల్గొన్న ఆంధ్రజ్యోతి పాఠకులు

3



పుట్టా భార్గవిని అభినందిస్తున్న కలెక్టర్ అన్సారియా

టెన్త్ టాపర్‌కు కలెక్టర్ అభినందన

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలో నిలిచిన టంగుటూరు మండలం ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పుట్టా భార్గవిని కలెక్టర్ తమీమ్ అన్సారియా అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పదో తరగతిలో 600లకు 595 మార్కులు సాధించిన భార్గవిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థిని భార్గవి రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి జిల్లాకు పేరు తీసుకురావడం ఆనందంగా ఉందని చెప్పారు. డీఈవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పదో వతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన భార్గవి ఉన్నత చదువుల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వరరావు, టంగుటూరు ఎంఈవో బాలాజీ, ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు దామచర్ల శ్రీధర్, ముప్పా సురేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



డీఈవో కిరణ్‌కుమార్‌ను సత్కరించిన ఉపాధ్యాయులు

డీఈవోకు సత్కారం

ఒంగోలు(రూరల్), ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాలో విద్యార్థులు 85.43 శాతం ఉత్తీర్ణత సాధించడంపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ నాయకులు గురువారం ఒంగోలులో డీఈవో కిరణ్‌కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సత్కరించారు. జిల్లాలో 29,386మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 25,103మంది ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మన్నవ శ్రీనివాస్, చెరుకూరి పూర్ణచంద్రావు, కొత్తగొర్ల వెంకట్రావు, అర్రెబోయిన రామారావు, యనమల ఆంజనేయులు, మోతుకూరి రవీంద్ర, బలుసుపాటి బాపూజీ, నాగినేని నాగేశ్వరరావు, కె.సాంబశివరావు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సూపర్‌బజార్ ఎండీగా రామచంద్రనాథ్

ఒంగోలు(విద్య), ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఒంగోలు సూపర్‌బజార్ మేనేజింగ్ డైరెక్టర్ గా ఒంగోలు సబ్ డివిజనల్ సహకార అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రామచంద్రనాథ్‌ను నియమించారు. ఈమేరకు డీసీవో ఎన్.ఇందిరాదేవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సూపర్‌బజార్ ఎండీగా పని చేస్తున్న మాలకొండయ్య నుంచి రామచంద్రనాథ్ ఎండీగా బాధ్యతలు స్వీకరించారు.

పోలీసులకు సవాల్

(మొదటి పేజీ తరువాయి)

బయటకు చెబితే మిమ్మల్ని చంపివేస్తామని హెచ్చరించి వెళ్లిపోయారని అక్కడ సిబ్బంది ఎస్పీకి తెలిపారు. ఘటన స్థలాన్ని ఎస్పీ నిశితంగా పరిశీలించారు. ఆయన వెంట ఏఎస్పీ కే.నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసరావు ఉన్నారు.

సీసీ ఫుటేజీ కోసం జల్లెడ

నగరంలో నేరం జరిగిన ప్రాంతం నుంచి దుండగులు పరారైన వైపు, మంగమూరు రోడ్డు జంక్షన్ వైపు నుంచి సీసీ ఫుటేజీ కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. ప్రస్తుతం దొరకిన సీసీ ఫుటేజీలలో దుండగులు ఎవరు అనేది స్పష్టత లేదు. నేరస్థలం నుంచి వెంకటేశ్వర కాలనీ వైపు వెళ్లి అటు నుంచి శ్రీనగర్ కాలనీకి ఆపై పేర్నమిట్ట డౌన్ వరకు దుండగులు వెళ్లారు అనేది ఫుటేజీ ద్వారా నిర్ధారణ అయింది. అదేక్రమంలో రెవెన్యూ కాలనీ నుంచి పద్మా టవర్స్ వరకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఫుటేజీలో ఎలాంటి స్పష్టత లేదు. స్పష్టత ఉన్న ఫుటేజీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

పశ్చిమం భగభగ

(మొదటి పేజీ తరువాయి)

అధికంగా ఉంది. ఆ ప్రాంతంలో 40 నుంచి 43 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పశ్చిమ ప్రాంతంతో పోల్చితే తూర్పు ప్రాంతంలో కొంత తక్కువగా ఉన్నప్పటికీ తీవ్రత ఈ ప్రాంతంలోనూ కనిపిస్తోంది. ఎండతోపాటు వేడిగాలులు, ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రానున్న రెండు, మూడు రోజులలో తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. జిల్లాలో గురువారం 42 డిగ్రీలు కన్నా అధికంగా ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు ఇలా ఉన్నాయి.

దోర్నాల - 43.74 డిగ్రీలు	పుచ్చకాయలపల్లి -42.66
చెరువుకొమ్ముపాలెం (పొన్నలూరు మండలం)-43.45	గోళ్లవిడిపి -42.66
తర్లుపాడు -43.30	సానికవరం - 42.31
పునుగోడు -43.20	కె.కె.మిట్ల-42.20
బి.చెర్లోపల్లి-43.0	తిప్పాయపాలెం - 42.14
గోపలదిన్నె -43	తాటిచర్ల -42.09

హంతక ముఠాలపై ప్రత్యేక నిఘా

రెండు కోణాలలో దర్యాప్తు
మంచి రాజకీయ భవిష్యత్ దశలో ప్రాణాలు కోల్పోయిన వీరయ్య

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఇటు రాజకీయంగా అటు వ్యాపారపరంగానూ ఉజ్వల భవిష్యత్‌కు దగ్గరైన యువ నాయకుడు వీరయ్యచౌదరి హత్య రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. అందులోనూ పూర్వం ఒంగోలులో జరిగిన హత్యలను గుర్తుకు తెచ్చే విధంగా సాయంత్రం 7.30 సమయంలోనే హంతకులు నిమిషాల వ్యవధిలో హత్యచేసి నింపాదిగా పరారు కావడం యావత్ ప్రజానీకాన్ని ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటన పోలీస్ నిఘా విభాగంలోని డొల్లతనాన్ని తేటతెల్లం చేసింది. హత్య జరిగిన తీరుతెన్నులను పరిశీలిస్తే హంతకులు ఆరితేరిన నేరస్తులుగా తేటతెల్లం అవుతుంది. హతుడు బతికే అవకాశం లేకుండా కత్తితో పొడవడం అందులోనూ శరీరంలో ప్రాణాలను తీసే భాగాలలో కత్తితో పొడిచిన తీరు అందుకు దర్పణం పడుతుంది. పూర్తిస్థాయిలో రెక్కీ నిర్వహించుకునే దుండగులు హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. వీరయ్య నగరంలో ఉంటే సాయంత్రం 7 గంటలకు కార్యాలయానికి చేరే అలవాటు ఉంది. ఆ తర్వాత 8 గంటల సమయానికే అతని వద్ద పనిచేసే ఉద్యోగులు, కలెక్షన్ బాయ్‌లు అక్కడికి చేరుతుంటారు. వీరయ్యను కలిసే రాజకీయ శ్రేణులు కూడా ఆ సమయానికి అక్కడకు చేరడం నిత్యం జరిగే ప్రక్రియ. ఈలోపు వీరయ్య ఫోన్‌లో ఇటు రాజకీయ అటు వ్యాపారపరమైన అంశాలపై మాట్లాడుకుంటూ ఉండటం ఆఫీసులో ఉండే అకౌంటెంట్‌తో మాట్లాడుతుండం తెలిసిందే. తద్వారా వీరయ్య కార్యాలయానికి చేరిన తొలి అరగంటలో అతని వద్ద పెద్దగా ఉద్యోగులు, అనుచరులు ఉండరనే విషయం హంతక బృందం ముందుగానే పసిగట్టినట్లు వెల్లడవుతుంది. దీనికి తోడు పూర్తి జనసంచార ప్రాంతం కావడంతో నిమిషాలలోనే తమ పని ముగించుకునే విధంగా హంతకులు పథకం రూపొందించుకోగలిగారు. తదనుగుణంగానే వారు వీరయ్య గదిలోకి వెళ్లడం అక్కడ ఉన్న ఇద్దరు సిబ్బంది మెడపై కత్తులు పెట్టడం హడావుడిగా వీరయ్య లేవగానే ఒకరు బలమైన ఆయుధంతో అతని మెడ మీద ఆ వెంటనే గుండె మీద అ వెంటనే పొట్టపై పొడవడం క్షణాలలో జరిగిపోయింది. వీరయ్యకు బతికే అవకాశం ఇవ్వకూడదనే ఆలోచన, ఖచ్చితత్వాన్ని హంతకులు ప్రదర్శించారు. అందుకు మనిషికి ఆయువు పట్టుగా ఉన్న వాటిపై పొడవడంతోపాటు శరీరంలో మొత్తం 50చోట్ల కత్తితో గాయపర్చారు. అంతా మూడు నుంచి నాలుగు నిమిషాల వ్యవధిలోనే పూర్తిచేశారంటే హంతకులు ఏ స్థాయిలో ముందస్తు రెక్కీ నిర్వహించుకుని పని ముగించారో అర్థమవుతుంది. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే దుండగులు హత్యలలో ఆరితేరిన వారనేది ప్రాథమిక దార్యప్తులోనే పోలీసులు కూడా గుర్తించారు. ఆ కోణంలో చూస్తే ముఠా కొద్దిరోజుల ముందుగానే ఒంగోలులోకి ప్రవేశించి వ్యూహం రూపొందించుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హంతకులు ముఖానికి ముసుగులు కూడా ధరించకుండా చేతిబ్యాగులలో కత్తులు పెట్టుకుని పైకి రావడం గమనార్హం. బ్యాగ్‌తో పైకెళ్లడం ద్వారా కింద చూపరులకు అనుమానం రాకుండా జాగ్రత్తపడ్డారు. ఇదే సమయంలో నగరంలో రౌడీమూకలు, హంతక ముఠాలపై పోలీస్ శాఖ నిత్యం నిఘా ఉండటం సహజంగా జరుగుతుంది. పాత నేరస్తుల కదలికలతోపాటు బయట నుంచి వచ్చి తిరుగుతున్న వారిని పసిగట్టడం నిఘా విభాగం విధులలో ఒక భాగం. ఆ విషయంలోనే పోలీస్ నిఘా విభాగం డొల్లతనం ఈ విషయంలో తేటతెల్లం అవుతుంది.

ద్విముఖ వ్యూహం.. జల్లెడ పట్టిన వైనం

హతుడు వీరయ్యకు స్వగ్రామం అమ్మనబ్రోలులోనూ నాగులుప్పలపాడు మండలంలో రాజకీయంగా విభేదించే వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఒకప్పుడు బెంగళూరులో కూడా వీరయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసేవాడు. అయితే అక్కడి వీరయ్య భాగస్వామి కరోనా సమయంలో మృతిచెందడంతో అక్కడ తెగతెంపులు చేసుకుని జిల్లాలోనే వ్యాపారం చేస్తున్నాడు. అయినా బెంగళూరులో వ్యాపార సమయంలో జరిగిన అంశాలను కూడా పోలీసులు పరిగణిస్తున్నట్లు తెలిసింది. అలాగే ఏడాది క్రితం రామాయపట్నం ఓడరేవు ప్రాంతంలో సుమారు 100 ఎకరాల భూమిని వీరయ్య కొనుగోలు చేసినట్లు పోలీసులు పసిగట్టారు. అందులోనూ కొంత వివాదం ఉండి ఆ వ్యవహారం కోర్టులో ఉన్నట్లు తెలుసుకున్నారు. ఆ అంశం పూర్వాపరాలపైన దర్యాప్తు జరుగుతున్నట్లు తెలిసింది. వీటికితోడు మండలంలో రాజకీయంగా విభేదిస్తూ వైసీపీ నేతల అండదండలతో ఉన్న రేషన్ బియ్యం మాఫియాపైనా పోలీసులు కీలకంగా దర్యాప్తు చేస్తున్నారు. అందులో ఒక కీలక రౌడీషీటర్‌తో పాటు వారికి సంబంధాలు ఉన్నాయని నలుగురిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హంతకులు కసిగా వ్యవహరించిన తీరును దృష్టిలో ఉంచుకుని రాజకీయ, ఆర్థిక, మహిళల వ్యవహారాలు ఉండే అవకాశం ఉందన్న అంశాలను పరిశీలిస్తున్నారు. అయితే మహిళలకు సంబంధించిన ఎలాంటి అంశం వీరయ్య జీవితంలో లేదన్న అంశం గుర్తించి వ్యాపార, రాజకీయకోణాల్లోనే దర్యాప్తు చేస్తున్నారు.

చిన్న క్లూతో.. సరికొత్త దర్యాప్తు

ఈ దశలో ఒక చిన్నపాటి క్లూతో పోలీసులు సరికొత్త దర్యాప్తునకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. అందులో భాగంగానే మరోసారి ఎస్పీ తన బృందంతో ఘటనా స్థలానికి వచ్చి ప్రత్యక్ష సాక్షుల ద్వారా గురువారం సాయంత్రం స్వీయ పరిశీలన చేపట్టారు. ఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతలో అటుఇటు సంచరించిన వారిని గుర్తించే ప్రక్రియకు శ్రీకారం పలికారు. సీసీ కెమెరాలలో గుర్తు తెలియని వ్యక్తుల రాకపోకలను కొంతమేర గుర్తించారు. వారిలో కొందరి ముఖ కవళికలు స్పష్టంగా కనిపించగా మరి కొందరివి స్పషత లేవని తెలిసింది. దీంతో సాంకేతిక విధానంలో అలాంటి వారిని ముఖాలను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం పలికారు. హంతకులు తెలివిగా సీసీ కెమెరాలు ఎక్కడున్నవి ముందుగానే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకున్నారన్న అంచనాకు కూడా పోలీసులు వచ్చినట్లు తెలిసింది. అయితే హంతకులు వాడిన బైకులు కూడా ఇంతవరకు పోలీసులు గుర్తించలేకపోయారు. దీంతో నేరస్తులను జల్లెడ పట్టే పనికి శ్రీకారం పలికారు. జిల్లాలో, సమీప జిల్లాల్లో నేరస్తులు ప్రత్యేకించి హంతక ముఠాల్లోని సభ్యులను పట్టుకొచ్చి విచారిస్తున్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడైనా క్లూ చిక్కుతుందన్న విశ్వాసం పోలీసుల్లో ఉంది.

కంటి ముందు ఉజ్వల భవిష్యత్తు

ఒకప్పుడు వీరయ్య వ్యవహారశైలి దూకుడుగా ఉండేది. అనేక చేదు అనుభవాలు, మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సహనం, సయోధ్యతో ముందుకు సాగే విధానానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లాలోని టీడీపీ ముఖ్య నాయకులతోపాటు లోకేష్ దృష్టిలోనూ నిలిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా పేరుపెట్టి పలకరించే పరిస్థితి ఉంది. ప్రస్తుత పరిస్థితిని బట్టి సెంట్రల్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జిగా ఆయన ఎంపికయ్యే అవకాశం కనిపిస్తుంది. ఆ పదవికి పార్టీలో పోటీ ఉన్నప్పటికీ లోకేష్ దృష్టిలో ఉన్నందున వీరయ్యను ఆ పదవి వరించబోతుందన్న విషయం ఆ పార్టీ ముఖ్య నాయకులందరిలోనూ ఉంది. ఆ పదవి ద్వారా రాజకీయంగా పార్టీలో మరింత ఎదగాలన్న ఉద్దేశంతో నాయకులందరితో సన్నిహితంగా మెలుగుతున్న సమయంలో హత్యకు గురయ్యారు.

లోపాలు లేకుండా మహాకుంభాభిషేకం

- ఏర్పాట్లపై మంత్రి గొట్టిపాటి

అద్దంకి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మహాకుంభాభిషేకం ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖ మండప నిర్మాణ పనులు పూర్తయిన తరువాత మే 19న నిర్వహించే మహాకుంభాభిషేకం ఏర్పాట్లపై గురువారం ఉదయం తాడేపల్లిలోని మంత్రి నివాసంలో దేవస్థానం అధికారులు, పూజారులతో మంత్రి రవికుమార్ చర్చించారు. మహాకుంభాభిషేకానికి భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ప్రశాంతంగా స్వామి వారి దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదే సమయంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల బసకు ఇబ్బంది లేకుండా అన్ని సామాజిక అన్నదాన సత్రాలలో ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే సమావేశం ఏర్పాటు చేసి చెప్పినట్లు మంత్రి రవికుమార్‌కు ఈవో తెలిపారు.

నేడు ఒంగోలులో రెవెన్యూ అసోసియేషన్, తహసీల్దార్ల సమన్వయ సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లాలోని తహసీల్దార్లతో శుక్రవారం ఒంగోలులో సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిన్నిక మధుసూదన్‌రావు, ఆర్.వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు హాజరవుతారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాసంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు గతంలో జరిగిన పొరపాట్ల దిద్దుబాటు చర్యలపై చర్చిస్తామన్నారు. గ్రీవెన్స్, రీ సర్వే గ్రామసభలు, రెవెన్యూ సదస్సులతోపాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలలో ఎక్కువ భాగం రెవెన్యూశాఖకు సంబంధించినవి వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులతో పాటు తహసీల్దార్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం భూముల పరిశీలన

కొత్తపట్నం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం భూ సేకరణ జరిపేందుకు అధికారుల బృందం కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా జేసీ గోపాలకృష్ణ, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, పలువురు అధికారులు మండలంలోని ఆలూరు, అల్లూరు, కొత్తపట్నం గ్రామాల్లో ఎయిర్‌పోర్టు కోసం అనువైన భూములను గుర్తించారు. ఆయా గ్రామాలను సందర్శించి అవసరమైన భూమిని సేకరించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదనరావు, సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవాసమితి ట్రస్ట్ సేవా కార్యక్రమాలు అభినందనీయం అని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని జీజీహెచ్‌లోని రోగులకు సహాయాకులుగా విచ్చేసేవారి కోసం సమితి ఆధ్వర్యంలో భోజనశాల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్టీమ్ కుక్ యంత్రాన్ని ఎమ్మెల్యే దామచర్ల ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, సీఎస్ఆర్ఎంవో మాధవిలత, నిర్వాహకులు మూర్తి ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.



భోజన సేవ ప్రారంభంలో ఎమ్మెల్యే దామచర్ల

వలసలు నివారించడమే ప్రభుత్వ లక్ష్యం

- కూలీలతో మమేకమై వారితో పాటు పనిచేసిన సబ్‌కలెక్టర్

మార్కాపురం రూరల్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి). గ్రామీణ ప్రాంతాలలో కూలీల వలసలను నివారించడమే ప్రభుత్వ లక్ష్యమని సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ తెలిపారు. మండలంలోని దరిమడుగు గ్రామ పరిధిలో వెలిగొండ ప్రాజెక్టు కలనూతల-1 పునరావాస కాలనీ వద్ద వెలిగొండ ప్రాజెక్టు కాలువలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను గురువారం సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొంత సమయం కూలీలతో పాటు కాలువలో గొడ్డలి చేతపట్టి పిచ్చి చెట్ల తొలగింపు పనులు, గడ్డపారతో మట్టిని తవ్వడం, పారతో మట్టిని తీసుకుని కాలువపై పోయడం వంటి పనులను చేసి కూలీలలో ఉత్సాహాన్ని నింపారు. కూలీలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో తాగునీటి సౌకర్యం, ప్రథమ చికిత్స సామగ్రి, నీడ వంటి సదుపాయాలు ప్రతి రోజు ఏర్పాటు చేస్తున్నారా..? లేదా.? అని అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రోజులు నుండి పని చేస్తున్నారు. వేతనాలు సక్రమంగా వ్యక్తిగత ఖాతాలలో జమవుతున్నాయా..? లేదా..? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. . గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన పశువుల నీటి తొట్టెను, పశువుల పాకను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాగరాజు ఈసీ కిషోర్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు జవ్వాజి రామాంజులరెడ్డి, టీఏ కాశీరావు, ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో కలిసి పనిచేస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

ఊళ్లు కాదు.. చిట్టడవులు!

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధిదారులు వెనకడుగు వేశారు. దీనికితోడు సిమెంటు, ఇనుము ధరలు భారీగా పెరగడం. యూనిట్ వ్యయం పునాదులకు మాత్రమే సరిపోయే విధంగా ఉండటంతో లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రాలేదు.

కాలనీల్లో పరిస్థితి ఇదీ..

- మండల కేంద్రమైన మర్రిపూడిలోని పొట్టిరెడ్డిపాలెం రహదారిలో 124 మందికి పట్టాలు ఇవ్వగా 71 మందికి మాత్రమే గృహాలు మంజూరయ్యాయి. వారిలో 42మంది నిర్మించుకొన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో నివాసం ఉండేందుకు వారు ఆసక్తి చూపడం లేదు.
- కూచిపూడిలో 47మందికి గృహాలు మంజూరు చేయగా 30 పూర్తయ్యాయి. అక్కడ కూడా నివాసం ఉండటం లేదు. ఇప్పటికే ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులు, పైపులైన్‌లు శిథిలావస్థకు చేరాయి.
- గ్రామాలకు దూరంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం ఆయా కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి పూర్తయిన గృహాల్లో లబ్ధిదారులు నివాసం ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఊళ్లపాలెం వద్ద ఉప్పుపొరలో పట్టాలు

సింగరాయకొండ మండలం ఊళ్లపాలెంలో సముద్రానికి దగ్గరలోని ఉప్పుపొరలో జగనన్న కాలనీ లేఅవుట్ వేశారు. అక్కడ 356 మందికి ప్లాట్లు కేటాయించి పట్టాలు ఇచ్చారు. వర్షాలు కురిసినపుడు భారీగా నీరు చేరేది. దీంతో భూమి లెవలింగ్‌కు రూ.46.50 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ఖర్చు చేశారు. అయినప్పటికీ రోడ్డు కంటే 4 అడుగుల పల్లంలోనే ఆ లేఅవుట్ ఉంది. ఇళ్ల నిర్మాణానికి ఆమోదయోగ్యంగా లేకపోవడం, లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో గత ప్రభుత్వంలోనే గృహ నిర్మాణశాఖ అధికారులు ఈ లేఅవుట్‌లో మంజూరు చేసిన గృహాలను పూర్తిగా రద్దు చేశారు.

కనుమళ్ల చెరువు సమీపంలో పట్టాలు

కనుమళ్ల పంచాయతీ పరిధిలోని చెరువు సమీపంలో జగనన్న లేఅవుట్ వేశారు. అందులో 178మందికి ప్లాట్లను ఇచ్చారు. చెరువులోకి భారీగా నీరు వస్తే అది ముంపునకు గురవుతోంది. దీంతో లబ్ధిదారులు నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు. అక్కడ నివాసయోగ్యం కాదని తొలుత 131 గృహాలను రద్దు చేశారు. ఈ లేఅవుట్‌లో లెవలింగ్‌కు రూ.18.50 లక్షలు ఖర్చు చేశారు. మొత్తం బూడిదలో పోసిన పన్నీరైంది.

పకీర్‌పాలెం లేఅవుట్‌లో ముందుకురాని లబ్ధిదారులు

సోమరాజుపల్లి పంచాయతీ పరిధి పకీర్‌పాలెం లేఅవుట్‌లో గత వైసీపీ ప్రభుత్వంలో 322 ప్లాట్లతో లేఅవుట్‌ను వేశారు. అందులో సింగరాయకొండ, సోమరాజుపల్లి లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు. సింగరాయకొండకు చెందిన వారికి స్థానికంగా కాకుండా సుదూరంగా ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో గృహ నిర్మాణాలకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఆ లేఅవుట్ చిల్లచెట్లతో దర్శనమిస్తోంది.

బింగినపల్లి-2లో పిల్లర్లకే పరిమితం

- బింగినపల్లి పంచాయతీ పరిధిలోని ఊళ్లపాలెం రోడ్డు పక్కన 162 ప్లాట్లతో లేఅవుట్ వేశారు. అందులో సింగరాయకొండ మండలంలో ఉండే ఎస్టీలకు పట్టాలు ఇచ్చారు. ఈ లేఅవుట్ కూడా రోడ్డు కంటే పల్లంలో ఉంది. కనీస సదుపాయాలు లేకపోవడం లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రాలేదు. ఐదుగురు మాత్రం పిల్లర్లు వేసి వదిలివేశారు.
- కలికివాయిలో కూడా ముంపునకు గురయ్యే ప్రాంతంలో అధికారులు లేఅవుట్ వేశారు. 99 ప్లాట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అక్కడ ఏరు ఉండటంతో వర్షం కురిసినప్పుడు లేఅవుట్ మునుగుతోంది. దీంతో లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రాలేదు. దీంతో అక్కడ గృహ నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేశారు. మిగిలిన వాటిలో సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని ఊళ్లపాలెం రోడ్డులో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో మాత్రమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారిలో కొందరు నివాసం ఉంటున్నారు. మిగిలిన ఎనిమిది చోట్లా అతి కొద్దిమంది మాత్రమే గృహాలను నిర్మించుకున్నారు. అవి కూడా నివాసయోగ్యంగా లేకపోవడంతో వాటిలో ఉండలేక అలాగే వదిలేశారు.




ప్రమాదానికి గురైన ప్రయివేటు బస్సు, కింద అపస్మారకస్థితిలో పడి ఉన్న డ్రైవర్ ఫయాజ్

కొండను ఢీ కొన్న ప్రైవేటు బస్సు

- శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఘటన
- డ్రైవర్ పరిస్థితి విషమం
- పలువురికి స్వల్ప గాయాలు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు కొండను ఢీకొన్న ఘటన శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో నల్లమల అటవీ ప్రాంతంలో గురువారం చోటుచేసుకొంది. చిన్నారుట్ల సమీపంలోని మలుపు వద్ద బస్సు వేగం అదుపుతప్పి కొండను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఫయాజ్‌కు తీవ్రగాయాలు కాగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రంలోని బళ్లారి మండలం సిరిగుప్ప గ్రామానికి చెందిన 40 మంది కాశీయాత్రలో భాగంగా శ్రీశైలం వెళుతుండగా ప్రమాదం చోటుచేసుకొంది. ఈ బస్సు ముందు భాగం దెబ్బ తినగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆ కుదుపునకు పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. తేరుకున్న యాత్రికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను సున్నిపెంట వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.



ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

ఆటోను ఢీకొన్న లారీ

- మహిళా కూలీలకు గాయాలు

నాగులుప్పలపాడు,ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆటోను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో నలుగురు మహిళా కూలీలు గాయపడ్డారు.ఈ సంఘటన 216 రహదారిపై ఉప్పుగుండూరు సమీపంలో చోటుచేసుకొంది. కూలీలు తెలిపిన వివరాల మేరకు చినగంజాం మండలం రామచంద్రానగర్‌కు చెందిన కూలీలు గురువారం ఉదయం ఆటోలో మిర్చి కోతలకు నాగులుప్పలపాడు వైపు వెళుతున్న క్రమంలో ఉప్పుగుండూరు వద్ద నాగన్నవాగు సమీపంలోకి రాగా చీరాల వైపు వెళుతున్న టిప్పర్ ఢీకొని ఆగకుండా వెళ్లింది. దాంతో ఆటోలో ఉన్న బల్లి సుబ్బలక్ష్మి, పచ్చంగి సూర నాగమ్మ, దండుపోలు కల్యాణలక్ష్మి,రాసానే జాలమ్మ గాయపడ్డారు. వారిని 108 లో ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రీడా సందడి



హాజరైన క్రీడాకారులు

కేంద్రీయ విద్యాలయంలో జోనల్ స్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం

ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో అండర్ 17 రీజనల్ ఖోఖో పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జరిగే ఈ పోటీలను ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్ ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని 15 విద్యాలయాల నుంచి సుమారు 400 మంది బాలబాలికలు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జోనల్ స్థాయి క్రీడా పోటీలకు ఒంగోలు అతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. 24, 25 తేదీలలో బాలికలకు, 26, 27 తేదీలలో బాలురకు పోటీలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమములో వైస్ ప్రిన్సిపాల్ శివరాం, డాక్టర్ శ్రీదేవి, కేవీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ సూర్య ప్రకాశరరావు పాల్గొన్నారు.



పట్టేశా.. పాయింట్

- ఒంగోలు, కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)



అతిథులకు మొక్కలు అందజేస్తున్న సిబ్బంది



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

ఉగ్రదాడిలో మృతులకు 'జనసేన' సంఘీభావం



మౌనదీక్ష చేస్తున్న నాయకులు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు ఖండిస్తూ గురువారం ఒంగోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో మృతులకు సంఘీభావంగా మౌనదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, నేత కంది రవిశంకర్ మాట్లాడుతూ ఉగ్ర దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో నాయకులు చిట్టెం ప్రసాద్, చనపతి రాంబాబు, కళ్యాణ్ ముత్యాల, రాయని రమేష్ , కృష్ణ పెన్నా, బొందిల శ్రీదేవి, పిల్లి రాజేష్, పల్ల ప్రమీల, దండే అనిల్, గోవింద్ కోమలి, ఆకుపాటి ఉష, సుంకర కళ్యాణి, అయినాబత్తిన రాహుల్, నరసింహారావు, షేక్ ముంతాజ్, ఇమ్మిడిశెట్టి శ్రీను, అల్లూరి శ్రీహరి, బొందిల మధు, తేళ్ల హరీష్, కాసాని వాసు, కోట మనోహర్, మహ్మద్ యూనిస్, ఆరిగ శ్రీను, కర్రి శ్రీకాంత్, కోట మనోహర్, నక్క ప్రమీల, శ్రీను, సాయి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వైద్య ధ్రువీకరణ పత్రాలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బదిలీలలో ప్రత్యేక పాయింట్లు కేటాయించేందుకు, ప్రాధాన్యతా కేటగిరిలో బదిలీ పొందేందుకు అవసరమైన వైద్య ధ్రువీకరణ పత్రాల జారీ గురువారం ఒంగోలు రిమ్స్‌లో ప్రారంభమైంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని టీచర్లకు రిమ్స్‌లో అవసరమైన సర్టిఫికెట్లు జారీ చేసేందుకు 12మంది డాక్టర్లతో ప్రత్యేకంగా మెడికల్ బోర్డు ఏర్పాటు చేశారు. ప్రత్యేక కేటగిరీ కింద బదిలీ కోరుకొనే టీచర్లు తప్పనిసరిగా రిమ్స్‌లో ఈ మెడికల్ బోర్డు ముందు హాజరై తమ శారీరక వైకల్యం, బాధపడుతున్న వ్యాధులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పొందాల్సి ఉంటుంది. మెడికల్ బోర్డుకు చైర్మన్‌గా రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున వ్యవహరిస్తారు. సభ్యులుగా వైద్యులు అచ్చెంనాయుడు, కిషన్, ఎ.అజయ్, వసంత, ఐ.లక్ష్మీనారాయణ, పి.రాంబాబు, వి.శివరామకృష్ణ, జి.కిరణ్‌కుమార్, కె.వెంకటేశ్వరరావు, వి.గోపీకృష్ణ, ఎస్.హరిలను నియమించారు. ఈనెల 25,26వ తేదీ తేదీలలో కూడా ఉపాధ్యాయులు సర్టిఫికెట్‌లు పొందవచ్చు.

సమాజాన్ని చైతన్యవంతం చేసేవి నాటికలు

శ్రీకారం రోటరీ కళా పరిషత్ నాటిక పోటీలు ప్రారంభం

మార్టూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కళలు మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని, కళాపరిషత్‌ల ద్వారా ప్రదర్శించే నాటికలకు సమాజాన్ని చైతన్యవంతం చేసే శక్తి ఉందని రోటరీ జిల్లా 3150 గవర్నర్ కే శరత్‌చౌదరి చెప్పారు. గురువారం రాత్రి మార్టూరులో శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో 15వ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. మొదట కే శరత్‌చౌదరి, శ్రీకారం కార్యదర్శి జాష్టి అనూరాధ, వేదిక ఉపాధ్యక్షుడు మల్లికార్జునరావు, రోటరీ సభ్యులు నటరాజ విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలనతో నాటిక పోటీలను ప్రారంభించారు.



కపిరాజు నాటికలోని సన్నివేశం

ఎఫర్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు అధ్యక్షత ఉపన్యాసంలో మాట్లాడుతూ ప్రజా సేవా కార్యక్రమాలతో పాటు రోటరీ కళా పరిషత్ నాటిక పోటీలను నిర్వహిస్తూ సమాజ చైతన్యం కోసం పనిచేస్తోందన్నారు. ముఖ్యఅతిథి కే శరత్‌చౌదరి మాట్లాడుతూ రోటరీ క్లబ్‌లలో మార్టూరు రోటరీ క్లబ్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి మార్గాలను కళా పరిషత్ నాటికల ప్రదర్శనల ద్వారా ప్రజల దృష్టికి తీసుకువెళుతోందని చెప్పారు. వేదికపై ఆత్మీయ అతిథులు వేదిక ఉపాధ్యక్షుడు పీవీ మల్లికార్జునరావు, రోటరీ అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వరరావు,కార్యదర్శి మాదాల సాంబశివరావులు, ఎం.ఈశ్వరప్రసాద్ ప్రసంగించారు.

ఆకట్టుకున్న నాటికలు

తొలిరోజు మొదటి ప్రదర్శనగా న్యూస్టార్ మోడరన్ థియేటర్ విజయవాడ వారిచే ప్రదర్శించిన కపిరాజు నాటిక ప్రేక్షకులను ఆకట్టుకున్నది. అనంతరం రసరఝురి పొన్నూరు వారిచే గురి తప్పినవేట నాటికలో డబ్బు సంపాదించడం కోసం అడ్డదారులు తొక్కేవారు సమాజంలో పెరిగిపోయారని, నీతి, నిజాయతీతో డబ్బులు సంపాదించేవారికి ఎప్పుడూ విలువ ఉంటుందనే కథా వృత్తంతో సాగిన ప్రదర్శన ప్రేక్షకులను ఆలోచింపచేసింది. తరువాత యంగ్‌థియేటర్ విజయవాడ వారిచే 27వ మైలురాయి నాటికలో సమాజంలో న్యాయాన్ని కాపాడాల్సిన న్యాయవాదులు సమాజానికి కీడు చేసే కేసులు వాదించకుండా ఉండడం ఉత్తమమనే సందేశంతో నాటిక ప్రదర్శన చేశారు. నాటికలను తిలకించడానికి ప్రేక్షకులు భారీగా తరలి వచ్చారు.



నాటిక పోటీల ప్రారంభంలో నటరాజ పూజలో పాల్గొన్న రోటరీ గవర్నర్ శరత్ చౌదరి, శ్రీకారం కార్యదర్శి అనూరాధ, మల్లికార్జునరావు

బహుమతుల పండుగ ప్రారంభం





రెండో బహుమతి అందుకుంటున్న సుబ్రమణ్యం, మూడో బహుమతి అందుకుంటున్న భవ్య

ఉత్సాహంగా పాల్గొన్న ఆంధ్రజ్యోతి పాఠకులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో విజేతలుగా నిలిచిన ఆంధ్రజ్యోతి పాఠకులు బహుమతులు ఇచ్చే కార్యక్రమం గురువారం సాయంత్రం ప్రారంభమైంది. మొత్తం 103 మంది విజేతలకుగాను తొలి మూడు బహుమతుల విజేతలకు, కొందరు కన్సోలేషన్ విజేతలకు బహుమతులు అందజేశారు. త్రోవగుంటలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో గురువారం సాయంత్రం బహుమతులు అందజేసే తొలి కార్యక్రమం జరిగింది. ఆంధ్రజ్యోతి 22 వార్షికోత్సవం సందర్భంగా కార్ అండ్ బైక్ రేస్ పేరుతో నాలుగునెలలపాటు నెలకు మూడు ప్రకారం కూపన్లు ప్రచురించిన విషయం తెలిసిందే. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పాఠకుల నుంచి వేలాది కూపన్లు రాగా, డ్రా విధానంలో విజేతలను గుర్తించారు. జిల్లా స్థాయిలో మొదటి బహుమతులతోపాటు వందమందిని కన్సోలేషన్ బహుమతులు విజేతలుగా ఎంపికయ్యారు. తొలి ముగ్గురు విజేతలకు బహుమతులను అందజేశారు. అద్దంకికి చెందిన పుష్పగిరి ఆంజనేయులు మొదటి బహుమతిగా మోటార్‌బైక్‌ను గెలుపొందారు. ఒంగోలు గద్దలగుంట ప్రాంతానికి చెందిన కే.సుబ్రమణ్యం రెండో బహుమతిగా ఫ్రిజ్‌ను గెలిచారు. ఇరిగేషన్ కార్యాలయంలో ఏఈగా పనిచేస్తున్న అద్దంకి చెందిన కరేటి భవ్య మూడో బహుమతిగా ఎల్ఈడీ టీవీని గెలుపొందారు. ఈ ముగ్గురు విజేతలకు ఆంధ్రజ్యోతి సిబ్బంది సమక్షంలో బ్రాంచ్ మేనేజరు ఐవీ సుబ్బారావు బహుమతులు అందజేశారు. ఆ సందర్భంగా విజేతలు మాట్లాడుతూ పాఠకులను గౌరవించే ఆంధ్రజ్యోతి విధానాన్ని అభినందిస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ముండ్లమూరు మండలంలో విద్యుత్ శాఖ లైన్‌మన్‌గా పనిచేస్తున్న మొదటి బహుమతి విజేత ఆంజనేయులు మాట్లాడుతూ గత 20ఏళ్ల నుంచి ఆంధ్రజ్యోతిని చదువుతున్నానని, అందులో ప్రచురితమయ్యే కథనాల్లో నిజాయితీ, నిష్పక్షపాతం కనిపిస్తాయని, అందులకే తాను ఆంధ్రజ్యోతి పాఠకునిగా కొనసాగుతున్నానని చెప్పారు. రెండో బహుమతి విజేత సుబ్రమణ్యం మాట్లాడుతూ తనకు విద్యార్థి దశలో ఆంధ్రజ్యోతిలోని స్టడీ పేజీలు చక్కగా ఉపయోగపడ్డాయని చెప్పారు. మూడో బహుమతి విజేత భవ్య మాట్లాడుతూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ రాసే కొత్తపలుకు కథనాలు, చానల్‌లో నిర్వహించే ఓపెన్‌హార్ట్ కార్యక్రమాలు తనను బాగా ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. ఈ ముగ్గురితోపాటు మరో వంది మంది కన్సోలేషన్ విజేతలకు బహుమతులు ఆయా ప్రాంతాల వారీ జరిగే కార్యక్రమాల్లో ఇవ్వనున్నట్లు బ్రాంచ్ మేనేజర్ సుబ్బారావు చెప్పారు. త్రోవగుంట కార్యాలయానికి వచ్చిన ముగ్గురు కన్సోలేషన్ విజేతలకు కూడా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎడిషన్ ఇన్‌చార్జి ఆళ్ల శ్రీనివాస్, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజరు ఎన్.రమణ, యాడ్స్ విభాగం ఇన్‌చార్జి గోపికృష్ణ, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీసీ సెంటర్‌ను పరిశీలించిన మునిసిపల్ ఆర్డీ

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో వీధికుక్కల కుటుంబ నియంత్రణ కేంద్రాన్ని మునిసిపల్ ఆర్డీ హరికృష్ణ గురువారం పరిశీలించారు.

నగరానికి విచ్చేసిన ఆయన కార్పొరేషన్ అధికారులతో కలిసి కొత్త మామిడిపాలెంలోని ఏబీసీ సెంటర్ (యానిమల్ బర్త్ కంట్రోల్), వర్మీ కంపోస్ట్ యార్డు, ట్రిపుల్ ఆర్ పార్కును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు ఆ మూడు కేంద్రాల ఏర్పాటు, వాటి ఫలితాలను ఆర్డీకి వివరించారు.



వీధి కుక్కల కుటుంబ నియంత్రణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీ హరికృష్ణ, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఏబీసీ సెంటర్‌లో ఆపరేషన్ అనంతరం కుక్కలను ఉంచేందుకు అవసరమైన బోనుల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. అలాగే నగరంలో కూడా ట్రిపుల్‌ఆర్ పార్కుల సంఖ్యను పెంచాలని తెలిపారు. కార్యక్రమములో అసిస్టెంట్ కమిషనర్ డి.కొండయ్య, ఎంహెచ్‌వో వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్లు షేక్ బాజీ, పిచ్చయ్య, ఏబీసీ డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఒంగోలు(రూరల్), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకును గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు డిమాండ్ చేశారు. గురువారం ఒంగోలులోని మల్లయ్యలింగభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నల్లబర్లీ పొగాకును క్వింటా రూ.15వేలకు కొనుగోలు చేశారని, ప్రస్తుతం క్వింటా రూ.3వేల నుంచి రూ.4వేలకు కొనుగోలు చేస్తామంటే రైతులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. బర్లీ పొగాకును ఎస్సీ, బీసీ, చిన్న, సన్నకారు వారు మాత్రమే సాగు చేశారని, అందువల్ల నల్ల బర్లీ పొగాకును కూడా పొగాకు బోర్డు పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. క్వింటా రూ.15వేలకు పైగా ధరకు కొనుగోలు చేయాలని కోరారు. డాక్టర్ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ మే 5వ తేదీన చలో సీఎం కార్యక్రమం చేపడతామన్నారు. అలాగే ఈనెల 26నుంచి 30వ తేదీ వరకు ప్రజాప్రతినిధులకు సమస్యను అర్జీల రూపంలో అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కె.వీరారెడ్డి, పెంట్యాల హనుమంతరావు, ఎస్.లలితకుమారి, కోడూరి హనుమంతరావు, పమిడి వెంకట్రావు, వడ్డే హనుమారెడ్డి, బీమవరపు సుబ్బారావు, కోడూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రంగారావు, పక్కన పలు రైతు సంఘాల నేతలు

డిప్యూటీ కమిషనర్ కోర్టులో, చిక్కబళ్లాపుర
కేసు నెం: RA/SCST/42/2022-23

పిటీషనర్ నెం: 1. శ్రీ వెంకటేష్, తండ్రి: దివంగత నారాయణప్ప, అగలగుర్కి గ్రామం, నంది హుబ్బళ్లి, చిక్కబళ్లాపుర తాలూక.

V/s

రెస్పాండెంట్ నెం: 1. అసిస్టెంట్ కమీషనర్, చిక్కబళ్లాపుర సబ్ డివిజన్, చిక్కబళ్లాపుర
2. శ్రీ డి. పిచ్చిరెడ్డి, తండ్రి: లక్ష్మణ్‌రెడ్డి, కె. ఉప్పలపాడు, కొండపి మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

కాగా, అప్పీలుదారులు చిక్కబళ్లాపుర తాలూకా, నంది హుబ్బళ్లి లోని అగలగుర్కి గ్రామంలో పాత సర్వే నెం.83, కొత్త సర్వేనెం.249 లో కొలతలు కలిగిన 0-30 గంటల భూమికి సంబంధించిన PTCL (చిక్క) 11/2014-15, తేదీ:19/04/2021న ఇచ్చిన అప్పీలును పక్కన పెట్టుటకు పై అప్పీల్ దాఖలుచేసి యున్నారు.

ప్రతివాది నెం.2 అయిన మీరు పైన పేర్కొన్న కోర్టులో స్వయంగా లేదా తగిన సూచనలతో కూడిన మరియు దావాలో లేవనెత్తిన అన్ని ముఖ్యమైన ప్రశ్నలకు సమాధానం ఇవ్వగల ప్లీడర్ ద్వారా లేదా అటువంటి ప్రశ్నలన్నింటికీ సమాధానం ఇవ్వగల వ్యక్తితో పాటు తేది: 28/04/2025 న మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరు కావాలని ఇందుమూలంగా ఆదేశించడమైనది

దావాలో పైన పేర్కొన్న తేదీన మీరు హాజరు కాని యడల, అది విచారించబడి, మీకు పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది

ఇది 04/04/2025 తేదీన నా స్వహస్తాలతో మరియు కోర్టు ముద్రతో ఇవ్వబడింది.

న్యాయవాది సేవకోసం: శ్రీ యస్. గోపాలకృష్ణ, అడ్వకేట్, కోర్టు కాంప్లెక్స్, చిక్కబళ్లాపుర- 562101.

డిసి ఉత్తర్వుల మేరకు

కోర్టు ఆదేశం ప్రకారం, డిప్యూటీ కమిషనర్, చిక్కబళ్లాపుర జిల్లా.

ఘనంగా సత్యసాయి ఆరాధనోత్సవం



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా ఆరాధనోత్సవం గురువారం ఘనంగా జరిగింది. స్థానిక మంగమూరు రోడ్డు జడ్పీ కాలనీలోని సత్యసాయిబాబా మందిరంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గాయత్రి హోమంలో ఆయన హోమద్రవ్యాలను సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్య సాయిబాబా సేవాతత్పరతకు నిదర్శనమని, ఆయన బోధనల స్ఫూర్తితో ఒంగోలు సత్యసాయి మందరం వారు చలివేంద్రాల నిర్వహణ, రిమ్స్‌లో ఉచిత భోజనం మొదలైన సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సత్యసాయిసేవా సమితి కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టెన్త్‌లో నారాయణ విద్యార్థుల విజయభేరి



విద్యార్థులతో కలిసి అభివాదం చేస్తున్న స్కూలు ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఒంగోలు నగరం లాయర్‌పేటలోని నారాయణ సీవో అండ్ ఒలింపియాడ్ స్కూలు విద్యార్థులు విజయభేరి మోగించారు. పి.లక్ష్మీసాహితి 597, ఎం.రోహిరాయ్ 595, పి.శాన్వి 594, వి.దాక్షిగణేష్ 592, జి.హాసినివిముద 591, ఎ.శ్రీఅనిష్, పి.యశస్వినిలు 590 మార్కులు సాధించారు. అలాగే 590కిపైగా ఏడుగురు, 585కు పైగా మార్కులను 12మంది, 580కిపైగా 22మంది, 550కిపైగా 61 మంది మార్కులు పొందారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక స్కూలులో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సయ్యద్‌నాగూర్‌వలి మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో నారాయణ సంస్థల విద్యార్థులు ఎప్పుడు ముందంజంలో ఉంటారని తెలిపారు. అందుకు తగిన సహకారాన్ని అందించిన విద్యార్థు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో నారాయణ స్కూల్స్ ఏజీఎం నర్రావుల పెద్దిరెడ్డి, కోఆర్డినేటర్ దాసరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు ఆటల పోటీలు



ఆటలపోటీల్లో పాల్గొన్న సచివాలయ ఉద్యోగులు

చీమకుర్తి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పి.నాయుడుపాలెంలో గ్రామంలో గురువారం సచివాలయ ఉద్యోగులకు ఆటల పోటీలను నిర్వహించారు. సర్పంచ్ బి.కరుణప్రియ, మాజీ సర్పంచ్ కె.కరుణాకరరెడ్డి ఆధ్వక్షతన జరిగిన వేడుకల్లో తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి ఉద్యోగులకు ఆటలపోటీలను నిర్వహించారు. మ్యూజికల్‌చైర్‌లో పి.నాయుడుపాలెం, టగ్ ఆఫ్ వార్‌లో తొర్రగుడిపాడు ఉద్యోగులు బహుమతులు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. గాడిపర్తివారిపాలెంలో జరిగిన వేడుకల్లో డీఎల్‌పీవో పద్మ, డిప్యూటీ ఎంపీడీవో అజిత, ఏతఈ శాంతిప్రియలు పాల్గొన్నారు. గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ అయ్యవీరయ్య, కార్యదర్శి సునీల, నాయకులు వేణు, ప్రసాద్, వెంకటరావు, కృష్ణారావు, రామాంజనేయులు పాల్గొన్నారు.

బేళ్లలో అన్యపదార్థాలు లేకుండా చూడాలి



పొగాకు కొనుగోలును పరిశీలిస్తున్న చైర్మన్ యశ్వంత్‌కుమార్

టంగుటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పొగాకు బేళ్లలో అన్యపదార్థాలు లేకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ రైతులకు సూచించారు. గురువారం టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులు, రైతు నాయకులతో సమావేశం నిర్వహించారు. పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి అమ్మకానికి తెచ్చే ముందురోజే పొగాకు మార్కెట్‌ను రైతులు పరిశీలించుకోవాలన్నారు. తెలపర, బొగులు రకం పొగాకును వేలానికి తేవద్దన్నారు. ఆయన వెంట పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు, పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బ్రహ్మయ్య, వేలం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి

మద్దిపాడు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ప్రజల్లో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఏవో రమేష్‌బాబు అన్నారు. గురువారం మద్దిపాడులో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు తమ సొంత భూమిలో కొంత భాగాన్ని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించాలన్నారు. దీనివల్ల వచ్చే ఆహార పదార్థాలలో ఎన్నో రకాల పోషక విలువలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాల ప్రోత్సాహానికి కమిటీలు

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాల్ని సమర్థంగా అమలు చేయడానికి, రాష్ట్రంలో 10 వేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహం అందించే లక్ష్యంతో రాష్ట్ర స్థాయిలో సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయిలో పర్యవేక్షణ కమిటీల ఏర్పాటుకు సవరించిన మార్గదర్శకాలతో ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నాబార్డు అధికారులు సభ్య కార్యదర్శులుగా ఉండే రాష్ట్ర కమిటీకి వ్యవసాయశాఖ డైరెక్టర్, జిల్లా కమిటీకి జిల్లా వ్యవసాయ అధికారి సభ్య కార్యదర్శులుగా వ్యవహరిస్తారని తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో సమానంగా చూడాలని తెలిపింది. ఎఫ్‌పీవోలకు ఎరువుల సరఫరా, ఎఫ్‌పీవోల ఉత్పత్తులకు మార్కెటింగ్, విలువ జోడింపునకు మౌలిక సదుపాయలు కల్పించనున్నట్లు పేర్కొంది.

పాలిసెట్ హాల్ టికెట్లు విడుదల

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 30న నిర్వహించనున్న పాలీసెట్ హాల్ టికెట్లు విడుదల చేసినట్లు సాంకేతిక విద్యా శాఖ, శిక్షణ బోర్డు గురువారం తెలిపింది. విద్యార్థులు ఏపీ పాలీసెట్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఓ ప్రకటనలో పేర్కొంది. హాల్ టికెట్లు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని, పోస్టు లేదా ఇతర ఆఫ్‌లైన్ మార్గాల్లో పంపబోమని స్పష్టం చేసింది. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా ముందుగానే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

ఇవేం అనుమతులు..!

● నిబంధనలు లేకుండా దుకాణాల నిర్మాణం



హౌసింగ్ బోర్డు కాలనీలో నిబంధనలు పాటించకుండా నిర్మించిన దుకాణాలు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యంతో నగరంలో పలు కట్టడాలు నిబంధనలు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయి. సామాన్యులు ఇల్లు కట్టుకోవాలంటే అధికారులు టౌన్ ప్లానింగ్ అనుమతులు, సెట్ బ్యాక్, నిబంధనలు ఇలాంటివి వంద చెప్పి మరీ ముప్పతిప్పలు పెడుతుంటారు. దీంతో సామాన్యుడు సొంతిల్లు నిర్మాణానికి అడ్డంకులు ఎదురవుతుండగా, కాస్తంత పలుకుబడి కలిగిన వారికి మాత్రం ఇవేమీ వర్తించడం లేదు. ముఖ్యంగా ఇంటి నిర్మాణం కంటే వ్యాపార సముదాయాలకు సంబంధించి నిర్మించే కట్టడాలకు కఠినమైన నిబంధనలు ఉండాలి. కానీ నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఐడీఎస్ఎంటీ స్థలాల్లో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. యజమానులు ప్లాను ఉందని పేర్కొంటుండగా, పట్టుమని పది అడుగులు కూడా లేని షాపులకు నిర్మాణాలు ఎలా మంజూరు చేస్తారో అధికారులకే తెలియాలి. టౌన్‌ప్లానింగ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌పై కన్నెత్తి చూడకపోవడం, జనం ఇవేమి అనుమతులంటూ విమర్శిస్తున్నారు.

గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

● టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ
● ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ బాలాజీ, మేయర్ సుజాత

ఒంగోలు(రూరల్), ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధే అక్ష్యంగా సర్పంచ్‌లు పని చేయాలని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ కోరారు. గురువారం ఒంగోలులోని మల్లయ్యలింగభవన్‌లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌ల సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రాచారి అధ్యక్షతన జరిగిన సభలో చైర్మన్ బాలాజీ మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలు నెరవేర్చాల్సిన బాధ్యత సర్పంచ్‌లపై ఉందన్నారు. గ్రామాల అభివృద్ధితో ప్రజలు నగరాలకు వలసలు ఆగుతాయని చెప్పారు. నగర మేయర్ గంగాడ సుజాత మట్లాడుతూ సర్పంచ్‌లుగా మహిళలు 33శాతం ఉండటంతో మహిళల నాయత్వం పెరుగుతుందని చెప్పారు. అనంతరం వీరభద్రాచారి మాట్లాడుతూ జిల్లాలోని సర్పంచ్‌లు తమ సమస్యలపై పోరాటం చేయాలన్నారు. మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళుల ర్పించారు. పలువురు సర్పంచ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లాలోని గ్రామ స ర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో..

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజశేఖర్‌రావు మాట్లాడుతూ సర్పంచ్‌లు గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాలచెన్నయ్య, ఏవో యు.శేషుబాబు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో విద్యుత్ సమస్యలకు చెక్

● వినియోగంలోకి డబుల్ సర్క్యూట్ లైన్
● ప్రారంభించిన ఈఈ హరిబాబు
● వేసవిలో మండలవాసులకు తప్పనున్న కరెంట్ కష్టాలు

చీమకుర్తి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలవాసులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న విద్యుత్‌పరమైన అంశం సాకారమయింది. నిరంతర విద్యుత్‌ను వినియోగదారులకు అందించే నిమిత్తం అవసరమైన 33కేవీ డబుల్ సర్క్యూట్‌లైన్‌ను ఉప్పలపాడు నుంచి చీమకుర్తి వరకూ దాదాపు రూ.1.50కోట్లతో ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి ఈఈ మాకినేని హరిబాబు డబుల్ సర్క్యూట్ లైన్‌ను చార్జ్ చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో మండలపరిధిలోని వినియోగదారులకు వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు వీలుకలుగుతుంది. దీనికి సంబంధించిన పనులు గత నాలుగునెలలుగా జరుగుతుండటంతో పల్లామల్లి, నాయుడుపాలెం తదితర సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులకు పగలు తొమ్మిది గంటల పాటు త్రీ ఫేస్ విద్యుత్‌ను సరఫరా చేయటంలో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. రాత్రివేళ విద్యుత్ సరఫరాతో రైతులు సైతం ఇక్కట్లుకు గురయ్యారు. ఇక ఇపుడు ఈ కష్టాలకు చెక్ పడ్డట్లయింది. పగలు తొమ్మిది గంటలపాటు త్రీ ఫేస్ విద్యుత్‌ని సరఫరా చేయవచ్చు. కార్యక్రమంలో డీఈఈలు మోహనరావు, సత్యనారాయణ, ఏఈలు టి.చంద్రశేఖర్‌రావు, శ్రీనివాసరావు, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువకు మోక్షం ఎప్పుడో?

● ముందుకు కదలని మురుగు



కాలువలో పేరుకున్న మురుగు



అధ్వానంగా ఉన్న సైడుకాలువ

మద్దిపాడు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని ఎస్సీ హాస్టల్ సమీపంలో డ్రైనేజీ ఏర్పాటు చేయకపోడంతో దుర్గంధం వెదజల్లుతోంది. స్థానిక అరుంధతినగర్‌లో నుంచి వచ్చే మురుగు ఈ కాలువ ద్వారానే ప్రవహించాలి. అయితే అక్కడి నుంచి హైవే సైడు కాలువలోకి వెళ్లే డ్రైనేజీ సక్రమంగా లేదు. దీంతో మురుగు నిలిచి దోమలు ఆవాసంగా మారింది. ఈక్రమంలో ఎస్సీ హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటితో హాస్టల్‌లోకి రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. ప్రజలు ఈ రహదారిలో వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువను పూర్తిస్థాయిలో నిర్మించి మురుగు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కందిపప్పు కరువాయే..

● రేషన్ దుకాణాలకు ఆగిన సరఫరా
● కార్డుదారుల ఆవేదన



సంతనూతలపాడు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు కందిపప్పు కరువైంది. ప్రభుత్వం కిలో రూ.67ల చొప్పున కార్డుదారులకు అందజేసేది. గత మూడు నెలలుగా సరఫరా ఆగిపోయింది. బహిరంగమార్కెట్‌లో ధరలు మండిపోతున్నాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో అంగనవాడీ కేంద్రాలు, ప్రభుత్వపాఠశాలలు, వసతిగృహాలకు మాత్రమే కందిపప్పు సరఫరా అవుతోంది. 2014-19 మధ్య కాలంలో ఏడాదికి ఒకసారి టెండర్లను పిలిచి కందిపప్పును ప్రతీనెలా అందించేవారు. గత వైసీపీ ప్రభుత్వంలో రెండు, మూడు నెలలకొకసారి టెండర్లను పిలిచారు. అరకొరగా దుకాణాలకు సరఫరా చేసేవారు. కాంట్రాక్టర్‌కు సకాలంలో సొమ్ములు చెల్లించకపోవడంతో ఎవరూ ముందుకు రాలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనవరి నెల వరకు కందిపప్పు పంపిణీ జరిగింది. టెండరు ముగియడంతో సరఫరాకు అడ్డుకట్ట పడింది. ఇదంతా గత ప్రభుత్వ వైఖరితోనే సమస్య తలెత్తిందని సంబంధిత శాఖలో చర్చ సాగుతోంది. వైసీపీ పాలనలో ఎండీయూ వాహనాల ద్వారా రేషన్‌సరుకులు అందజేశారు. డీలర్లు, వాహనదారులు కుమ్మక్కై కార్డుదారులతో వేలిముద్రలు వేయించుకుని అప్పట్లో బియ్యం ఒక్కటే పంపిణీ చేసిన సందర్భాలు ఉన్నాయి. కూటమీ ప్రభుత్వం రాగానే ఆరు రకాల సరుకులు ఇవ్వాలని నిర్ణయించారు.

బయట కొనలేక..

ప్రతీనెలా ఒకటో తేదీ నుంచి బియ్యం పంపిణీ బాగానే కొనసాగింది. కందిపప్పుకోసం లబ్ధిదారులకు ఎదురుచూపులే మిగిలాయి. గత మూడు నెలలుగా అధికారులు మాత్రం కందిపప్పు వస్తాయి.. రేషన్‌దారులకు ఇస్తామనే చెబుతున్నా నేటికి కందిపప్పు రాలేదని కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదీ గాక బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర పెరిగింది. మొదటి రకం కిలో రూ.150, రెండోరకం రూ.125, మూడవరకం రూ.115 ధర పలుకుతోంది. అదే రేషన్ దుకాణాల్లో సగానికి సగం ధరకు లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తోంది. దాదాపు లబ్ధిదారులు అందరూ తీసుకునేవారు. ప్రస్తుతం కందిపప్పు సరఫరా లేకపోవడంతో బయటమార్కెట్లో కందిపప్పును కొనలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు మాట్లాడుతూ మూడు నెలల నుంచి కందిపప్పు రావడం లేదని, ఉన్నతాధికారులకు నివేదించినట్లు చెబుతున్నారు.

మండలం	కార్డుదారులు
సంతనూతలపాడు	40,827
మద్దిపాడు	44,015
ఎన్.జి.పాడు	55,883
చీమకుర్తి	69,536
మొత్తం	2,10,261





రాకపోకలకు ఇబ్బందిపడుతున్న వాహనదారులు

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

ఒంగోలు నగరం కొణిజేడు బస్టాండ్ వద్ద గల ఆర్పీ మెయిన్‌రోడ్డులో డ్రైనేజీ కాలువలు అధ్వానంగా ఉన్నాయి. దీంతో మురుగు ప్రవాహం సక్రమంగా ఉండటం లేదు. దీంతో కాలువలు నిండి రోడ్డుపై మురుగు ప్రవహిస్తున్నది. గురువారం రోడ్డుపై మురుగు ప్రవాహం జరగడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందిపడ్డారు. దుర్గంధంతో ముక్కుమూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

- ఒంగోలు, ఆంధ్రజ్యోతి

12 మద్యం షాపులకు రీనోటిఫికేషన్

అమరావతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గతేడాది అమల్లోకి వచ్చిన మద్యం పాలసీలో మిగిలిపోయిన 12 మద్యం షాపుల వేలానికి ఎక్సైజ్ శాఖ గురువారం రీనోటిఫికేషన్ జారీ చేసింది. మే 3 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించింది. మే 5న లాటరీ ద్వారా షాపులను కేటాయించనున్నట్లు తెలిపింది. గతంలో ప్రకటించిన మద్యం పాలసీ నిబంధనలే ఈ షాపులకూ వర్తిస్తాయి. దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.

నేడు కనిగిరిలో ప్రజావేదిక

పీసీపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కనిగిరిలో ప్రజావేదిక జరుగుతుందని ఎంపీడీవో ప్రభాకరశర్మ తెలిపారు. సమస్యలపై వచ్చేవారు అర్జీ జెరాక్స్ కాపీ, ఆధార్‌కార్డు తీసుకు రావాలన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డైట్ పోస్టులకు ఇంటర్వ్యూలు పూర్తి



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మైనంపాడులోని డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న 23 అధ్యాపకులు పోస్టులను డిప్యుటేషన్ విధానంలో భర్తీ చేసేందకు గురువారం ఒంగోలులోని గ్రీవెన్స్ హాలులో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ చైర్మన్‌గా, డీఈవో కిరణ్‌కుమార్, డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు సభ్యులుగా ఉన్న కమిటీ ఈ ఇంటర్వ్యూలు చేపట్టారు. 33 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇంటర్వ్యూలకు 50 మార్కులు కేటాయించారు. అభ్యర్థులకు మొదట నిర్వహించిన ట్యాబ్ ఆధారిత పరీక్ష, ఇంటర్వ్యూ మార్కులు కలిపి మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రైజ్ విద్యార్థులకు ఉద్యోగాలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న 33మంది విద్యార్థులు ఫేస్ ప్రెష్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు గురువారం తెలిపారు. ఉద్యోగాలకు ఎంపిక అయిన వారికి వార్షిక వేతనంగా రూ.3.06లక్షల నుంచి రూ.5లక్షలు వరకు లభిస్తుంది. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, కోశాధికారి శిద్దా భరత్, శిద్దా ప్రవల్లిక, ఏవీ.భాస్కరరావు, రఘుబాబు అభినందించారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

కొండపి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కొండపి నియోజవకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ డిమాండ్ చేశారు. వైసీపీ జిల్లా నాయకుడు చుండూరి రవితో కలిసి కొండపిలోని పొగాకు వేలం కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పటికీ, ఇప్పటికీ మేలిమి రకం పొగాకుకు క్వింటాల్‌కు 10 వేల రూపాయల తక్కువ ఉందని ఆయన అన్నారు. గిట్టుబాటు ధర కల్పించేందుకు వైసీపీ పోరాడుతుందన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

మద్దిపాడు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వేసవిలో చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సీడీపీవో ఇవాంజలిన్ పేర్కొన్నారు. గురువారం మద్దిపాడులోని సీడీపీవో కార్యాలయంలో సూపర్‌వైజర్స్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారని అభినందించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వేసవికాలంలో పోషకాహారాన్ని అందించాలన్నారు. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. బాలింతలు గర్భిణుల ఆరోగ్యంపై కూడా ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పద్మావతి, జయలక్ష్మి, సీహెచ్.శివ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలను తగ్గించాలి

మద్దిపాడు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసరాల ధరలను తగ్గించాలని సీపీఎం నాయకురాలు ఉబ్బా ఆదిలక్ష్మి కోరారు. గురువారం మద్దిపాడులో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పెంచిన గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కనపర్తి సుబ్బారావు, కాకుమాను సుబ్బారావు పాల్గొన్నారు.

7నుంచి మల్లవరం వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఈవో, ఆలయ కమిటీ సభ్యులు

మద్దిపాడు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మే 7 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి దామా నాగేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక దేవస్థానం ఆవరణలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను గ్రామ పెద్దల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వ తేదీన అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 14వ తేదీన కళ్యాణోత్సవం ఉంటుందని చెప్పారు. సామాజిక వర్గాల వారీగా ఆయా సంఘాల తరఫున బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజు రాత్రి వివిధ వాహనాలపై శ్రీవారు గ్రామ వీధులలో విహరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, శ్రీవారి వనం కమిటీ అధ్యక్షుడు మార్నేని కృష్ణారావు, మార్నేని రాఘవేంద్రరావు, నారిపెద్ది వరహాలుచౌదరి, బాబూరావు, మార్నేని సుబ్బారావు, పొన్నం వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, ముప్పవరపు ధనలక్ష్మి పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



వీరయ్యచౌదరి మృతికి సంతాపంగా మౌనం పాటిస్తున్న సభ్యులు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. తొలుత మండల పరిషత్ కార్యాలయం ప్రవేశద్వారం పక్కన ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని ఎంపీపీ అంజమ్మ ఆవిష్కరించారు. అనంతరం ప్రారంభమైన సమావేశంలో చవటపాలెం ఎంపీటీసీ సభ్యురాలు ముప్పవరపు సుచిత్ర భర్త, మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి అకాల మృతికి నిరసనగా మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. శాఖల అధికారులు తమ నివేదికలు వినిపించగా వాటిపై ఎలాంటి చర్చ జరగకుండానే సమావేశం ముగిసింది. కార్యాలయంలో 2021-2026 మండల పరిషత్‌పాలకవర్గ సభ్యుల వివరాల శిలాఫలకాన్ని ఎంపీపీ అంజమ్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహాలక్ష్మి, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైసీపీపై అసత్య ప్రచారం తగదు

● నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో లిక్కర్ అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు వైసీపీపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జీ చుండూరి రవిబాబు ఆరోపించారు. గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో ప్రభుత్వ రంగంలో ఉన్న మద్యం దుకాణాలను మూసి వేసిన కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారని, దీంతో లిక్కర్ మాఫియా భారీ అవినీతికి పాల్పడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో దుంపా చెంచిరెడ్డి, రాజీవ్, దేవా, వేముల శ్రీకాంత్, పులుసు శ్రీకాంత్, ఖాదంరన్, తన్నీరు సాయికృష్ణ, షేక్ ముజీమ్ పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

28 నుంచి వేసవి శిక్షణ శిబిరం

గిద్దలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖగ్రంథాలయం ఆవరణలో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తారన్నారు. విద్యార్థులకు కథలు చదివి వినిపించడం, వ్యాయామం, గేమ్స్, పుస్తకాలపై సమీక్ష, డ్రాయింగ్, పెయింటింగ్, మ్యూజిక్, క్యారమ్స్, స్పోకెన్ ఇంగ్లీషు తదితర విషయాలు నేర్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బేస్తవారపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 26న ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఏంపీడీవో ఏవీ.రంగనాయకులు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సభ్యులు, అధికారులు తగు సమాచారంతో హాజరుకావాలన్నారు.

వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం


దగ్ధమవుతున్న వరిగడ్డి

తర్లుపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులోని రైల్వేగేటు సమీపంలో విద్యుత్ తీగలు తాకడంతో వరిగడ్డికి మంటలు వ్యాపించాయి. దీంతో ట్రాక్టర్ దగ్ధమవుతుండడంతో డ్రైవర్ అప్రమత్తమై రోడ్డుపై ట్రక్కును ఎత్తి ట్రాక్టర్‌ను పక్కకు తీశాడు. దీంతో మార్కాపురం, తర్లుపాడు రోడ్డుపై వరిగడ్డి దగ్ధమవుతుండటంతో అరగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నంద్యాల నుంచి వరిగడ్డి తీసుకొస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. చుట్టుప్రక్కల ప్రజలు నీటిని తెచ్చి మంటలను అదుపుచేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి). మండలంలోని దరిమడుగు గ్రామ పరిధిలోని జాతీయ రహదారి వెంబడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ అంకమ్మరావు గురువారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 65 సంవత్సరాల ఉంటుందన్నారు. వృద్ధుడు ఆ ప్రాంతంలో రెండు రోజలుగా తిరుగుతూ ఉంటున్నాడని స్థానికులు తెలిపారు. వడదెబ్బ కారణంతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ అంకమ్మరావు కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సర్వజన వైద్యశాలకు తరలించారు.

కుక్కలదాడిలో 14 గొర్రెల మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

తర్లుపాడు, ఏప్రిల్ 24 ఆంధ్రజ్యోతి: మండలంలోని గానుగపెంటలో గురువారం ఉదయం గొర్రెల మంద పై కుక్కలు దాడి చేయడంలో 14 గొర్రెలు మృతి చెందాయి. అమ్మనబ్రోలు శీనుకు చెందిన గొర్రెలను గ్రామశివారు దొడ్డిలో తోలి ఇంటికి వచ్చిన సమయంలో కుక్కలు దాడి చేశాయి. చనిపోయిన గొర్రెల విలువ సుమారు రూ.1.75లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. దీంతో లబోదిబో మంటున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని శీను కోరారు.

కాలుతున్న నరవ కొండ


తగలబడుతున్న కొండ

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరవ గ్రామంలోని నరసింహ స్వామి కొండపై గురువారం సాయంత్రం మంటలు లేచాయి. కొండ చుట్టూ మంటలు చెలరేగడంతో అక్కడున్న చిన్న చిన్న జంతువులు, చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో కొండ మొత్తం మంటలు చెలరేగాయి. మంటలను అదుపు చేయడం కష్టంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ట్రాక్టర్- మోటారుసైకిల్ ఢీకొనడంతో ఘటన

బేస్తవారపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):బేస్తవారపేట మండలం గలిజేరుగుళ్ల వద్ద ట్రాక్టర్,మోటార్‌సైకిల్ ఢీ కొనడంతో మోటార్ సైకిలిస్ట్ మృతిచెందాడు. సీఎస్.పురం మండలం పిల్లిపల్లె గ్రామానికి చెందిన చిన్న కొండు అచ్చయ్య(24) మృతి చెందాడు. గలిజేరుగుళ్ల నుంచి చెన్నపల్లెకు మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా, చెన్నుపల్లె నుంచి గలిజేరుగుళ్లకు ట్రాక్టర్ వస్తుండగా, ఎదురుగా ఢీకొన్నాయి. బేస్తవారపేట ఏస్సై రవీంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

చెరువుకొమ్ము తాండలో పట్టపగలు చోరీ

● రూ.2 లక్షలు నగదు అపహరణ

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) త్రిపురాంతకం మండలం చెరువుకొమ్ము తాండాలో ఆర్ శౌర్యానాయక్ ఇంటిలో పట్టపగలు ఇంట్లో ఎవరులేని సమయంలో రూ.2లక్షలు నగదు దొంగలు అపహరించుకు వెళ్లారు. ఈ ఘటన గురువారం పట్టపగలే చోటుచేసుకొంది. దర్యాప్తు చేసేందుకు ఒంగోలు నుంచి క్లూస్ టీం పిలిపించి, ఘటన స్థలంలో వేలిముద్ర నమూనాలు సేకరించారు. యజమాని శౌర్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రిపురాంతకం ఎస్.ఐ బసవరాజు తెలిపారు.

ద్విచక్రవాహనదారుడికి రక్తగాయాలు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) త్రిపురాంతకం మండలం అన్నసముద్రం మెట్టవద్ద కర్నూలు, గుంటూరు జాతీయ రహదారి ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనం, కారు ఢీకొన్న సంఘటన గురువారం జరిగింది. ఈ ప్రమాదంలో మండలంలోని నడిగడ్డ గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు మౌలాలి కి రక్త గాయాలై త్రిపురాంతకం వైద్యశాలలో చికిత్సపొందుతున్నారు.ఈ ప్రమాదం విషయంపై పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

తీవ్రమవుతున్న నీటి సమస్య

పొదిలి, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రమౌతుంది. తాగు, వాడుకనీటి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం స్థానిక పోలేరమ్మగుడి, శ్రీపతినగర్, రాజీవ్‌నగర్ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నామని నిరసన తెలిపారు. నగర పంచాయతీ, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. గతంలో ట్యాంకర్లు వచ్చేవని ఇప్పుడు రావడం లేదన్నారు. డ్రమ్ముల రూ.40, బబుల్ తాగునీరు రూ.15 రూపాయలు పెట్టి కొనలేకపోతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటి సమస్య తొలగించాలని వారు కోరారు.

పట్టణంలో తాగునీటికి కటకట..

● మే నాటికి మరింత తీవ్రమయ్యే పరిస్థితి ● ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరుతున్న స్థానికులు


బాపూజీ కాలనీలో నీళ్ల కోసం బిందెలతో దూరప్రాంతానికి వెళ్తున్న మహిళలు

మార్కాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఒకవైపు భూగర్భ జలాలు అడుగంటి డీప్‌బోర్లు మొరాయిస్తున్నాయి. మరోవైపు పది రోజులకొకసారి సాగర్ నీటిని సరఫరా చేస్తుండడంతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. ప్రధానంగా సాగర్‌నీటి సరఫరాలేని ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. దూరప్రాంతాల్లోని డీప్‌బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఇలాంటి ప్రాంతాల్లో వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ నీటిని సరఫరా చేసేందుకు ముందుకు రావడంలేదు. వేసవి ఉధృతి పెరిగితే మే నెలలో నీటికోసం ప్రజలు మరింత ఇబ్బందులుపడే పరిస్థితులు నెలకొనకమానవు. పాలకులు, అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టిపెట్టి వెంటనే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.


సైకిల్‌పై వెళ్లి నీటిని తెచ్చుకుంటున్న బాలుడు

వారానికొక సారే సాగర్‌నీరు

మార్కాపురం పట్టణంలోని 80 శాతం ప్రాంతానికి సాగర్‌నీటి పైప్‌లైన్ ఉంది. ప్రస్తుతం దూపాడులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో సమృద్ధిగా నీళ్లున్నాయి. కానీ దూపాడు నుంచి బోడిరెడ్డిపల్లె జంక్షన్ వరకు తరచూ పైప్‌లైన్ పగులుతుండడంతో మరమ్మతుల కారణంగా సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటి వరకు నాలుగు రోజులకొకసారి సాగర్ నీటి సరఫరా జరిగేది. కానీ ప్రస్తుతం వారం నుంచి పది రోజులకొకసారి మాత్రమే నీటిని అందిస్తున్నారు. ఆ రోజు కూడా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉంటే పర్వాలేదు. లేదంటే మరో పది రోజుల వరకు నీటి కోసం వేచి వుండాల్సిందే. ఇలాంటి పరిస్థితి నేపథ్యంలో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

శివారుకాలనీల్లో నీటికోసం పాట్లు

సాగర్‌నీటి పైప్‌లైన్‌లేని శివారు కాలనీల్లో ప్రజలు నీటికి తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో ఆయా ప్రాంతాల్లోని డీప్‌బోర్లు ప్రస్తుతం మొరాయి స్తున్నాయి. పర్యవసానంగా శివారు ప్రాంతాల్లోని ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని పట్టుకుని రావల్సివస్తోంది. అంతా ఏ రోజుకారోజు పని చేసుకుని పొట్టపోసుకునే వాళ్లే శివారు ప్రాంతాల్లో ఎక్కువశాతం ఉండేది. క్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో నీటి కోసమే ఎక్కువ సమయాన్ని కేటాయించాల్సి వస్తోంది. కాయాకష్టం చేసుకునే పేద ప్రజలకు నీటి తిప్పలతో కడగండ్లు మిగులుతున్నాయి.

ట్యాంకర్ల ద్వారా సరఫరానే ప్రత్యామ్నాయం

గతంలో ఏప్రిల్ ఆరంభం నుంచే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరిగేది. ఈ సంవత్సరం కూడా మున్సిపాలిటీ అధికారులు ఏఎస్‌సీ గ్రాంట్ కోసం ముందుగానే ప్రతిపాదనలు పంపారు. రోజుకు 100 ట్రిప్పుల చొప్పున నీటిని సరఫరా చేయాల్సి ఉంటుదని ఉన్నతాధికారులకు తెలిపారు. అన్ని మున్సిపాలిటీల్లో పరిస్థితిపై కలెక్టర్ ప్రభుత్వానికి మార్చిలోనే నివేదిక పంపారు. దీంతో ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు మార్కాపురం పురపాలక సంఘానికి రూ. 40 లక్షలు మంజూరు చేసింది. ఇప్పటికి రెండుసార్లు మున్సిపాలిటీ అధికారులు టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్ల నుంచి ఎలాంటి స్పందనలేదు. ప్రస్తుతం మరోసారి టెండర్లు పిలిచేందుకు మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగం సిద్ధమైంది.

రుణాల రికవరీ నూరుశాతం పూర్తి చేయాలి

డీఆర్‌డీఏ పీడీ నారాయణ



మాట్లాడుతున్న పీడీ నారాయణ

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 24 : (ఆంధ్రజ్యోతి) స్వయం సహాయక సంఘ సభ్యుల వద్ద నుంచి రుణాల రికవరి నూరుశాతం పూర్తి చేయాలని డీఆర్‌డీఏ వెలుగు పీడీ నారాయణ కోరారు. స్థానిక ఎస్సీ, బీసీ, కాలనీలోని డ్వాక్రా బజారులో గురువారం యర్రగొండపాలెం, మార్కాపురం క్లస్టర్ పరిధిలోని డీఆర్‌డీఏ వెలుగు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో వీవోఏలు సిబ్బంది మహిళల ఆర్థికాభివృద్దే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ ప్రాజెక్టు ద్వారా అందిస్తున్న సేవలను, లబ్ధిని మహిళలకు వివరించాలన్నారు. గ్రామ స్థాయిలో నిలిచిన స్త్రీనిధి, ఉన్నతి, ఎస్‌పీఈపీ బకాయిలను సకాలంలో చెల్లించి గ్రామ సంఘంలో మెండి బకాయిలు లేకుండా చేయాలని కోరారు. సంఘాల సభ్యులతో సకాలంలో సమావేశాలు నిర్వహించి లావాదేవీల వివరాలను పొందుపరిచి యాప్ ద్వారా సమాచారాన్ని సెర్ప్‌కు పంపి గ్రూపులు ఎ గ్రేడ్‌లో ఉండేలా పనిచేయాలని కోరారు. గ్రామాలలో మహిళలతో స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని కోరారు. వీవోఏల వారిగా ఆ గ్రామ సంఘం స్థితిని వివరించి వారిక పలు సలహాలు సూచనలు తెలియ జేశారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం హర్షవర్దన్, మార్కాపురం క్లస్టర్ సమన్వ యకర్త ఒంగోలు సుధాకర్, దానం యర్రగొండ పాలెం ఏసీ, బీపీఎం సుబ్బారావు, మార్కాపురం, తర్లుపాడు, పొదిలి, కొనకనమిట్ల పీఎంపీలు డి.పిచ్చయ్య, పి.రమేష్ బాబు, గోపాలకృష్ణ, శ్రీనివాస్, ఎడ్లర్, కృపమ్మ, వెంకటయ్య, స్త్రీనిధి మేనేజర్ సులోచన, ఐబి డీపీఎం నరశింహరావు, సుధాకర్, యల్‌సి నాగభూషణం, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

వేడుకగా చెన్నయ్య వసంతోత్సవం


వసంతోత్సవంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుడు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో గురువారం వేడుకగా వసంతోత్సవాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా చెన్నకేశవస్వామికి 12 రోజుల వివిధ వాహనసేవల అనంతరం వసంతోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవ స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం సుప్రభాతసేవ, అభిషేకాలు, సహస్ర నామార్చన, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ పెరుమాళ్ ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు, వసంతోత్సవాలు నిర్వహించారు. 4 మాడ వీధులలో నగరోత్సవం నిర్వహించి పసుపు, పన్నీరు భక్తులపై చల్లారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యక్కలి కాశీవిశ్వనాథం, సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఉగ్రదాడికి వ్యతిరేకంగా వీరమహిళల నిరసన


ర్యాలీ నిర్వహిస్తున్న వీరమహిళలు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో ఉగ్ర వాదులు పర్యాటకులపై జరిపిన దాడులు హేయమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్‌రెడ్డి ఆక్షేపించారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడులను ఎన్‌డీఏ కూటమి నాయకులు ఖండిస్తూ స్థానిక నటరాజ్ కూడలిలో గురువారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మానవత్వం నశించి పర్యాటకులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి హతమార్చిన తీరు దారుణమన్నారు. రాక్షసుల్లా ప్రవర్తించిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొడ్డా శేషాద్రి, షేక్ మంజూర్ భాష, తాతిరెడ్డి, జనసేన నాయకులు గుర్రాల ప్రసాద్, మురళీ, పండు, బీజేపీ నాయకులు అశోక్‌రెడ్డి, మణి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం : జమ్మూకశ్మీర్ లోని పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా పట్టణం లో జనసేన వీర మహిళలు కొవ్వొత్తు లతో నిరసన ప్రదర్శన నిర్వహిం చారు. పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ పర్యవేక్షణలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక కంభం రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయం నుంచి కంభం బస్టాండ్ మీదుగా గడియారస్తంభం వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొందిలి కాశీరామ్‌సింగ్, కార్యదర్శి శిరిగిరి శ్రీనివాసరావు, నాయకులు విజయరావు నరసింహరావు, వీర మహిళలు పిన్నెబోయిన లక్ష్మీరాజ్యం, పూజ లక్ష్మి, మిరియాల వాసవీ ప్రియ, బాలబాయి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణలతో ముస్లింలకు న్యాయం

పొదిలి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ అమెండ్‌మెంట్ యాక్ట్‌పై జిల్లా స్థాయి అవగాహన సదస్సు గురువారం స్థానిక సాయి కళ్యాణమండపంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర ముస్లీం మోర్చ అధ్యక్షులు బాజీ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ ద్వారా పేద ముస్లింలకు న్యాయం జరుగుతుందన్నారు. వక్ఫ్ పాలన బలహీనంగా ఉందని అందుకనే వక్ఫ్ చట్టం-2025ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. జవాబుదారితనం లేకపోవడంతో ఆక్రమణలు, న్యాయస్థానాలకు అప్పీలుకు పోవడం, మంత్రిత్వశాఖలో ఫిర్యాదులు వంటివి జరుగుతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య మాట్లాడుతూ ముస్లిం వర్గాల సేవకొరకు ఉద్దేశించిన వక్ఫ్ భూమి కొంతమంది వ్యక్తులకు రియల్ ఎస్టేట్‌గా వ్యాపారంగా మారిందన్నారు. 2018 కేంద్రీయ వక్ఫ్ పరిషత్ నివేదిక ప్రకారం భారత్‌లో రూ.10లక్షల కోట్లకుపైగా అంచనా విలువైన ఎనిమిది లక్షల కోట్లకుపైగా ఆస్తులు ఉన్నాయన్నారు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ ద్వారా పేద ముస్లింలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జమ్మూకాశ్మీర్‌లో హిందువులపై దాడిని ఖండించారు. దాడికి కారణమైన నింధితులను కఠినంగా శిక్షించాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి విజయలక్ష్మీ, ఉపాధ్యక్షుడు మాకినేని అమరసింహ, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృష్ణారావు, బీజేపీ నాయకులు సయ్యద్‌మహ్మద్‌భాష, కె నాగేశ్వరరావు, షబానా, దోర్నాల రమణారెడ్డి, యుద్ధం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యలపై ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అధ్యక్షతన ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎర్రగొండపాలెం ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు గురువారం తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు ప్రజాదర్బార్ మీ అర్జీలు సమర్పించాలని కోరారు. అన్ని మండలాల టీడీపీ అధ్యక్షులు హాజరవుతారన్నారు.

బాలీశ్వరయ్యకు సన్మానం

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ అధ్యక్షులుగా నియమితులైన దుత్తా బాలీశ్వరయ్యను పలువురు టీడీపీ నాయకులు గురువారం, పూలమాలలతో సన్మానించారు. వారు ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో టీడీపీ నాయకులు పాలుగుళ్ల చిన్నశ్రీనివాసరెడ్డి, బిల్లా రమేష్, సంపత్‌కుమార్‌రెడ్డి, లొక్కు రమేష్, గిరి, ఓబయ్య, తదితరులు ఉన్నారు. బాలీశ్వరయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆశీస్సులతో దక్కిన పదవికి న్యాయం చేస్తానని, రైతులకు, ప్రజలకు మేలు చేసేలా పని చేస్తానని తెలిపారు.

మహిళల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం : ముత్తుముల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహిళ సాధికారతే ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ పైన ఉన్న సచివాలయంలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం మహిళ పక్షపాతి ప్రభుత్వమని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేదింటి మహిళలు ఆర్థికంగా ముందడుగు వేయాలనే ఉద్దేశ్యంతోనే కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఆ దిశగానే గిద్దలూరులో ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తూ దీపం పథకం-2 ద్వారా ఇప్పటికే ఉచిత సిలిండర్లు అందచేస్తున్నామని పేర్కొన్నారు. జూన్ నాటికి ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం నగదు వారి అకౌంట్లలో జమ చేస్తామన్నారు. గత వైసీపీ పాలకుల లాగా మాటల ప్రభుత్వం కాదని, చెప్పిన ప్రతి పథకాన్ని అమలు చేసి తీరుతా మన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, కమీషనర్ ఐ.శ్రీనివాసులు, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, కౌన్సిలర్ బి.చంద్రశేఖర్ యాదవ్, పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, మార్తాల సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి ఆరాధన


సత్యసాయిబాబా ఆరాధనలో పూజలు చేస్తున్న భక్తులు

గిద్దలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రేమ సుధా మందిరం ఆవరణ లో శ్రీసత్యసాయిబాబా 14వ ఆరాధన మహోత్సవాన్ని వైభవం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని నగర సంకీర్తన చేశారు. లోకకళ్యాణార్థం సామూహికంగా గాయత్రి హోమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య, సేవా సమితి ప్రతినిధులు వాడకట్టు లక్ష్మీనారాయణ, శింగరి శేఖర్, ముప్పూరి కాశీశ్వరరావు, మల్లికార్జున, అమ్మవారిశాల అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి ఆరాధనోత్సవం

పెద్దదోర్నాల : స్థానిక సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సత్యసాయి ఆరాధనోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద సేవాసమితి కార్యాలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు మొగిలి గుప్త, బొగ్గరపు సుబ్బయ్య, రావిక్రింది నరసింహారావు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కృష్ణ

మార్కాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కంభం రోడ్డులో నెహ్రూబజార్ షిర్డీ సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా సాయిబాబా మందిర నిర్వాహకులు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మందిర అధ్యక్ష, కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు, సహ కార్యదర్శి షేక్ కరీంబాష, కమిటీ సభ్యులు సూరే నాగేశ్వరరావు, విజయ్, అలవాల సుబ్బారావు, ధూళిపాళ్ల మధు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కి సేవా పురస్కారం


సర్పంచ్ శ్రీనివాసులుకు సేవా పురస్కారం అందజేస్తున్న నూకసాని

గిద్దలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరవ గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాసులుకు ఉత్తమ నాయకత్వసేవా పురస్కారం లభించింది. ఒంగోలులో జరిగిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పర్యాటక శాఖ చైర్మన్ నూకసాని బాలాజీ సేవా పురస్కారాన్ని నరవ సర్పంచ్ బండి శ్రీనివాసులుకు అందజేసి అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి సన్మానం

రాచర్ల (గిద్దలూరు), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం ఆకవీడులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో 593 మార్కులు సాధించిన బి.లక్ష్మీప్రియను చిన్నిసేవాసంస్థ అధ్యక్షులు మాగు లూరి శ్రీకాంత్ సన్మానించారు. ప్రభు త్వ పాఠశాలలో చదివి అత్యధిక మా ర్కులు సాధించిన లక్ష్మీప్రియను అభినందించి జ్ఞాపిక అందజేశారు. హెచ్ఎం సుధాకర్‌రావు పాల్గొన్నారు.

జాతీయ ఐకాన్ అవార్డుకు నారాయణరెడ్డి ఎంపిక

గిద్దలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిరావుఫూలే జాతీయ ఐకాన్ అవార్డుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు బి.ఎస్.నారాయణరెడ్డి ఎంపికయ్యారు. ఆయన రెండు దశాబ్దాలుగా ఆధ్యాత్మికంగా, సామాజికంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఈ అవార్డుకు ఎంపిక చేసి ఈ నెల 27న అందజేసేందుకు ఆహ్వానించింది.

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

తర్లుపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9, 10వ తరగతి విద్యార్థులకు బ్యూరో ఆఫ్ ఇండియన్ క్యాండెట్స్ ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన శశిప్రియ, స్వప్న, మానసలు, మానస, లీలా, రూపశ్రీలు ద్వితీయ బహుమతులు, సాయి కుమార్, స్పందన, సౌజన్యలు తృతీయ బహుమతులు సాధించారు. విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు నరసింహరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటి మోహన్, శోభారాణి, హేమలత, వెంకటరెడ్డి, సుజాత, కిశోర్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 24 ఆంధ్రజ్యోతి: విద్యార్థులు ఒక లక్ష్యం ఏర్పరుచుకుని చదివితే ఉన్నత ఫలితాలు సాధిస్తారని మండల విద్యాశాఖ అధికారిణి కె.శర్వాణి అన్నారు. స్థానిక శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన ఐ.ప్రణీత్ పదో తరగతి పరీక్షా ఫలితాలలో 597 మార్కులు సాధించిన సందర్భంగా గురువారం అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం అంజయ్య, ఆర్ఐ సురేంద్ర, కోఆర్డినేటర్ వీరాంజనేయులు, ప్రిన్సిపాల్ ఆదినారాయణ, డీన్ సీహెచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముఖాముఖి

ఆయుర్వేద వైద్యశాలలో సిబ్బంది కొరత

డాక్టర్ గద్దె ఏడుకొండలు, కంభాలదిన్నె



ప్రశ్న: ఆయుర్వేద వైద్యంతో ఎటువంటి రోగాలు నయం అవుతాయి?

జవాబు: చర్మ వ్యాధులు, థైరాయిడ్, గర్భసంచివ్యాధులు, కీళ్లవాతం, గ్యాస్ట్రబుల్, లివర్, కిడ్నీ, మధుమేహ, రక్తపోటు లాంటి వ్యాధులు నయమవుతాయి.

ప్ర: సిబ్బంది కొరత వేధిస్తుందా?

జ: కంభాలదిన్నె ఆయుర్వేద వైద్యశాలలో డాక్టర్ మినహా మిగిలిన ఎంఎన్‌వో, అటెండరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ప్ర: వేసవిలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి

జ: చందన, ఆసవ, దక్షరిష్టా లాంటి మందులు తీసుకోవాలి. మజ్జిగా, కొబ్బరి నీరు తీసుకోవాలి. ఎండలో వెళ్లేటప్పుడు పల్చటి దుస్తులు ధరించాలి

ప్ర: వైద్యశాలలో అన్నిరకాల సౌకర్యాలు ఉన్నాయా?

జ: ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, గ్రామస్థుల సహకారంతో వైద్యశాలలో అన్నిరకాల సౌకర్యాలు ఉన్నాయి.

నేడు కనిగిరిలో ప్రజావేదిక

పీసీపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కనిగిరిలో ప్రజావేదిక జరుగుతుందని ఎంపీడీవో ప్రభాకరశర్మ తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజావేదికలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. సమస్యలపై వచ్చేవారు అర్జీ జెరాక్స్ కాపీ, ఆధార్‌కార్డు తీసుకు రావాలన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో ఉదయం 10గంటలకు ప్రజావేదిక జరుగుతుందని ఎంపీడీవో పేర్కొన్నారు.

కురిచేడులో..

కురిచేడు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని వాణి కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల ఇన్‌చార్జ్ ఇన్‌చార్జి పిడతల నెమిలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొంటున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వాలని ఆయన కోరారు.

ఉచిత వైద్యశిబిరం

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శీలంవారిపల్లిలో వ్యవసాయ కళాశాలలో నాలుగవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి.నిఖితరాణి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీవిద్య, తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల కార్యవర్గం

కురిచేడు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండల ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొట్టిపాటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా కాట్రాజు గోపి, ప్రధాన కార్యదర్శిగా నారెబోయిన నరసింహారావు, కోశాధికారిగా యర్రగుంట్ల మహిత, కార్యదర్శిగా పూల వెంకట్, మరికొంతమంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాఠశాల ఆవరణలో వసతి గృహం నిర్మాణం చేయొద్దు!

కురిచేడు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కురిచేడు వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంతో మందికి ఉదయం పూట నడకకు, విద్యార్థులకు ఉపయోగపడుతున్నది. పాఠశాల ఆవరణలో వసతి గృహం నిర్మిస్తే విద్యార్థుల ఆటలకు, ఉదయం పూట నడిచే వారికి స్థలం సరిపోదు. మరోచోట వసతి గృహం నిర్మించి ఆట స్థలాన్ని అలాగే ఉంచాలని విద్యార్థులు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి వినతి పత్రం ఇచ్చారు. శుక్రవారం ఆమె వసతి గృహానికి శంకుస్థాపన చేశారు. ముందే చెప్పిఉన్నట్టయితే మరోచోట స్థలం చూసేవారమని, ఇపుడు మారిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని లక్ష్మి వారికి నచ్చజెప్పారు. ఆట స్థలానికి మరో స్థలం చూడాలని, తాను కూడా సహకరిస్తానని ఆమె పేర్కొన్నారు.

టీడీపీ పటిష్టతకు కృషిచేయాలి

పామూరు ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి గ్రామ కమిటీలే జవసత్వాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. గురవారం మండలంలోని అయ్యవారిపల్లిలో జరిగిన సమావేశంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మార్నేని రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బోడా రత్తయ్య, ప్రధానకార్యదర్శిగా జడా చిట్టిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అలాగే, బొడవాడలో జరిగిన సమావేశంలో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా డొడ్డా కోటిలింగం, ఉపాధ్యక్షుడిగా చెన్నుబోయిన ఈశ్వరమ్మ, ప్రధాన కార్యదర్శిగా వెల్లంకి శివయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు ఏ .ప్రభాకర్‌చౌదరి, అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనకు కృషి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


ఆర్టీసీ నూతన సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడి అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో నూతన బస్సులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలోని ప్రజలు ఎక్కువ శాతం బెంగుళూరు ప్రాంతానికి ఉపాధి కోసం వెళ్తుంటారన్నారు. ఇందుకోసం పీసీపల్లి మండలంలోని ఇర్లపాడు నుంచి బెంగుళూరుకు నేరుగా సూపర్‌లగ్జరీ బస్సును నూతనంగా ప్రారంభించినట్లు తెలిపారు. కనిగిరి నుంచి విజయవాడకు మరో ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను ప్రారంభించామన్నారు. దీంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుందన్నారు. కనిగిరి ప్రాంతంలో త్వరలోనే రైలు మార్గం పూర్తి కానుందని చెప్పారు. దీంతో రైలు ప్రయాణ సౌకర్యం ఏర్పాటు కానుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం షయనాబేగం, మున్సిపల్ కమిషనర్ జోసఫ్ దానియేలు, చైర్మన్ గఫార్, తహసీల్దార్ రవిశంకర్, జనసేన ఇన్‌చార్జ్ వరికూటి నాగరాజు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తమినేని శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు, నాయకులు యారవ శ్రీను, కేవీఎస్ గౌడ్, తిరుపాలు, తెలుగు మహిళలు పార్వతమ్మ, షేక్ వాజిదాబేగం, నీరజ తదితరులు పాల్గొన్నారు.

అలాగే, పట్టణంలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర శంకుస్థాపన చేశారు. రూ.35 లక్షలతో ఈపనులు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. కనకపట్టణంలోని 5వ వార్డులో రూ.15 లక్షలతో, 8వ వార్డులో రూ.16 లక్షలతో, 7వ వార్డు కొత్తూరులో రూ.4 లక్షలతో సిమెంట్ కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

విద్యారంగం అభివృద్ధే లక్ష్యం

కనిగిరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో విద్యారంగం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. ట్రిపుల్‌ఐటీ కళాశాల ఏర్పాటుకై మండలంలోని బల్లిపల్లి గ్రామం వద్ద, పామూరు ప్రాంతంలోని దూబగుంట వద్ద ఉన్న భూములను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కనిగిరి ప్రాంతానికి మంజూరైన ట్రిపుల్‌ఐటీ గత పాలకుల నిర్లక్ష్యంతో ఒంగోలుకు తరలిందన్నారు. దీంతో కనిగిరి ప్రాంతం అభివృద్ధికి విఘాతం ఏర్పడిందన్నారు. ఈసమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లిన వెంటనే ఆయన సానుకూలంగా స్పందించి ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేశారన్నారు. త్వరలో ట్రిపుల్‌ఐటీ ఏర్పాటు జరిగి తీరుతుందన్నారు. అప్పటివరకు కనిగిరి ప్రాంతంలో అనువైన భవనాన్ని పరిశీలించి ఈ ఏడాది నుంచే తరగతులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ భాస్కర్‌పటేల్, తహసీల్దార్ రవిశంకర్, రెవెన్యూ సిబ్బంది, టీడీపీ మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


కళాశాల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

దర్శి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. స్థానిక కస్తూర్బా కళాశాలలో రూ.1.59 కోట్లతో నిర్మించే నూతన భవనాలకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యారంగంలో పెనుమార్పులు తెచ్చారన్నారు. ఈఏడాది విడుదలైన ఇంటర్, పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉత్తీర్ణత సాధించటమే ఇందుకు నిదర్శనమన్నారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దారం నాగవేణి, ప్రిన్సిపాల్ అరుణ, ఎంఈవోలు రఘురామయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక విద్యుత్ సమస్య పరిష్కారం

దర్శి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఎంతోకాలం గా అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ సమస్యను పరిష్కరించటంతో చింతలపాలెం గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పేర్కొన్నారు. దర్శి నగర పంచాయతీ 20 వార్డు పరిధిలోని చింతలపాలెం గ్రామస్థులు ఎంతోకాలంగా సింగిల్ ఫేజ్‌తో సక్రమంగా కరెంట్ సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చొరవతో ఈ సమస్యను పరిష్కరించినట్టు చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, నారపుశెట్టి మధు, శోభా రాణి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహానికి శంకుస్థాపన

కురిచేడు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వైఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కేజీబీవీ వసతి గృహానికి గురువారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.194.21 లక్షలతో వసతి గృహాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. విద్యలో బాలికలు రాణించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ లలిత్‌సాగర్, పిడతల నెమిలయ్య, కాట్రాజు నాగరాజు, డాక్టర్ సునీల్, కిలారి కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

తాళ్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం తట్ట మట్టిపోసిన పాపానపోలేదు. దీంతో పలురోడ్లు గుంతలమయంగా మారాయి. ఈ మార్గాల్లో ప్రయాణం చేయాలంటే ప్రజలు నరకయాతన పడుతున్నారు. మండలంలోని విఠలాపురం-లింగాలపాడు మధ్య దారి 6 కిలోమీటర్లు ఉంది. తూర్పుగంగవరం నుంచి ఈ రహదారి గుండా ముండ్లమూరు వెళ్లేందుకు దగ్గరి మార్గంగా ఉంది. ఈ రహదారిలో అడుగడుగుకు గుంతలుపడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విఠలాపురం-లింగాలపాడు గ్రామాల మధ్య రోడ్డుకు మరమ్మతులు చేసి తమ ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


అధ్వానంగా లింగాలపాడు రోడ్డు



పసుపుగల్లులో నిర్మించిన నీటి తొట్టె

‘ఉపాధి’ నిధులతో నీటి తొట్టెల నిర్మాణం

ముండ్లమూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో మేత కోసం పొలాలకు వెళ్లే మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం నీటి తొట్టెలు మంజూరు చేసింది. మండలానికి 62 నీటి తొట్టెలు మంజూరుకాగా, ఇప్పటివరకు ఉపాధి హామీ పథకం నిధులతో 40 నిర్మించారు. మిగిలినవి ఈనెలాఖరుకల్లా పూర్తి చేయనున్నారు. మండలంలో మొత్తం 55వేల పశువులు, 33వేలు గొర్రెలు, మేకలు ఉన్నాయి. ప్రతి పంచాయతీలో నీటి తొట్టెలు నిర్మిస్తున్నారు. అవకాశం ఉన్న చోట సమీపంలోని బోరింగ్ నీటితో తొట్లు నింపుతున్నారు. అవకాశం లేని చోట ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. మండలంలోని పసుపుగల్లు, పెద ఉల్లగల్లు, ముండ్లమూరు, వేముల, వేములబండ, కెల్లంపల్లి, పోలవరం, శంకరాపురం, సింగనపాలెం, ఈదర, భీమవరం గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణాలు పూర్తి చేశారు.

ఉగ్రవాదుల దాడికి నిరసనగా ర్యాలీ



దర్శిలో ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు

దర్శి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని జనసేన పార్టీ నాయకులు ఖండించారు. గురువారం రాత్రి పట్టణంలో జనసేన నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకిస్థాన్ తీవ్రవాదాన్ని రెచ్చగొట్టి ప్రజల ప్రాణాలను హరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దోషులను ఉరితీసి, ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పుప్పాల పాపారావు, చేతరాజు కొండలు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పామూరులో కొవ్వొత్తులతో ర్యాలీ

పామూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదులు అమానుషంగా కాల్పులు జరిపి అమాయకులను పొట్టనపెట్టుకోవడం దారుణమని మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ అన్నారు. ఉగ్ర వాదుల దాడులకు నిరసనగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులు టూరిస్టులను పొట్టన పెట్టుకోవడం దారుణమన్నారు. అందులో మన ప్రాంతానికి చెందిన మధుసూదన్ మృతి చెందడం బాధాకరమన్నారు.

కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కోట నరసింహారావు, ఎం.మధుసూదన్‌రావు, పాబోలు శివ, పండిటి హరీష్, మెంటా నరసింహారావు, దరిశి రాజేష్, దరిశి మస్తాన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



పామూరులో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న ఆర్యవైశ్యులు

పంచాయతీల అభివృద్ధికి సహకరించాలి


అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలు

తాళ్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో దారా హనుమంతరావు అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం ఎంపీడీవో కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ఆర్టికల్ 73 రాజ్యాంగ సవరణద్వారా పంచాయతీలకు సర్వాధికారాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.సుందరరామయ్య, సానికొమ్ము సత్యం, గ్రామపంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామసచివాలయాల వద్ద సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పంచాయతీ రాజ్ దినోత్సవంనిర్వహించారు.

ఉత్తమ సర్పంచ్‌లకు అవార్డులు

పామూరు ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ పంచాయతీగా దూబగుంట ఎంపికైంది. ఈసందర్భంగా గురువారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో ఏపీ టూరిజం పర్యాటక శాఖ చైర్మన్ నూకసాని బాలాజీ, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వీరభద్రాచారి చేతుల మీదుగా ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసరెడ్డి ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. అలాగే, సీఎస్‌పురం మండలం కోవిలంపాడు సర్పంచ్ షేక్ ఖాదర్‌బుజ్జి ఉత్తమ సర్పంచ్‌గా ప్రశాంసపత్రాన్ని అందుకున్నారు.

అగ్నిప్రమాదంలో గృహోపకరణాలు దగ్ధం


విద్యుదాఘాతంతో దగ్ధమైన వస్తువులు

దొనకొండ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గృహోపకరణాలు దగ్ధమైన ఘటన గురువారం మండలంలోని కలివెలపల్లిలో చోటుచేసుకుంది. కరెంట్ తీగలు ఒకదానికి ఒకటి తగిలి వెంకటయ్య ఇంటి పక్కన ఏర్పాటుచేసుకున్న దడిపై మంటలు పడ్డాయి. వెంకటయ్య కుటుంబసభ్యులు కూలీపనులకు వెళ్లి మధ్యాహ్నానికి ఇంటికి వచ్చిన సమయంలో పెద్ద ఎత్తులో మంటలు చెలరేగుతుండటం చూసి భయాందోళనలకు గురయ్యారు. మంటలను అదుపుచేసే ప్రయత్నం చేసే లోపు టీవీఎస్ మోపెడ్, రెండు మంచాలు, దుప్పట్లు, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆ ప్రాంతంలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలిఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని బాధితులు వాపోయారు.

మెడికల్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్లను అనుమతించాలి

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మెడికల్‌బోర్డు ద్వారా గతంలో జారీ చేసిన అంగవైకల్య సర్టిఫికెట్లను అనుమతించాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు టి. శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్, షేక్ నాయబ్‌రసూల్ డిమాండ్ చేశారు. బదిలీలలో ఎలాంటి పాయింట్లు ఇవ్వకుండా ఉపాధ్యాయులను వెనక్కి పంపడం తగదన్నారు. 15 సంవత్సరాల క్రితం మెడికల్ బోర్డు ద్వారా జారీచేసిన సర్టిఫికెట్లు ఇప్పుడు చెల్లవని నిర్ణయించడం అన్యాయమన్నారు. అంగవైకల్య ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని వారు కోరారు.

150 మందికి ఉచిత వైద్యపరీక్షలు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేషునిపల్లి గ్రామంలో సాయి వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో పామూరుకు చెందిన మల్లికార్జునరెడ్డి సూపర్‌స్పెషాలిటి హాస్పిటల్ వైద్యులు మల్లికార్జునరెడ్డి 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. విబైలు, చెన్నసునాయినిపల్లి, ఏ కోత్తపల్లి, అంబవరం, రేగేలచెలుక, అయ్యలూరివారిపల్లి గ్రామాలకు చెందిన రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ డాక్టర్ రజాక్, చర్చి పాదర్ బి.మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ముండ్లమూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం ముండ్లమూరులో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రూ.11.50 లక్షలు విలువచేసే వివిధ పనిముట్లను రైతులకు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల కోసం కూటమి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ లలిత్‌సాగర్, నారపుశెట్టి పిచ్చయ్య, దారం నాగవేణి సుబ్బారావు, సోమేపల్లి శ్రీనివాసరావు, ఎం.వెంకటరావు, కూరపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, ముండ్లమూరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.1.68 కోట్లతో అదనపు గదుల నిర్మాణానికి డాక్టర్ భూమి పూజ చేశారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెల ఏర్పాటు

ముండ్లమూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఉపాధి హామి పథకం ద్వారా నీటితొట్టెలు ఏర్పాటుచేసినట్టు ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. గురువారం మండలంలోని పసుపుగల్లు పొలాల్లో నిర్మించిన నీటి తొట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ చింతల రాజారెడ్డి, చింతా కృష్ణారెడ్డి తదిరుతులు పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ

తాళ్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మానం రమేష్ సతీమణి సుబ్బారత్తమ్మను ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ గురువారం పరామర్శించారు. అనారోగ్యంతో గతకొంతకాలంగా ఆమె హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం విఠలాపురం వచ్చారు. సమాచారం అందుకున్న గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ ఆమెను పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీపీ తాటికొండ శ్రీను, నవులూరి సురేంద్ర మోహన్, వెంకటేశ్వరరెడ్డి, షేక్ కాలేషావలి, శాగం కొండారెడ్డి, రాచకొండ వెంకట్రావు, వేణుబాబు, విద్యాసాగర్, తదితరులు ఉన్నారు.

బాలికల విద్యాభివృద్ధే ధ్యేయం

తాళ్లూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): బాలికల విద్యాబివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. తాళ్లూరులోని కేజీబీవీ ఆవరణలో బాలికల కళాశాల భవన నిర్మాణానికి గురువారం రాత్రి ఆమె భూమిపూజ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బాలురతో సమానంగా బాలికలు విద్యాభ్యాసం చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. బాలికల చదువుకోసం కోట్లాది రూపాయలు వెచ్చించి వసతి గృహాలు, కళాశాలలు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీను, డాక్టర్ లలిత్‌సాగర్, ఓబుల్‌రెడ్డి, నారపుశెట్టి పిచ్చయ్య, సమగ్రశిక్ష డీఈ రమణయ్య, ఏఈ కోటేశ్వరరావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ పి.సుజిత, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించాలి


మాట్లాడుతున్న హనీఫ్

పామూరు ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికే కేంద్ర ప్రభుత్వం సవరణ చట్టం బిల్లు తీసుకొచ్చిందని సీపీఎం జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ ఆరోపించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో గురువారం రాత్రి అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టే బుల్ సమావేశానికి షేక్ ఖాదర్‌బాషా అధ్యక్షత వహించారు. హనీఫ్ మాట్లాడుతూ వక్ఫ్ చ ట్ట సవరణ బిల్లుపై వైసీపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందన్నారు. ముస్లింలకు అండగా ఉంటామని చెప్పిన టీడీపీ బేషరతుగా బిల్లుకు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును న్యాయస్థానాలు అడ్డుకోవడం హర్షనీమమన్నారు. ఈ బిల్లు విధివిదానాలపై ఈ నెల 29న నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సయ్యద్ మౌలాలి, కె.మాల్యాద్రి, అల్లాభక్ష్, మోహిద్దీన్, మహబూబ్ పీరా, ఖాజీ ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచాటిన విద్యార్థులు

పామూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆకులవీధికి చెందిన పలువురు విద్యార్థులు పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించారు. స్థానిక వార్డు మెంబర్ ఉప్పలపాటి హరిబాబు విద్యార్థుల సమక్షంలో కేక్ కట్‌చేసి అభినందించారు. ఉన్నత విద్యాలో రాణించి భవిషత్తుకు బంగారు బాటలు వేసుకోవాని సూచించారు. ఆకులవీధికి చెందిన జి.చేతన్ 592 మార్కులు, వి.వదీష్ 582 మార్కులు సాధించారు. అలాగే, జి.యామిని 566 మార్కులు, వి.సర్వేష్ 565, షేక్ వహిద 552, ముక్తదీర్ 517 మార్కులు సాధించారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జ్ బండ్ల నారాయణ, వాయినేని మాధవ, ఈ.సత్యం, వాయినేని రాఘవ, షేక్ మునీర్, గౌస్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 25-4-2025 | పేజీలు: 8 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 25 | శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం తిథి: ద్వాదశి ఉ.11.45 తదుపరి త్రయోదశి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.8.53 తదుపరి: ఉత్తరాభాద్ర, వర్జ్యం: సా.5.30-6.56, దుర్ముహూర్తం: ఉ.8.27-9.17, మ.12.38-1.28, అమృతఘడియలు: రా.2.08-3.34, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.56, సూర్యాస్తమయం: 6.30 | బాపట్ల సిటీ

Ongole | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Nallagonda | Nizamabad and Bengaluru

హత్య కేసులో వేమవరం వాసికి జీవిత ఖైదు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తిని నరికి హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడు, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వేమవరం గ్రామానికి చెందిన వాడితే నాగేశ్వరరావు నాయక్‌కు జీవిత ఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయ అధికారి నేతి సత్యశ్రీ గురువారం తీర్పు వెలువరించారు. హతుడు షేక్ ఖాదర్ బాబా (32), నిందితుడు నాగేశ్వరావు నాయక్ ఇద్దరిదీ ఒకే ఊరు. ఖాదర్ బాబా చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో చికెన్ షాపు నిర్వహిస్తూ జీవిస్తుంటాడు. మురికిపూడికి చెందిన ఓ మహిళతో అతను సన్నిహితంగా ఉంటున్నాడు. సదరు మహిళతో నిందితుడు నాగేశ్వరరావునాయక్ కూడా గతంలో సన్నిహితంగా మెలిగాడు. ఖాదర్ బాబాతో పరిచయమైన తర్వాత నాగేశ్వరరావునాయక్‌ను ఆ మహిళ దూరం పెట్టింది. దీంతో ఆగ్రహించిన నాగేశ్వరరావు 2019 జూలై 23న రాత్రి చికెన్ షాప్‌లో నిద్రిస్తున్న ఖాదర్ బాబాను కత్తితో మెడపై నరికి హతమార్చాడు. మృతుడి భార్య షేక్ షాహిన పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో.. కోర్టు నిందితుడికి శిక్ష, జరిమాన విధిస్తూ.. తీర్పునిచ్చింది. ప్రాసిక్యూషన్ ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు.



మోదీ పర్యటనతో.. పోలీసుల అలర్ట్

- కొత్త వ్యక్తుల కదలికలపై కన్ను
- ఆరు వేల మందితో భద్రతా చర్యలు
- రంగంలోకి కేంద్ర నిఘా, హోంశాఖ వర్గాలు
- హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాలపై నిఘా.. తనిఖీలు
- కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఘాతుకంతో మరింత అప్రమత్తం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతి పర్యటన వచ్చే శుక్రవారం సమీపిస్తోంది. పోలీసుశాఖ అప్రమత్తమైంది. కొత్త వ్యక్తుల కదలికలపై కన్నేయడంతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాలపై నిఘాతో పాటు తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. భారీగా జనం సమీకరణ నేపథ్యంలో ఆరు వేల మందితో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర నిఘా, హోంశాఖ, గూడాచార వర్గాలు కూడా రంగంలోకి దిగాయి. సభ జరిగే ప్రాంతంపై పోలీసు వర్గాలు డేగ కన్ను వేసి పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర బలగాలు ప్రధాని సభ జరిగే ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకున్నాయి. ప్రధాని సభ, రోడ్ షో మార్గాలన్నింటిపైన నిఘా వర్గాలు కన్నేశాయి. ప్రధాని కార్యాలయంతో పాటు కేంద్ర హోం శాఖలోని ఉన్నతాధికారులు కూడా ఎప్పటికప్పుడు జిల్లాలోని పరిస్థితులను ఆరా తీస్తూ పోలీస్ ఉన్నతాధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు.

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో మే 2న జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. కానిస్టేబుల్ స్థాయి నుంచి కేంద్ర హోం శాఖ వరకు అన్ని విభాగాల అధికారులు ఎవరిస్థాయిలో వారు రంగంలోకి దిగా రు. జమ్మూ కశ్మీర్లో జరిగిన ఉగ్ర దాడి నేపథ్యంలో కేంద్ర నిఘా వర్గాలతో పాటు కౌంటర్ ఇంటెలిజెన్స్ వర్గాలు పూర్తిగా అప్రమత్తమయ్యాయి. రాజధాని ప్రాంతంతో పాటు జిల్లా కేంద్రమైన గుంటూరు పరిధిలోని హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాల్లో పోలీ సులు ఇప్పటికే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్‌లపై కూడా నిఘా వేశారు. అనుమానాస్పద వ్యక్తులు, కొత్త వ్యక్తుల కదలికలను నిశితంగా గమనిస్తున్నారు. ఇప్పటికే లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసిన పోలీసులు కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆయా వ్యక్తులకు సంబంధించి ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులు తీసుకుని గదులు కేటాయించాలని ఆదేశించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు కూడా చేపట్టారు. ఇంతకు ముందు మోదీ సభకు ఐదు వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయించి ప్రణాళిక రూపొందించారు. అయితే పహల్గామ్ ఉగ్రదాడితో అదనపు బలగాలను నియమించాలని నిర్ణయం తీసుకున్నారు. తాజాగా మరో వెయ్యి మంది సిబ్బందిని అదనంగా నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం ఆరు వేల మంది పోలీస్ బలగాలతో పీఎం సభకు ఆరంచెల భద్రత ఏర్పాటు చేయనున్నారు. చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద గతంలో జరిగిన మోదీ సభలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో ఈ సారి అలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసులు ఇప్పటి నుంచే పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

రోడ్ షో మార్గంలో డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

మోదీ రోడ్‌షో మార్గంలో పోలీస్ బలగాలు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాయి. డాగ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు కల్వర్టులు, చప్టాలు, రోడ్‌మార్జిన్లలో, పొలాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. మరోవైపు రాజధాని ప్రాంతంపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. డ్రోన్ కెమేరాలతో ఆయా ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనిస్తున్నారు. సీసీ కెమేరాల ద్వారా ఆ ప్రాంతంలోని పరిస్థితులను గమనిస్తున్నారు. పార్కింగ్ ప్రదేశాలు, సభా వేదిక వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలపై కూడా నిఘా కొనసాగిస్తున్నారు.


వేదిక ప్రదేశంలో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్ టీం

రాజధానిలోనే ఉన్నతాధికారుల మకాం

ప్రధాని పర్యటన నేపథ్యంలో అవాంఛనీయ ఘట నలకు ఆస్కారం లేకుండా పోలీస్ ఉన్నతాధికారులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పోలీస్ ఉన్నతాధికారులు రాజధాని ప్రాం తంలోనే మకాం వేసి రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బం దిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు.



సాగర్ వెలవెల

- జలాశయంలో 139.61 టీఎంసీలు
- డెడ్‌స్టోరేజి పోగా మిగులు 27.43 టీఎంసీలే
- వరద వచ్చే వరకు పొదుపుగా వాడుకోవాల్సిందే
- వచ్చే నెలలో తాగు అవసరాలకు నీటి విడుదలకు అవకాశం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ జలాశయంలో నీరు నిండుకుంటోంది. మండుతున్న ఎండలతో జలాశయంలో రోజురోజుకు నీరు తరిగిపోతోంది. వరదలు వచ్చే వరకు ఉన్న జలాశయంలోని నీటిని పొదుపుగా వాడుకోవాలి. 312.05 టీఎంసీలు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం కాగా ప్రస్తుతం 139.61 టీఎంసీలు మాత్రమే జలాశయంలో ఉన్నాయి. డ్యామ్‌లో 27.43 టీఎంసీల నీరు వినియోగానికి అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది జూలైలోనే సాగర్‌కు వరద వచ్చింది. ఈ ఏడాది కూడా వర్షాలు పుష్కలంగా కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో త్వరతగతిన సాగర్‌కు వరదలు రావచ్చని అంచనా వేస్తున్నారు. మే నెల మూడో వారంలో కుడి కాల్వ పరిధిలో తాగు అవసరాలకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. 5 నుంచి 8 టీఎంసీల వరకు తాగునీటి అవసరాలకు సరఫరా చేయనున్నారు.

వృథాతోనే ఇప్పుడీ కష్టాలు

సాగర్ జలాశయంలో గత నవంబరులో పూర్తిస్థాయి నీటి మట్టం ఉంది. దాదాపు 310 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అయితే ఇరు రాష్ట్రాలు సాగర్‌లో అవసరం ఉన్నా లేకున్నా పెద్దఎత్తున కాల్వలకు నీటిని విడుదల చేసి వృథా చేశాయి. డిసెంబరు 1న కూడా 306 టీఎంసీల నీరు ఉంది. ఈ నెల 9న సాగర్ కుడి కాల్వకు నీటి విడుదలను నిలిపేశారు. అప్పటికి జలాశయంలో 142.08 టీఎంసీల నీటి నిల్వ ఉంది. నాలుగు నెలల్లో 164 టీఎంసీల నీటిని ఇరు రాష్ట్రాలు పోటీ పడి మరీ వాడుకున్నాయి. దీంతో జలాశయంలో నీటి నిల్వలు నిండుకున్నాయి. ప్రస్తుతం జలాశయంలో 139.61 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉన్న నీటిని పూర్తిగా వినియోగించుకునే అవకాశం లేదు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 514.6 అడుగులు ఉంది.

ఆవిరి నష్టం.. 20 శాతం

సాగర్ జలాశయం డెడ్ స్టోరేజి 498 అడుగులు. అంటే 112.18 టీఎంసీల నిల్వ ఉన్నట్లు. అయితే 27.43 టీఎంసీల నీటిని మాత్రమే వాడుకునే అవకాశం ఉన్నట్లు జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. సాగర్‌కు వరదలు వచ్చే వరకు ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు పొదుపుగా వినియోగించుకోవాలి. ఎండకు జలాశయంలో ఆవిరి నష్టం దాదాపు 20 శాతం వరకు ఉంటుందని అంచనా. అంటే ఉన్న నీటిలో 4 నుంచి 5 టీఎంసీల వరకు ఆవిరి అవుతుంది. నదీ పరివాహక ప్రాంతంలో సకాలంలో వర్షాలు కురిసి వరదలు వస్తేనే సాగర్ జలకళ సంతరించుకుంటుంది. సకాలంలో వర్షాలు కురవకపోతే నీటికి గడ్డుకాలమే.

29 నుంచే యథావిధిగా ఏఎన్‌యూ పీజీ పరీక్షలు

పెదకాకాని, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవి ద్యాలయం నిర్వహించే పీజీ నాలుగవ సెమిస్టర్ పరీక్షలు యథా విధిగా ఈ నెల 29 తేదీ నుంచి జరుగుతాయని విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ గురువారం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ తేదీలలో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నారు. 29 వ తేదీన జరగబోతున్న పరీక్షలకు విద్యార్థులు సంసిద్ధం కావాలని ఆయన సూచించారు. అయితే, ఇటీవల సామాజిక మాధ్యమాలలో, పలు సోషల్ మీడియా వేదికలపై వస్తున్న అసత్య సర్క్యులర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రేషన్ మాఫియాపై తాత్సారం

- జిల్లాలో వ్యవస్థీకృతంగా బియ్యం దందా
- నెలకు రూ.3 కోట్ల వరకు పేదల బియ్యంపై దోపిడీ
- వీరయ్యచౌదరి హత్యతో మరిన్ని అంశాలు తెరపైకి
- రేషన్ మాఫియా కోణంలో సాగుతున్న పోలీసుల విచారణ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పేదల బియ్యం పెద్దల బొక్కసాలను నింపుతోంది. పేదల ఆకలి ఏమో కానీ పెద్దలకు రూ.కోట్లు ఆర్జించిపెడుతోంది. దీంతో రేషన్ బియ్యం అక్రమాలతో మాఫియా అవతరించింది. బహిరంగంగా రేషన్ బియ్యం మాఫియా అక్రమాలు చేస్తున్నా రాజ కీయ అండదండలతో అధికా రులు ఏమీ చేయలేకపోతు న్నారు. ఎక్కడికక్కడ అనుచరుల చేత రేషన్ దందాను నడిపించి, వ్యవస్థలను నిస్తేజం చేస్తూ నేతలు పబ్బం గడుపుకున్నారు. అయితే ప్రభుత్వం ఏదైనా రేషన్ మాఫియా మాత్రం మారడంలేదు. గత ప్రభుత్వంలో చెలరేగిన వారు ఇప్పుడు కూడా అదే దందా సాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నెలకు రేషన్ దందాలో రూ.3 కోట్లు ఆర్జన వస్తోంది. ఇందులో తిలాపాపం తలా పిడికెడు అన్న చందాన వ్యవహారం ఉంటోంది. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య కోణాన్ని విచారణ చేపట్టే క్రమంలో రేషన్ మాఫియా పాత్రపై కూడా పోలీసులు దృష్టిసారించారు. దర్యాప్తులో భాగంగా బాపట్ల రూరల్ వెదుళ్లపల్లికి చెందిన ఓ రైస్ మిల్ యజమానిని అదుపులోకి తీసుకున్నారు. రేషన్ మాఫియా ఆగడాలు హత్యల వరకు వెళ్లాయా? అని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం అవలంభించిన నిర్లక్ష్య వైఖరే ఇప్పుడు కూడా కొనసాగుతుండడం వల్లే విషయం హత్య దాకా వచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదే రీతిన మాఫియాను వదిలేస్తే భవిష్యత్తులో ఇంకెన్ని అనర్థాలను చూడాల్సి వస్తుందనే ఆవేదన అందరిలోనూ వ్యక్తమవుతోంది. అధికారుల తాత్సారంతో రేషన్ మాఫియా వ్యవస్థీకృతం వైపు అడుగులేస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. ఇన్ని రోజులూ అక్రమార్జనకే పరిమితమైన దందా ఇప్పుడు కక్షలు, కార్పణ్యాల వరకు వెళ్లడం భవిష్యత్తులో ఈ మాఫియా వల్ల ఇంకెన్ని అనర్థాలను చూడాల్సి వస్తోందననే ఆందోళన జిల్లావాసుల్లో వ్యక్తమవుతోంది. వీరయ్య చౌదరి హత్య నేపథ్యంలోనైనా ప్రభుత్వం మేల్కొని రేషన్ మాఫియాను కూకటి వేళ్లతో పెకిలించేలా చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో జరగబోయే అనర్థాలకు పాలకుల ఉదాసీనతే కారణమవుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ప్రతీ నియోజకవర్గంలోనూ బియ్యం దందా


రేషన్ మాఫియా ద్వారా నెలకు జిల్లాలో అక్రమార్జన రూ.3 కోట్లుపై మాటే. ప్రతి నియోజకవర్గంలోనూ ఈ తంతు కొనసాగుతూనే ఉంది. నియోజకవర్గాల వారీగా దందా నిర్వహిస్తున్నదెవరు? ఎంతెంత ముడుపులు ఎవరెవరికి అందుతున్నాయి.. అనే అంశంతో పాటు నేతల జోక్యంపై కూడా అధికారుల వద్ద సమాచారం ఉంది. కానీ కట్టడి చేసే సాహసం మాత్రం చేయడం లేదు. పొరుగు జిల్లాకు చెందిన వ్యక్తి ఏకంగా చీరాలలో పాట పెట్టి మరీ రేషన్ దందాను బహిరంగంగా హస్తగతం చేసుకున్నాడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక బాపట్లలో ప్రాంతాల వారీగా విభజించుకుని మరీ ఈ దందా సాగిస్తున్నారు.

ఎవరూ ఏమీ చేయలేరని తెంపరితనం

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో రేషన్ దందా చేసే వ్యక్తులు వ్యవస్థలంటే లెక్కలేని విధంగా వ్యవహరిస్తున్నారు. తనిఖీలకు వెళ్లిన అధికారులపై దాదాపు దాడి చేసినంత పని ఈ మాఫియా చేసిందంటే వారి తెంపరితనం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. నిజాంపట్నం మండల పరిధిలోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయనే సమాచారంతో అక్కడకు వెళ్లిన అధికారులకు వాటిని అక్కడ నుంచి తరలించడం వీలుకాలేదంటే మాఫియా బరితెగింపు ఏ స్థాయిలో ఉందో విశదమవుతోంది. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ఓ గ్రామంలో ఏకంగా అధికారుల వాహనాలకు అడ్డు నిలబడి మరీ తనిఖీలను నిలువరించగలిగారంటే ఎవరి దన్నుతో ఇలా చేస్తున్నారనేది తేలాల్సి ఉంది. బహిరంగంగానే అధికార పార్టీ నేతల పేర్లను రేషన్ మాఫియా యథేచ్ఛగా వాడేస్తోంది. ఈ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నది అధికారపార్టీలోని ద్వితీయశ్రేణి నేతాగణమేనని తెలుస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో రేషన్ మాఫియాకు సంబంధించి కీలక నేతల పేర్లు ప్రచారంలో ఉంటున్నప్పటికీ దానిని కట్టడి చేసే విషయంలో సదరు నేతాగణం కూడా మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. రేషన్ మాఫియా లెక్కల ప్రకారం నియోజకవర్గానికి నెలకు రూ.25 లక్షలు ముడుపులు నేతలకు ఇస్తున్నామని చెప్పడం కొసమెరుపు.


6ఏ కేసులా.. అవి మమ్మల్నేం చేస్తాయి

బియ్యం దొంగలపై గడచిన పది నెలల్లో జిల్లా వ్యాప్తంగా 125 వరకు 6ఏ కేసులను అధికారులు పెట్టారు. ఇవేవీ ఆ మాఫియాకు అడ్డుకట్ట వేయడంలేదు. 6ఏ కేసులంటేనే ఓ మొక్కుబడి తంతుగా మారింది తప్ప వాటివల్ల దందాలో ఉన్న వ్యక్తులు వెనకడుగు వేస్తారనుకోవడం నిరూపితమవుతూనే ఉంది. 6ఏ కేసులో ఓ సారి పట్టుబడిన వ్యక్తిపైనే మళ్లీమళ్లీ అవే కేసులు నమోదవుతుంటాయి తప్ప వారు ఈ దందా నుంచి తప్పుకోవడం లేదు. ప్రభుత్వం అమలు చేస్తానన్న పీడీ యాక్టు అస్త్రం ప్రకటనలకే పరిమితమైంది తప్ప ఆచరణలోకి రావడం లేదు



నా రేటే.. సపరేటు

- విజిలెన్స్‌లో వితండ వాదన
- ఎవర్నీ వదిలేది లేదన్న రీతిలో దోపిడీ
- అడిగినంత ఇవ్వకుంటే రూ.90 లక్షలు ఫైన్ వేస్తామని మైనింగ్ వ్యాపారికి హెచ్చరిక



గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్‌లోని కొందరు అధికారుల తీరు వివాదాస్పద మవుతోంది. ఇచ్చే దాని కన్నా ఎక్కువ కావాలని పట్టు పడుతుండటంతో వివాదం తలెత్తుతుంది. అడిగి నంత ఇవ్వకుంటే ఇబ్బందులు పడతారని హెచ్చ రిస్తూ కొందరు అధికారులు దోపిడీకి తెర తీస్తున్నారు. ఇసుక.. రేషన్ బియ్యం.. ఇలా వ్యాపారం ఏ దైనా తమను కలవాల్సిందే అని తెగేసి చెబుతున్నారు. ఇవన్నీ జిల్లా అధికారికి తెలుసో.. లేదో.. కానీ మొత్తానికి పరిస్థితి మాత్రం చేయి దాటిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజిలెన్స్‌లోకి వచ్చిన అధికారులు కొందరు కొన్నిరోజులు బాగానే ఉన్నా ఆ తర్వాత వ్యాపారులను పిలిపించి రహస్యంగా మాట్లాడటం మొదలెట్టారు.

రూ.90 లక్షలు.. గుండె గుభేలు

ఆరోపణల నేపథ్యంలో ఈ మధ్య ఓ మైనింగ్ వ్యాపారిని కలిసిన అధికారులు గుండె గుభేలుమనే మాట చెప్పారు. దారికి రాకుంటే రూ.90 లక్షలు ఫైన్ రాస్తామని చెప్పడంతో ఆ వ్యాపారి ఒణికిపోయాడు. చేసేది లేక అడిగినంత ముట్టజెప్పినట్లు సమాచారం. ఇలాంటి ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఏ పార్టీ అయినా డోంట్‌కేర్

విజిలెన్స్‌లోని ఒకరిద్దరు అధికారులు పార్టీలతో పనిలేకుండా మామూళ్ల కోసం ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో నెలకు రూ.50 వేలు ఇస్తే ఇప్పుడు రూ.లక్ష వరకు ఇవ్వాలని రేట్లు పెంచటం జరిగింది. చేసేది లేక అడిగినంత ఇస్తున్నా ఓ అధికారి సపరేటుగా కలవాలని ఒత్తిడి చేస్తున్నాడని వ్యాపారులు కొందరు ఆరోపిస్తున్నారు. వ్యాపారాలు ఎవరు ఎక్కడ వరకు చేయాలో హద్దులు కూడా ఆయనే నిర్ణయిస్తున్నారని చెబుతున్నారు. కొందరు అధికారుల నుంచి ఫోన్ వస్తుంటేనే గుండెలు ఆగినంత పని అవుతోందని వాపోతున్నారు. పల్నాడు, డెల్టాలోని ఇసుక రేవుల్లో మొదట కొద్దిగా హడావుడి చేశారు. ఆ తర్వాత కథ మొత్తం కంచికి వెళ్లింది.

అప్పుడలా.. ఇప్పుడిలా...

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్తలపై దురుసుగా ప్రవర్తించిన వారికే విజిలెన్స్‌లో పోస్టులు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఓ అధికారి ప్రస్తుత ముఖ్యమంత్రి గురించి బహిరంగంగానే నోరు పారేసుకున్నాడని కొందరు టీడీపీ నేతలు చెబుతున్నారు. ఈ అధికారి వైసీపీ హయాంలో కూడా కీలకమైన పోస్టు లోనే ఉన్నట్లు గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు అదే అధికారి విజిలెన్స్‌లోకి వచ్చారంటున్నారు. మొత్తంమీద కొందరు విజిలెన్స్ అధికారుల వ్యవహార శైలి ఎవర్నీ ఖాతరు చేయని పరిస్థితిలో ఉన్నట్లు బహిర్గతం అవుతుంది.

దూరవిద్యలో.. అరకొరే

- నిరాశాజనకంగా పదిలో ఉత్తీర్ణత
- ఐదో స్థానంలో నిలిచిన పల్నాడు జిల్లా
- తీసికట్టుగా గుంటూరు, బాపట్ల ఫలితాలు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచిన గుంటూరు జిల్లా దూర విద్యలో మాత్రం నిరాశాజనకమైన ఫలితాలు మూటగట్టు కుంది. గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల జిల్లాల్లో కూడా నిరాశాజనకమైన ఫలితాలు నమోదయ్యాయి. పల్నాడు జిల్లాలో మాత్రం కొంత మెరుగుగా ఉంది. పదో తరగతి దూర విద్య పరీక్షకు గుంటూరు జిల్లా నుంచి 939 మంది హాజరు కాగా వారిలో 55 మంది మాత్రమే(5.86 శాతం) ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రస్థాయిలో జిల్లా 22వ స్థానంలో నిలిచింది. ఇక పల్నాడు జిల్లా నుంచి 1077 మంది పరీక్షకు హాజరు కాగా 567 మంది(52.65 శాతం) ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రస్థాయిలో పల్నాడు జిల్లా ఐదో స్థానం లో నిలిచింది. బాపట్ల జిల్లా నుంచి 749 మంది పరీక్షలకు హాజరుకాగా 179 మంది (23.90 శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రస్థాయిలో జిల్లా స్థానం 14గా నమోదైంది.

ఇంటర్ ఫలితాల్లో..

దూరవిద్య ఇంటర్‌కు సంబంధించి గుంటూరు జిల్లా నుంచి 2180 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో 1218 మంది (56.51 శాతం) మాత్రమే ఉత్తీర్ణుల య్యారు. రాష్ట్రస్థాయిలో జిల్లా ఎనిమిదో స్థానంలో నిలిచింది బాపట్ల జిల్లా నుంచి 1766 మంది పరీక్షలకు హాజరుకాగా 1028(58.21 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రస్థాయిలో జిల్లా ఆరో స్థానంలో నిలిచింది ఇక పల్నాడు జిల్లా నుంచి 1996 మంది పరీక్షకు హాజరుకాగా 1128 మంది (56.21 శాతం) ఉత్తీర్ణుల య్యారు. ఉత్తీర్ణతలో జిల్లాస్థానం ఏడుగా నమోదైంది.



దేవస్థానం అధికారులు, పూజారులతో మంత్రి గొట్టిపాటి

లోపాలు లేకుండా మహాకుంభాభిషేకం

● ఏర్పాట్లపై మంత్రి గొట్టిపాటి
● ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులకు సూచన

అద్దంకి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మహా కుంభాభిషేకం ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖ మండప నిర్మాణ పనులు పూర్తయిన తరువాత మే 19న నిర్వహించే మహాకుంభాభిషేకం ఏర్పాట్లపై గురువారం ఉదయం తాడేపల్లిలోని మంత్రి నివాసంలో దేవస్థానం అధికారులు, పూజారులతో మంత్రి రవికుమార్ చర్చించారు. మహాకుంభాభిషేకానికి భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ప్రశాంతంగా స్వామి వారి దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహాకుంభాభిషేకం నిర్వహణకు శృంగేరి పీఠాధిపతి, శిష్య బృందం వస్తున్నందున ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమం తదితర కార్య క్రమాల నిర్వహణకు టీటీడీ కల్యాణ మండపాన్ని రీమోడల్ చేయిస్తున్నట్లు మంత్రికి ఈవో తిమ్మానాయుడు వివరించారు. అదే సమయంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల బసకు ఇబ్బంది లేకుండా అన్ని సామాజిక అన్నదాన సత్రాలలో ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే సమావేశం ఏర్పాటు చేసి చెప్పినట్లు మంత్రి రవికుమార్‌కు ఈవో తెలిపారు. సమావేశంలో ప్రధాన పూజారి లక్ష్మీనారాయణ, ఆచార్యులు, కిషోర్ పాల్గొన్నారు.



వీరన్నపాలెంలో రైతులతో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

● కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య

పర్చూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) :నల్లబర్లీ పొగాకుకు రూ.18వేల మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేసి కౌలు రైతులను ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం రైతుసంఘం నాయకులు పర్చూరు మండలంలో పర్యటించి పొగాకు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలను వెంటనే రంగలోకి దించి నల్లబర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో వీరన్నపాలెం, పోతుకట్ల, రమణాయపాలెం, ఉప్పుటూరు గ్రామాల్లో నాయకులు పర్యటించారు. వీరన్నపాలెంలో 300 మంది కౌలు రైతులు సగటున 5 ఎకరాల చొప్పున 1500 ఎకరాల్లో నల్లబర్లీని సాగుచేశారన్నారు. సమస్యలపై వచ్చేనెల 5న సీఎం కార్యాలయానికి రైతులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, రైతులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో మంత్రి కొల్లు వినతిపత్రం అందజేస్తున్న గ్రానైట్ పరిశ్రమల యజమానులు

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలి

● మంత్రి కొల్లుకు యజమానుల వినతి

మార్టూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ పరిశ్రమలను ఆదుకోవాలని మార్టూరు గ్రానైట్ పరిశ్రమల యజమానులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు సమక్షంలో గురువారం విజయవాడలో మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతిపత్రం అందచేశారు. గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని, ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమ పురోగతికి సహకరించాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా మార్టూరు గ్రానైట్ పరిశ్రమల నిర్వహణ తీరు, ఇబ్బందులను ఎమ్మెల్యే ఏలూరి మంత్రి కొల్లు దృష్టికి తెచ్చారు. ప్రభుత్వపరంగా సహకారం అందిస్తే గ్రానైట్ పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని కోరారు. కార్యక్రమంలో మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్, మాజీ అధ్యక్షుడు ఇంటూరి ఆంజనేయులు, దివ్వె ప్రసాద్, కోటపాటి సురేష్, కామినేని జనార్దన్, షేక్ రజాక్, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో వసతులు పెంచాలి

చీరాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వైపే ప్రభుత్వ కళాశాలలో వసతులు పెంచి విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా కృషి చేయాలని ప్రిన్సిపాల్ డా.ఎస్ మురళి పేర్కొన్నారు. కళాశాలలో గురువారం కాలేజీ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా 2025-26 విద్యా సంవత్సరం ప్రణాళిక, అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్ రవికుమార్‌రెడ్డి, డా.ఐ.బాబూరావు, మురళీ కృష్ణ, బ్రహ్మారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మురళి

గోశాలకు 12 బస్తాల తవుడు అందజేత

అద్దంకిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో హరి హర గోకులానికి దాతల సహకారంతో తౌడు బస్తాలను అందజేసినట్లు అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. గురువారం పట్టణంలో హరి హర గోశాలకు దామ జగదీష్ కుమార్తె ధాత్రిశ్రీ పుట్టిన రోజు సందర్భంగా 8 బస్తాలు, చెన్నుపల్లి అంజయ్య 2 బస్తాలు, చెన్నుపల్లి సుబ్బారావు 2 బస్తాల తౌడును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ మురళీసుధాకరరావు, ట్రెజరర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చైర్మన్ పీఠం దక్కేదెవరికో..?

సమయమిచ్చినా చేతులెత్తేసిన జంజనం
అనివార్యమైన అవిశ్వాసం
ఆ స్థానం కోసం అశావాహుల ప్రయత్నాలు
ఈ విషయంపై గోప్యత పాటిస్తున్న ఎమ్మెల్యే

చీరాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై కౌన్సిలర్‌లు అవిశ్వాసం ప్రకటించారు. అందుకు సంబంధించిన తీర్మాన కాపీని బుధవారం కలెక్టర్ వెంకట మురళికి అందజేశారు. అయితే అవిశ్వాస అంశానికి దాదాపు రెండు మాసాల నుంచి ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై మొదటి నుంచీ ఎమ్మెల్యే కొండయ్య లాభ నష్టాలను బేరీజు చేసుకుంటూ వస్తున్నారు. కలిసి ఉంటే కలదు సుఖం అన్నట్లుగా చాలా సమయం మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుకు అవకాశం ఇచ్చినట్లయింది. ఈ నేపథ్యంలో కొన్ని ప్రభుత్వ, అభివృద్ధి పనులను కలిసే నిర్వహించారు. అయితే కొన్ని రాజకీయ సమీకరణాలు, మరోవైపు చైర్మన్ దోబూచులాట, చైర్మన్ చాంబర్‌ను వైసీపీ కార్యాలయంగా మార్చి అక్కడే సమావేశాలు నిర్వహిస్తుండడంతో అంగీకరించని టీడీపీ కౌన్సిలర్‌లు ఎమ్మెల్యేపై ఒకింత అవిశ్వాసానికి ఒత్తిడి తెచ్చారు. గత నాలుగేళ్లుగా వైసీపీ నుంచి చైర్మన్ స్థానంలో అధికారం చేపట్టిన జంజనంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నట్లు కన్పిస్తుంది. మరోవైపు ఆయన సామాజికవర్గం కౌన్సిలర్‌లు సైతం చైర్మన్‌పై లోలోపల గుర్రుగానే ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పలుమార్లు ఎమ్మెల్యే కొండయ్య సున్నితంగా హెచ్చరించినా చైర్మన్ తీరు మారలేదు. దీంతో అవిశ్వాసానికి సై అన్నారు.

స్థానిక సంస్థలకు కలిసొచ్చే అంశం

చీరాలకు మునిసిపాలిటీ వెన్నెముక లాంటిది. అనేక అభివృద్ధి, ఆదాయ పనులన్నింటిలోనూ కొన్ని రాజకీయ సమీకరణాలకు ముడిపడి ఉంటుంది. మునిసిపాలిటీ మొత్తంగా సుమారు లక్ష ఓట్లు ఉన్నాయి. వైసీపీ హయాంలో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో టీడీపీకి చేదు అనుభవం మిగిలినా తాజా పరిస్థితులు ఆపార్టీకి కలిసిరానున్నాయి. దీంతో అవిశ్వాసం రూపంలో చైర్మన్ పీఠంపై త్వరలో టీడీపీ జెండా ఎగరనుంది. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీకి అవిశ్వాసం కలిసిరానుంది.



పాపికొండలు విహారయాత్రలో కుటుంబసభ్యులతో చీరాల కౌన్సిలర్లు

చైర్మన్ ఎవరన్నదానిపై గోప్యత

అవిశ్వాసంపై అధికారులు ఇప్పటికే ప్రక్రియ ప్రారంభించారు. అయితే చైర్మన్ స్థానంపై పలుమార్లు ఆశించి భంగపడిన పొత్తూరి సుబ్బయ్య, మించాల సాంబశివరావు ఈసారి గట్టిగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే గతంలోనూ ప్రయత్నాలు సాగించి విఫలమైన సూరగాని లక్ష్మి అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలో చైర్మన్ ఎవరన్నదానిపై చర్చ వాడీవేడీగా ఉంది. అయితే ఎమ్మెల్యే కొండయ్య మాత్రం దీనిపై చాలా గోప్యత పాటిస్తున్నారు. ఈ విషయంలో అనుభవంతో తనదైన మార్కుతో ముందుకు సాగుతున్నారు. అయితే ఈ ఉత్కంఠకు మరికొద్ది రోజుల్లోనే తెరపడనుంది.

హంతక ముఠాలపై ప్రత్యేక నిఘా

రెండు కోణాలలో దర్యాప్తు
మంచి రాజకీయ భవిష్యత్ దశలో ప్రాణాలు కోల్పోయిన వీరయ్య

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఇటు రాజకీయంగా అటు వ్యాపారపరంగానూ ఉజ్వల భవిష్యత్‌కు దగ్గరైన యువ నాయకుడు వీరయ్యచౌదరి హత్య రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. అందులోనూ పూర్వం ఒంగోలులో జరిగిన హత్యలను గుర్తుకు తెచ్చే విధంగా సాయంత్రం 7.30 సమయంలోనే హంతకులు నిమిషాల వ్యవధిలో హత్యచేసి నింపాదిగా పరారు కావడం యావత్ ప్రజానీకాన్ని ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటన పోలీస్ నిఘా విభాగంలోని డొల్లతనాన్ని తేటతెల్లం చేసింది. హత్య జరిగిన తీరుతెన్నులను పరిశీలిస్తే హంతకులు ఆరితేరిన నేరస్తులుగా తేటతెల్లం అవుతుంది. హతుడు బతికే అవకాశం లేకుండా కత్తితో పొడవడం అందులోనూ శరీరంలో ప్రాణాలను తీసే భాగాలలో కత్తితో పొడిచిన తీరు అందుకు దర్పణం పడుతుంది. పూర్తిస్థాయిలో రెక్కీ నిర్వహించుకునే దుండగులు హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. వీరయ్య నగరంలో ఉంటే సాయంత్రం 7 గంటలకు కార్యాలయానికి చేరే అలవాటు ఉంది. ఆ తర్వాత 8 గంటల సమయానికే అతని వద్ద పనిచేసే ఉద్యోగులు, కలెక్షన్ బాయ్‌లు అక్కడికి చేరుతుంటారు. వీరయ్యను కలిసే రాజకీయ శ్రేణులు కూడా ఆ సమయానికి అక్కడకు చేరడం నిత్యం జరిగే ప్రక్రియ. ఈలోపు వీరయ్య ఫోన్‌లో ఇటు రాజకీయ అటు వ్యాపారపరమైన అంశాలపై మాట్లాడుకుంటూ ఉండటం ఆఫీసులో ఉండే అకౌంటెంట్‌తో మాట్లాడుతుండం తెలిసిందే. తద్వారా వీరయ్య కార్యాలయానికి చేరిన తొలి అరగంటలో అతని వద్ద పెద్దగా ఉద్యోగులు, అనుచరులు ఉండరనే విషయం హంతక బృందం ముందుగానే పసిగట్టినట్లు వెల్లడవుతుంది. దీనికి తోడు పూర్తి జనసంచార ప్రాంతం కావడంతో నిమిషాలలోనే తమ పని ముగించుకునే విధంగా హంతకులు పథకం రూపొందించుకోగలిగారు. తదనుగుణంగానే వారు వీరయ్య గదిలోకి వెళ్లడం అక్కడ ఉన్న ఇద్దరు సిబ్బంది మెడపై కత్తులు పెట్టడం హడావుడిగా వీరయ్య లేవగానే ఒకరు బలమైన ఆయుధంతో అతని మెడ మీద ఆ వెంటనే గుండె మీద అ వెంటనే పొట్టపై పొడవడం క్షణాలలో జరిగిపోయింది. వీరయ్యకు బతికే అవకాశం ఇవ్వకూడదనే ఆలోచన, ఖచ్చితత్వాన్ని హంతకులు ప్రదర్శించారు. అందుకు మనిషికి ఆయువు పట్టుగా ఉన్న వాటిపై పొడవడంతోపాటు శరీరంలో మొత్తం 50చోట్ల కత్తితో గాయపర్చారు. అంతా మూడు నుంచి నాలుగు నిమిషాల వ్యవధిలోనే పూర్తిచేశారంటే హంతకులు ఏ స్థాయిలో ముందస్తు రెక్కీ నిర్వహించుకుని పని ముగించారో అర్థమవుతుంది. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే దుండగులు హత్యలలో ఆరితేరిన వారనేది ప్రాథమిక దార్యప్తులోనే పోలీసులు కూడా గుర్తించారు. ఆ కోణంలో చూస్తే ముఠా కొద్దిరోజుల ముందుగానే ఒంగోలులోకి ప్రవేశించి వ్యూహం రూపొందించుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హంతకులు ముఖానికి ముసుగులు కూడా ధరించకుండా చేతిబ్యాగులలో కత్తులు పెట్టుకుని పైకి రావడం గమనార్హం. బ్యాగ్‌తో పైకెళ్లడం ద్వారా కింద చూపరులకు అనుమానం రాకుండా జాగ్రత్తపడ్డారు. ఇదే సమయంలో నగరంలో రౌడీమూకలు, హంతక ముఠాలపై పోలీస్ శాఖ నిత్యం నిఘా ఉండటం సహజంగా జరుగుతుంది. పాత నేరస్తుల కదలికలతోపాటు బయట నుంచి వచ్చి తిరుగుతున్న వారిని పసిగట్టడం నిఘా విభాగం విధులలో ఒక భాగం. ఆ విషయంలోనే పోలీస్ నిఘా విభాగం డొల్లతనం ఈ విషయంలో తేటతెల్లం అవుతుంది.

ద్విముఖ వ్యూహం.. జల్లెడ పట్టిన వైనం

హతుడు వీరయ్యకు స్వగ్రామం అమ్మనబ్రోలులోనూ నాగులుప్పలపాడు మండలంలో రాజకీయంగా విభేదించే వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఒకప్పుడు బెంగళూరులో కూడా వీరయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసేవాడు. అయితే అక్కడి వీరయ్య భాగస్వామి కరోనా సమయంలో మృతిచెందడంతో అక్కడ తెగతెంపులు చేసుకుని జిల్లాలోనే వ్యాపారం చేస్తున్నాడు. అయినా బెంగళూరులో వ్యాపార సమయంలో జరిగిన అంశాలను కూడా పోలీసులు పరిగణిస్తున్నట్లు తెలిసింది. అలాగే ఏడాది క్రితం రామాయపట్నం ఓడరేవు ప్రాంతంలో సుమారు 100 ఎకరాల భూమిని వీరయ్య కొనుగోలు చేసినట్లు పోలీసులు పసిగట్టారు. అందులోనూ కొంత వివాదం ఉండి ఆ వ్యవహారం కోర్టులో ఉన్నట్లు తెలుసుకున్నారు. ఆ అంశం పూర్వాపరాలపైన దర్యాప్తు జరుగుతున్నట్లు తెలిసింది. వీటికితోడు మండలంలో రాజకీయంగా విభేదిస్తూ వైసీపీ నేతల అండదండలతో ఉన్న రేషన్ బియ్యం మాఫియాపైనా పోలీసులు కీలకంగా దర్యాప్తు చేస్తున్నారు. అందులో ఒక కీలక రౌడీషీటర్‌తో పాటు వారికి సంబంధాలు ఉన్నాయని నలుగురిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హంతకులు కసిగా వ్యవహరించిన తీరును దృష్టిలో ఉంచుకుని రాజకీయ, ఆర్థిక, మహిళల వ్యవహారాలు ఉండే అవకాశం ఉందన్న అంశాలను పరిశీలిస్తున్నారు. అయితే మహిళలకు సంబంధించిన ఎలాంటి అంశం వీరయ్య జీవితంలో లేదన్న అంశం గుర్తించి వ్యాపార, రాజకీయకోణాల్లోనే దర్యాప్తు చేస్తున్నారు.

చిన్న క్లూతో.. సరికొత్త దర్యాప్తు

ఈ దశలో ఒక చిన్నపాటి క్లూతో పోలీసులు సరికొత్త దర్యాప్తునకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. అందులో భాగంగానే మరోసారి ఎస్పీ తన బృందంతో ఘటనా స్థలానికి వచ్చి ప్రత్యక్ష సాక్షుల ద్వారా గురువారం సాయంత్రం స్వీయ పరిశీలన చేపట్టారు. ఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో అటుఇటు సంచరించిన వారిని గుర్తించే ప్రక్రియకు శ్రీకారం పలికారు. సీసీ కెమెరాలలో గుర్తు తెలియని వ్యక్తుల రాకపోకలను కొంతమేర గుర్తించారు. వారిలో కొందరి ముఖ కవళికలు స్పష్టంగా కనిపించగా మరి కొందరివి స్పష్టత లేవని తెలిసింది. దీంతో సాంకేతిక విధానంలో అలాంటి వారిని ముఖాలను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం పలికారు. హంతకులు తెలివిగా సీసీ కెమెరాలు ఎక్కడున్నవి ముందుగానే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకున్నారన్న అంచనాకు కూడా పోలీసులు వచ్చినట్లు తెలిసింది. అయితే హంతకులు వాడిన బైకులు కూడా ఇంతవరకు పోలీసులు గుర్తించలేకపోయారు. దీంతో నేరస్తులను జల్లెడ పట్టే పనికి శ్రీకారం పలికారు. జిల్లాలో, సమీప జిల్లాల్లో నేరస్తులు ప్రత్యేకించి హంతక ముఠాల్లోని సభ్యులను పట్టుకొచ్చి విచారిస్తున్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడైనా క్లూ చిక్కుతుందన్న విశ్వాసం పోలీసుల్లో ఉంది.

కంటి ముందు ఉజ్వల భవిష్యత్తు

ఒకప్పుడు వీరయ్య వ్యవహారశైలి దూకుడుగా ఉండేది. అనేక చేదు అనుభవాలు, మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సహనం, సయోధ్యతో ముందుకు సాగే విధానానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లాలోని టీడీపీ ముఖ్య నాయకులతోపాటు లోకేష్ దృష్టిలోనూ నిలిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా పేరుపెట్టి పలకరించే పరిస్థితి ఉంది. ప్రస్తుత పరిస్థితిని బట్టి సెంట్రల్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జిగా ఆయన ఎంపికయ్యే అవకాశం కనిపిస్తుంది. ఆ పదవికి పార్టీలో పోటీ ఉన్నప్పటికి లోకేష్ దృష్టిలో ఉన్నందున వీరయ్యను ఆ పదవి వరించబోతుందన్న విషయం ఆ పార్టీ ముఖ్య నాయకులందరిలోనూ ఉంది. ఆ పదవి ద్వారా రాజకీయంగా పార్టీలో మరింత ఎదగాలన్న ఉద్దేశంతో నాయకులందరితో సన్నిహితంగా మెలుగుతున్న సమయంలో హత్యకు గురయ్యారు.

ఏఎంసీ వైస్ చైర్మన్ల ఎంపిక

అద్దంకికి నాగేశ్వరరావు, సంతమాగులూరుకు నరేంద్ర



దేవినేని నరేంద్ర (సంతమాగులూరు)

అద్దంకి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నియోజకవర్గంలోని అద్దంకి, సంతమాగులూరు మార్కెట్ కమిటీలు (ఏఎంసీ) వైస్ చైర్మన్‌లు, సభ్యుల పేర్లను ప్రకటించారు. అద్దంకి ఏఎంసీ చైర్మన్‌గా వరగాని పద్మావతిని గతంలోనే ప్రకటించారు. అద్దంకి వైస్ చైర్మన్‌గా దర్శవరపు నాగేశ్వరరావు, సభ్యులుగా బొప్పూడి భారతి, చింతా వెంకటేశ్వరరెడ్డి, గుంజి రామాంజనేయులు, గుంజి రేణుక, కర్నాటి పూర్ణచంద్రరావు, కొప్పర్తి నాగరాజ, కురిచేటి వెంకటసుబ్బారావు, మద్దుమాల నారయ్య, మేకల అంకమ్మ, మిద్దెబోయిన పాపారావు, పూనాటి పద్మ, రాయపాటి రామాంజమ్మ, యస్‌కె రహిమున్నీని నియమించారు.

సంతమాగులూరు మార్కెట్ కమిటీ ..

సంతమాగులూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తేల ప్రోలు రమేష్‌ను ఇప్పటికే ప్రకటించగా, గురువారం వైస్‌చైర్మన్‌గా దేవినేని నరేంద్ర, సభ్యులుగా బైలడుగు శివయ్య, బొల్లా నాగేశ్వరరావు, గోమరావలి సుభాని, గుంజి అంకమ్మ, జొన్నలగడ్డ లక్ష్మి, కాట్రగడ్డ వరలక్ష్మి, కొల్లి నాగశేషమ్మ, కుంచపు నాగేశ్వర మ్మ, మేడ రేణుకేశ్వరరావు, మూడావత్ మేరిబాయ్, పెరివేముల అరుణ,పులి అంజమ్మ, తాళ్ల గోవిందమ్మను నియమించారు. సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఓసీలకు కేటాయించడం తో పాటు ఇద్దరు ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడం విశేషం. అద్దంకి ఏఎంసీ చైర్మన్‌గా ఎస్సీ సామాజికవర్గానికి కేటాయించగా వైస్ చైర్మన్‌గా కాపు సామాజికవర్గానికి కేటాయించారు.

వలసలు నివారించడమే ప్రభుత్వ లక్ష్యం

● కూలీలతో మమేకమై వారితో పాటు పనిచేసిన సబ్‌కలెక్టర్

మార్కాపురం రూరల్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి). గ్రామీణ ప్రాంతాలలో కూలీల వలసలను నివారించడమే ప్రభుత్వ లక్ష్యమని సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ తెలిపారు. మండలంలోని దరిమడుగు గ్రామ పరిధిలో వెలిగొండ ప్రాజెక్టు కలనూతల-1 పునరావాస కాలనీ వద్ద వెలిగొండ ప్రాజెక్టు కాలువలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను గురువారం సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొంత సమయం కూలీలతో పాటు కాలువలో గొడ్డలి చేతపట్టి పిచ్చి చెట్ల తొలగింపు పనులు, గడ్డపారతో మట్టిని తవ్వడం, పారతో మట్టిని తీసుకుని కాలువపై పోయడం వంటి పనులను చేసి కూలీలలో ఉత్సాహాన్ని నింపారు. కూలీలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో తాగునీటి సౌకర్యం, ప్రథమ చికిత్స సామగ్రి, నీడ వంటి సదుపాయాలు ప్రతి రోజు ఏర్పాటు చేస్తున్నారా..? లేదా.? అని అడిగి తెలుసుకున్నారు.

ఎన్ని రోజులు నుండి పని చేస్తున్నారు. వేతనాలు సక్రమంగా వ్యక్తిగత ఖాతాలలో జమవుతున్నాయా..? లేదా..? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. . గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన పశువుల నీటి తొట్టెను, పశువుల పాకను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాగరాజు ఈసీ కిషోర్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు జవ్వాజి రామాంజులరెడ్డి, టీఏ కాశీరావు, ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ వెంకటేశ్వర్లు , పక్కన మృతి చెందిన సోమమ్మ (ఫైల్)

కూలీల ఆటో బోల్తా

● ఒకరు మృతి, పలువురికి గాయాలు

చినగంజాం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కూలీల ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందగా, పలువురికి గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదం ఇంకొల్లు, కడవకుదురు ఆర్‌అండ్‌బీ రహదారిలోని తిమ్మసముద్రం అడ్డరోడ్డు సమీపంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి. మిరపకాయల కోతకు గురువారం ఉదయాన్నే మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన మహిళా కూలీలు పావులూరుకు ఆటోలో బయలుదేరారు. ఆటో తిమ్మసముద్రం అడ్డరోడ్డు దాటిన తరుతాత హ్యాండిల్ ఒక్కసారిగా బిగుసుకొనిపోయి అదుపు తప్పి ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనున్న పొలాల్లో వెళ్లి బోల్తా పడింది. ఆటోలో ఉన్న 15 మంది మహిళా కూలీలు ఒకరిపై ఒకరు పడిపోయారు. ఈ ఘటనలో బత్తుల కమలమ్మ, కొండేపి శేషమ్మ, నక్కల సోమమ్మ, ఆటో డ్రైవర్ గొల్లపూడి వెంకటేశ్వర్లులకు తీవ్రగాయాలు కాగా, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారిని 108లో చీరాల వైద్యశాలకు తరిస్తుండగా మార్గమధ్యంలో నక్కల సోమమ్మ(72) మృతి చెందింది. తలకు తీవ్ర గాయమైన బత్తుల కమలమ్మను ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కొండేపి శేషమ్మ, వెంకటేశ్వర్లు చీరాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ శీలం రమేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. శేషమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోమమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు. పరిమితికి మించి అధిక లోడుతో ఆటోలు వెళ్తున్నా సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు తగు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.



ప్రమాదానికి గురైన ప్రయివేటు బస్సు, కింద అపస్మారకస్థితిలో పడి ఉన్న డ్రైవర్ ఫయాజ్

కొండను ఢీ కొన్న ప్రైవేటు బస్సు

● శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఘటన
● డ్రైవర్ పరిస్థితి విషమం ● పలువురికి స్వల్ప గాయాలు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు కొండను ఢీకొన్న ఘటన శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో నల్లమల అటవీ ప్రాంతంలో గురువారం చోటుచేసుకొంది. చిన్నారుట్ల సమీపంలోని మలుపు వద్ద బస్సు వేగం అదుపుతప్పి కొండను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఫయాజ్‌కు తీవ్రగాయాలు కాగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి మండలం సిరిగుప్ప గ్రామానికి చెందిన 40 మంది కాశీయాత్రలో భాగంగా శ్రీశైలం వెళుతుండగా ప్రమాదం చోటుచేసుకొంది. ఈ బస్సు ముందు భాగం దెబ్బ తినగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆ కుదుపునకు పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. తేరుకున్న యాత్రికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను సున్నిపెంట వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.



ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

ఆటోను ఢీకొన్న లారీ

● మహిళా కూలీలకు గాయాలు

నాగులుప్పలపాడు,ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆటోను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో నలుగురు మహిళా కూలీలు గాయపడ్డారు.ఈ సంఘటన 216 రహదారిపై ఉప్పుగుండూరు సమీపంలో చోటుచేసుకొంది. కూలీలు తెలిపిన వివరాల మేరకు చినగంజాం మండలం రామచంద్రానగర్‌కు చెందిన కూలీలు గురువారం ఉదయం ఆటోలో మిర్చి కోతలకు నాగులుప్పలపాడు వైపు వెళుతున్న క్రమంలో ఉప్పుగుండూరు వద్ద నాగన్నవాగు సమీపంలోకి రాగా చీరాల వైపు వెళుతున్న టిప్పర్ ఢీకొని ఆగకుండా వెళ్లింది. దాంతో ఆటోలో ఉన్న బల్లి సుబ్బలక్ష్మి, పచ్చంగి సూర నాగమ్మ, దండపోలు కల్యాణలక్ష్మి,రాసానే జాలమ్మ గాయపడ్డారు. వారిని 108 లో ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంకా వైఎస్సార్ పేరే

» విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలపై తొలగించని వైనం » ప్రభుత్వ ఆదేశాల అమలులో నిర్లక్ష్యం



శింగరకొండపాలెంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ భవనంపై ఉన్న వైఎస్సార్ పేరు

అద్దంకి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో వైద్య సదుపాయం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో గత వైసీపీ హయాంలో పెద్ద ఎత్తున ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భారత్ నిర్మాణ్ సేవా కేంద్రం భవనాలను నిర్మించింది. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పేరులో వైఎస్సార్ పేరును తొలగించి విలేజ్ హెల్త్ క్లినిక్‌గా మార్పు చేశారు. అయితే ఆ మార్పు రికార్డులకే మా త్రమే పరిమితం అ య్యిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలు విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలపై ఇంకా వైస్సార్ పేఉను తొలగించకపోవడం ఇందుకు నిదర్శనం. ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా క్షేత్ర స్థాయిలో వాటి అమలులో అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పనటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆయా భవనాలపై పేరు మార్పునకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఉగ్ర దాడి అమానుషం

» ఎమ్మెల్యే కొండయ్య
» కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు

చీరాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకులపై అత్యంత పాశవికంగా ఉగ్ర వాదులు దాడి చేయడం అమానుషమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. గురువారం రాత్రి టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాదాలు చేశారు. దీంతో చీరాల హోరెత్తింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవత్వాన్ని మరచి క్రూరంగా హత్యకు పాల్పడిన ఘటన యావత్ దేశాన్ని కలచివేసిందన్నారు. ఉగ్రవాదాన్ని అంత మొందించేందుకు దేశరక్షణ విభాగం ప్రణాళిక చేస్తున్నట్లు వివరించారు. బాధిత కుటుంబానికి కన్నీటి వీడ్కోలు తెలిపారు. అలాగే కొద్దిసేపు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేత ఆమంచి స్వాములు, టీ డీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. హిందు సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ అనంతరం పాకిస్థాన్ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు.

న్యాయవాదుల నిరసన

పర్చూరు : కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ పర్చూరు కోర్టు బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ మేరకు వారు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు పూరిమెట్ల జాన్‌బాబు కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.



ఢిల్లీలో అవార్డును అందుకుంటున్న విజయలక్ష్మి

సూదివారిపాలెం సర్పంచ్‌కి అవార్డు

ఇంకొల్లు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూదివారిపాలెం గ్రామ సర్పంచ్ గోరంట్ల విజయలక్ష్మి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. గ్రామంలో స్వచ్ఛభారత్, జలజీవన్ మిషన్ వంటి ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఆమె చేసిన కృషిని గుర్తించి శానిటేషన్ లీడర్‌షిప్ అవార్డును అందజేశారు. ఢిల్లీలో సర్పంచ్ సమావాద్ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ చేతుల మీదుగా విజయలక్ష్మి అవార్డును అందుకున్నారు. అలాగే ఇదుపులపాడు గ్రామ సర్పంచ్ సుమతి, జక్కరయ్యకు ఉత్తమ సర్పంచ్ అవార్డు అందజేశారు.

సర్పంచ్ అంజిబాబుకు సేవా పురస్కారం



సర్పంచ్ అంజిబాబుకు పురస్కారాన్ని అందజేస్తున్న నేతలు

బల్లికురవ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా బల్లికురవ గ్రామ సర్పంచ్ పందిరి అంజిబాబుకు నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ చాంబర్ ఆంధ్రప్రదేశ్ గ్రామ స్వ రాజ్య సాధన సమితి గురువారం ఉమ్మడి జిల్లా ఒంగోలులో సేవా పురస్కారాన్ని అందజేశారు. ఈసందర్భంగా బల్లికురవ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజారంజక పాలన అందిస్తున్న అంజిబాబును ఘనంగా సత్కరించి సేవా పురస్కారం 2024- 2035 ఏడాదికి గాను అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, సర్పంచ్‌ల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వీరభద్రచారి పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో సామాజిక భవనాలు

పంగులూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐదు గ్రామాలలో కోటీ 50 లక్షల రూపాయల సీఎస్ఆర్ నిధులతో సామాజిక భవనాల నిర్మాణం చేపట్టినట్లు పీఆర్ ఏఈ హనుమంతరావు తెలిపారు. తూర్పుకొప్పెరపాడు వడ్డెరకాలనీలో రూ.20 లక్షలు, తూర్పు తక్కెళ్లపాడులోని ఎస్సీకాలనీలో రూ.20లక్షలు, కొండమూరు ఎస్సీ కాలనీలో రూ.40లక్షలు, పంగులూరు యాదవ కాలనీలో రూ.20లక్షలు, కొండమంజులూరులో రూ.20లక్షలు, బూదవాడ ధనలక్ష్మి కాలనీలో రూ.30లక్షల సీఎస్ఆర్ నిధులతో సామాజిక భవన నిర్మాణ పనులు చేపట్టినట్లు ఏఈ హనుమంతరావు తెలిపారు. సామాజిక భవన నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నట్లు తెలిపారు. నూజెళ్లపల్లి ఎస్సీ కాలనీ ప్రజల సౌకర్యార్థం 5 లక్షల సి.ఎస్.ఆర్. నిధులతో బస్ షెల్టర్ నిర్మించనున్నట్లు ఏఈ తెలిపారు.

గ్రంథాలయానికి ఆట వస్తువుల బహూకరణ

చీరాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల వినియోగంతో భావిపౌరులుగా ఎదుగుతారని గ్రంథ పాలకురాలు ధనమ్మ అన్నారు. గురువారం శాఖ గ్రంథాలయంలో పల్లపోతు బాలసుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు రాధాకృష్ణమూర్తి, శ్యాంప్రసాద్ పలు విలువైన ఆట వస్తువులను బహూకరించారు. ఈ సందర్భంగా వారిని ధనమ్మ అభినందించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పర్చూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శుక్రవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 10.30 గంటలకు పర్చూరు మండల కేంద్రంలోని టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం, 11 గంటలకు వ్యవసాయశాఖ అధ్వర్యంలో యాంత్రీకరణ పరికరాల అందజేత, 11.30కి సాకేత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం, మధ్యాహ్నం 12 గంటలకు చిరువ్యాపారులకు నాలుగు చక్రాల బండ్లు పంపిణీ, మధ్నాహ్నం 12.30 గంటలకు దివ్యాంగులకు ఎలక్ట్రికల్ వాహనాల పంపిణీ, 12.40కి వెలుగు కార్యాలయంలో పీఎంజీఎస్‌వై నిరుద్యోగ భృతి కింద కెమెరాల పంపిణీ, 12.45కు ప్రసన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం, 12.50కి ఎన్టీఆర్ స్టేడియం పరిశీలన, అనంతరం చినగంజాం మండలం గొనసపూడి గ్రామంలో పర్యటించనున్నట్లు ఏలూరి క్యాంపు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

మండల సమాఖ్య నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం కోటేశ్వరరావు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి వెలుగు కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమాఖ్య నూతన కార్యావర్గాన్ని ఎన్నుకున్నట్లు ఏపీఎం కోటేశ్వరరావు తెలిపారు. అధ్యక్షురాలిగా షేక్ కరిమూన్, ఉపాధ్యక్షురాలిగా పచ్చవ భార్గవి, కార్యదర్శిగా రావూరి దేవి, సహాయ కార్యదర్శిగా కొప్పుల మాలతి, కోశాధికారిగా వెంగళశెట్టి అంజమ్మను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, గ్రామ సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



బోల్తాపడిన ట్రాక్టర్, ట్రాలీ

అద్దంకి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇసుక ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ ముట్లూరి సుబ్బయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి మండలం గోపాలపురానికి చెందిన ముట్లూరి సుబ్బయ్యకు సొంత ట్రాక్టర్ ఉంది. గురువారం మధ్యాహ్నం ఇసుక లోడుతో శంఖవరప్పాడు వైపు వెళ్తూ కలవకూరు చెరువు వద్ద మోటార్‌సైకిల్‌ను తప్పించే క్రమంలో షడన్ బ్రేక్ వేయడంతో చెరువు అంచున బోల్తా పడింది. గాయాలైన సుబ్బయ్యను 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్, ట్రాలీ చెరువు అంచున బోల్తాపడడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

హెల్పింగ్ హ్యాండ్స్ నూతన కమిటీ

మార్టూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులో హెల్పింగ్ హ్యాండ్స్ నూతన కమిటీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా పఠాన్ ఖాదర్‌వలి, ఉపాధ్యక్షుడిగా షేక్ బాషా, ప్రధాన కార్యదర్శిగా పుట్టా అయ్యప్పస్వామి, కార్యదర్శిగా షేక్ రహిమా, గౌరవ అధ్యక్షుడిగా కన్నెగంటి శ్రీనివాసరావు, ఆంజనేయులు, గౌరవ సలహాదారులుగా జె జయరావు, శ్రీరాం వెంకట్రామయ్యను ఎన్నుకున్నారు.



మజ్జిగను పంపిణీ చేస్తున్న డీఎస్పీ ఎండీ మొయిన్

ఎండల దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలి

చీరాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. వన్‌టౌన్ సీఐ సూరేపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఎస్పీ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వేసవి తాకిడి అధికంగా ఉందని, చిన్నారులు, వృద్ధుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్యలక్ష్మి, ట్రాఫిక్ ఎస్సై పవన్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కరెంట్ కట్

చీరాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం సరఫరాకు తాత్కాలిక అంతరాయం ఏర్పడుతున్నట్లు అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. జయంతిపేట, మరియమ్మపేట, ఐక్యనగర్, ఉజిలీపేట ప్రాంతాల్లో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వసతి గృహానికి మహర్దశ

» వైదన సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో మరమ్మతులు
» రూ.52లక్షల నిధులు విడుదల చేసిన మంత్రి గొట్టిపాటి
» హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



శిథిలావస్థలో ఉన్న వైదన సాంఘిక సంక్షేమ వసతి గృహం



విద్యార్థులు ఉండే గదులలో ఊడిన పైకప్పు

బల్లికురవ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థకు చేరిన వైదన బాలుర సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేసి తిరిగి విద్యార్థులకు ఉపయోగపడే మరమ్మతు పనులు చేయిస్తోంది. మండలం వైదనలో 1984లో ప్రభుత్వం సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేసింది. వంద మంది విద్యార్థులు ఉండేలా వసతి గృహాన్ని నిర్మించారు. గత కొంత కాలం నుంచి వసతి గృహం పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు వసతి గృహానికి రావాలంటే భయపడుతున్నారు. నాలుగేళ్ల నుంచి విద్యార్థుల సంఖ్య తగ్గింది. గత ఏడాది ఒక్క విద్యార్థి కూడా వసతి గృహంలో చేరకపోవడంతో వసతి గృహం పూర్తిగా మూత పడింది. విద్యార్థులకు రక్షణ లేదని ప్రమాదంగా గదులు ఉన్నాయని తల్లిదండ్రులు వసతి గృహానికి ఎవరిని చేర్చలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైదన గ్రామ యువనేత పోగుల శేఖర్ తదితరులు వసతి గృహం శిథిలావస్థకు చేరి మూత పడిందని మంత్రి రవికుమార్‌కు వివరించారు. వెంటనే మంత్రి రవికుమార్ వసతి గృహ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే పడి పోతున్న గదులను మర్మతులుచేసి పైకప్పు మరలా వేసేలా రూ.52లక్షల నిధులను మంజూరు చేయించారు. 15రోజుల నుంచి వైదన వసతి గృహంలో మరమ్మతు పనులు చకచకా సాగుతున్నాయి. బాగా దెబ్బతిన్న ఎనిమిది గదులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. జూన్‌లో విద్యార్థులతో వసతి గృహం మరలా వినియెగంలోకి తీసుకు వచ్చేలా పనులు చేపడుతున్నారు. అధికారులు కూడా ఇప్పటికే గ్రామాలలో విద్యార్థులను వసతి గృహంలో చేర్చేలా ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నారు. మూతపడి ఉన్న వసతి గృహాన్ని ప్రభుత్వం మరలా వినియెగంలోకి తీసుకు వచ్చే చర్యలు తీసుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులకు ఈ వసతి గృహం ఎంతో ఉపయోగమని వారు తెలిపారు.



పడిపోయే దశలో ఉన్న వాటిని పగులగొడుతున్న కార్మికులు



ఈవో తిమ్మానాయుడుకు విరాళం అందజేస్తున్న దాతలు

రాతి మండపానికి రూ.1,11,116 విరాళం

అద్దంకి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖమండపం నిర్మాణానికి పట్టణానికి చెందిన పూటుకూరు నాగయ్య, వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం కుమారుడు రామకోటేశ్వరరావు, మనవళుల నరేంద్ర, కృష్ణకిషోర్ రూ.1,11,116 గురువారం ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు.

రామాంజనేయపురంలో పోలీస్ పికెట్

రెండు కుటుంబాల మధ్య గొడవను రాజకీయ రంగు పులమడం సరైంది కాదు : సీఐ వెంకట్రావు

బల్లికురవ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాంజనేయపురంలో పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నట్లు సంతమాగులూరు సీఐ వెంకట్రావు తెలిపారు. రెండు కుటుంబాల మధ్య పిల్లల విషయంలో జరిగిన గొడవను రాజకీయ రంగు పులిమి రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఒక పత్రికలో అసత్యపు వార్తలు రాసి రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా చేశారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. రెండు కుటుంబాల ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

27న శిడి మహోత్సవం

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలోని గ్రామ దేవత శ్రీ జగజ్జనని గంగా భవానీ అమ్మవారి శిడి మహోత్సవం 27వ తేదీన జరుగుతుందని ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం ప్రకటనలో తెలిపారు. గంగా భవానీ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శిడి మహోత్సవాన్ని జరుగునుందని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

మార్టూరు పంచాయతీ అభివృద్ధికి కృషి

పబ్లిక్ టాయ్‌లెట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలూరి



పబ్లిక్ టాయ్‌లెట్ల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి కలిగిన మార్టూరు పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం మార్టూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ.20 లక్షల వ్యయంతో పెద అండరుపాస్ వద్ద నిర్మించిన పబ్లిక్ టాయ్‌లెట్లను ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. అలాగే గ్రామ పంచాయతీ వారు కొనుగోలు చేసిన చెత్తను తరలించే 10 మినీ రిక్షాలను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రాజధాని అమ రావతికి దగ్గరలో ఉన్న మార్టూరు పంచాయతీ భౌగోళిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రానున్న కాలంలో పూర్తి స్థాయిలో అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మార్టూరు చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు నిధుల మంజూరు, ఎఫర్ట్ సంస్థ సహకారంతో గ్రామంలో మొక్కల ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. జాతీయ రహదారిని విస్తరించే క్రమంలోనే 2015లో మార్టూరు సెంటర్‌లో భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని నాగరాజుపల్లి రోడ్, కొణిదెనరోడ్ వద్ద మినీ అండర్ పాస్, రాజుపాలెం కూడలి వద్ద పెద అండరుపాస్, జొన్నతాళి రోడ్డు వద్ద మినీ అండరుపాస్ మంజూరుకు కృషి చేశానన్నారు. జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కొళాయి నీటిని అందిస్తామ న్నారు. అనంతరం మార్టూరు సెంటర్లో ఆర్వో ప్లాంట్ నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించగా, సభావేదిక వద్ద ఉన్న శ్రీరాం రామయ్య గోవిందమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీరాం శేషగిరిరావు ఆర్‌వో ప్లాంటు ఏర్పాటుకు రూ.2లక్షల చెక్కును విరాళంగా ఎమ్మెల్యే ఏలూరికి అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్, ఏఈ బ్రహ్మయ్య, సర్పంచ్ భూక్యా సుమితా బాయి, షేక్ రజాక్, కామినేని జనార్దన్, ఆదినారాయణ, గుర్రం శ్రీను,బండి నాగేశ్వరరావు, జంపని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

బల్లికురవ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంపీడీవో కుసుమకుమారి, ఈవోపీఆర్డీ సుమతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు నగదు జమ

బల్లికురవ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులు చేసిన కూలీలకు కూలి డబ్బులు జమ అయినట్లు ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. మార్చి వరకు కూలీలకు రావాల్సిన నగదు మొత్తం కూలీలు బ్యాంకు అకౌంట్లకు ప్రభుత్వం జమ చేసిందని ఎంపీడీవో తెలిపారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీహర్ష

బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : బీపీ, షుగర్ ఉన్న వారు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని మోదేపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.శ్రీహర్ష అన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కలవకూరు గ్రామంలోని హెల్త్ సెంటర్‌లో ఎన్‌సీడీసీడీ సర్వేలో భాగంగా బీపీ, షుగర్ పరీక్షలను ఆయనతోపాటు సిబ్బంది చేశారు. గ్రామాల్లో సర్వే చేసి ఎన్‌సీడీసీడీ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాలరాజు, ఎంపీహెచ్‌ఈ నాగేశ్వరరావు, పీహెచ్ఎన్ కన్యాకుమారి, అబ్దుల్ సత్తార్, అశోక్ పాల్గొన్నారు.

భర్త మరణిస్తే భార్యకు పింఛన్

బల్లికురవ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పింఛన్ పొందుతున్న భర్త మృతి చెందిన వెంటనే భార్యకు పింఛన్ అందుతుందని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మూలస్థానేశ్వర ఆలయంలో నేడు ప్రదోషకాల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు జరుగుతాయని ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4.45 గంటలకు నందీశ్వరుడికి తదుపరి మూలస్థానేశ్వస్వామికి అభిషేకాలు, పూజలు జరుగుతాయని తెలిపారు. రాత్రి 7.45 గంటలకు చిన్న వెండి నంది వాహనంపై ప్రాకారోత్సవం జరుగుతుందని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

రాష్ట్ర సదస్సుకు పీఆర్ అధికారులు, జడ్పీటీసీలు

నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి) : జాతీయ పంచాయతీరాజ్ (పీఆర్) దినోత్సవం సందర్భంగా మంగళగిరిలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన రాష్ట్ర సదస్సుకు ఆ శాఖ జిల్లా అధికారులు, పలువురు జడ్పీటీసీలు హాజరయ్యారు. జడ్పీ సీఈవో విద్యారమ, డీపీవో శ్రీధర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, డ్వామా పీడీ గంగాభవాని, కోవూరు కోట జడ్పీటీసీలు శ్రీలత, దాసరి కోటయ్య, కోవూరు, నాయుడుపేట, ఆత్మకూరు, జలదంకి, వెంకటాచలం ఎంపీపీలు పార్వతి, ధనలక్ష్మి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకట రమణయ్య, మందా కవిత తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం | 25-4-2025 | పేజీలు: 8 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 25

శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం తిథి: ద్వాదశి ఉ.11.45 తదుపరి త్రయోదశి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.8.53 తదుపరి: ఉత్తరాభాద్ర, వర్జ్యం: సా.5.30-6.56, దుర్ముహూర్తం: ఉ.8.27-9.17, మ.12.38-1.28, అమృతఘడియలు: రా.2.08-3.34, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.56, సూర్యాస్తమయం: 6.30

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

Nellore | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కావలి కన్నీరొలికింది!

- మధుసూదన్‌రావు మృతదేహాన్ని చూసి చలించిపోయిన హృదయాలు
- కన్నీరుమున్నీరైన మృతుడి తల్లిదండ్రులు
- గుండెలవిసేలా రోదించిన బంధువులు
- డిప్యూటీ సీఎం పవన్ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల ఓదార్పు

'వృద్ధాప్యంలో మాకు తోడుంటావనుకున్నామే. భార్యాపిల్లలతోపాటు తోబుట్టువులకు ఆసరా నిలుస్తానుకుంటే ఇలా చేశావేంటిరా!. ఇక మాకు దిక్కెవరు దేవుడా!? కనీసం బిడ్డ ముఖం కూడా చూడనీయకుండా చేశావేంటి!? నీకేం పాపం చేశామయ్యా!?' అంటూ గుండెలవిసేలా రోదిస్తున్న ఆ వృద్ధ దంపతులను చూసి అందరి కళ్లు చెమర్చాయి.

'ఐ లవ్‌యూ నాన్న.. ఐ మిస్ యూ నాన్న' అంటూ తండ్రి మధుసూదన్‌రావు మృతదేహంపై పడి రోదిస్తున్న 13ఏళ్ల దత్తసాయిని ఓదార్చడం ఎవరితరం కాలేదు.

తమతో ఎప్పుడూ ఆప్యాయంగా, సంతోషంగా ఉండే వ్యక్తి ఇక లేడని తెలుసుకున్న బంధువులు, స్నేహితులు, సన్నిహితులు తరలిరావడంతో కావలిలోని ఆనాలవారివీధి కిక్కిరిసిపోయింది.

అటు బంధువర్గం, ఇటు ప్రజాప్రతినిధులు, అధికారుల నడుమ గురువారం సాయంత్రం మధుసూదన్‌రావు అంతిమయాత్ర అధికార లాంఛనాలతో పూర్తయ్యాయి.

కావలి రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన మధుసూదన్‌రావు మృతదేహాన్ని బుధవారం అర్ధరాత్రి ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో చెన్నైకు తరలించారు. అక్కడ నుంచి కావలి తహసీల్దారు శ్రావణ్ కుమార్, మృతుడి కుటుంబసభ్యులు మృతదేహాన్ని గురువారం ఉదయం కావలికి తీసుకువచ్చారు. అంబులెన్స్‌లో వచ్చిన మధుసూదన్‌రావు మృతదేహాన్ని సీఐలు ఫిరోజ్, గిరిబాబు, మృతుడి బంధువులు ఇంటికి తీసుకువెళ్లారు. మృతుడి తల్లిదండ్రులు సోమిశెట్టి తిరుపాల్, పద్మావతి హృద్రోగులు కావడంతో మొదట కుమారుడి మరణ వార్త తెలియకుండా జాగ్రత్తపడ్డారు. ప్రమాదంలో మధుసూదన్‌రావు కాలికి, తలకు గాయాలు అయ్యాయని, చెన్నైలో చికిత్స పొందుతున్నట్లు, పరిస్థితి విషమంగా ఉందని బంధువులు చెబుతూ వచ్చారు. గురువారం ఉదయం నిద్రలేచేసరికి కుమారుడి మృతదేహం ఇంటి ముందు కనిపించటంతో తిరుపాల్, పద్మావతిలు పుట్టెడు దుఃఖంతో తల్లడిల్లిపోయారు. బంధువుల సూచనల మేరకు ఇంటివద్ద ఓ అంబులెన్స్‌తోపాటు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. కాగా, ఉగ్రదాడిలో మధుసూదన్‌రావు తలభాగం మొత్తం ఛిద్రం కావటంతో ముఖం కనిపించకుండా ప్యాక్ చేసి ఉండటాన్ని చూసి తల్లిదండ్రులు, బంధువులతోపాటు స్థానికులు కడచూపు కూడా చూడలేక పోయామన్న రోదనలు మిన్నంటాయి.



మధుసూదన్ మృతదేహం వద్ద తల్లిదండ్రులు తిరుపాల్, పద్మావతి



మిస్ యూ నాన్న!

కళ్లెదుటే ఉగ్రమూకల దాడిలో భర్త మృతి చెందటాన్ని జీర్ణించుకోలేకపోయిన మధుసూదన్‌రావు భార్య ప్రసన్న కామాక్షి, కుమార్తె మేధశ్రీని ఓదార్చడం బంధువులకు కష్టంగా మారింది. ఇక కుమారుడు దత్తసాయి తండ్రి మృతదేహంపై పడి 'ఐ లవ్ యూ నాన్న... ఐ మిస్ యూ నాన్న' అంటూ మృతదేహంపై పడి ఏడవటం అందరినీ కంటతడి పెట్టించింది. ఎంత ఓదార్చినా పైకి లేవలేదు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూడా ఆ బాలుడ్ని ఓదార్చి ధైర్యం చెప్పారు.

అధికార లాంఛనాలతో..

ప్రభుత్వ ఆదేశాలతో సందర్శనార్థం మధుసూదన్‌రావు సాయంత్రం 4 గంటల వరకు ఇంటి వద్దనే ఉంచారు. ఆ తర్వాత రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌లు పాడె మోసుకుంటూ వెళ్లి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచారు. కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి, కలెక్టర్ ఆనంద్‌లు ముందు నడుస్తూ అంతిమ యాత్ర పట్టణ పురవీధులలో నుంచి బాలకృష్ణారెడ్డి శ్మశాన వాటిక వరకు సాగింది. అక్కడ అధికార లాంఛనాలతో చివరి ఘట్టం సాగింది. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపిన అనంతరం మధుసూదన్‌రావు మృతదేహాన్ని పూడ్చిపెట్టారు.



మిన్నంటిన రోదనలు

తల్లిదండ్రులతోపాటు తమను ఎంతో ఆప్యాయంగా కంటికి రెప్పలా చూసుకున్న అన్న ఇక లేడని తెలుసుకుని మధుసూదన్‌రావు తోబుట్టువులైన విజయలక్ష్మి, మంజుల గుండెలవిసేలా రోదించారు పసన్న కామాక్షి అమ్మ పసుపులేటి శ్యామలాదేవి, పిన్ని, బాబాయ్‌లు బుచ్చినాయుడు, లలితమ్మ కూడా భార్యా పిల్లల్ని ఒంటరిని చేసి వెళ్లావా అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.



మధుసూదన్‌రావు సమీప బంధువు కుమార్తె, కుమారుడు దత్తసాయిని గుండెకు హత్తుకుని ఓదార్చుతున్న పవన్‌కల్యాణ్



మధుసూదన్‌రావు పాడె మోస్తున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్

కన్నీరు పెట్టించిన కశ్మీర్ ఘటన

చలించిపోయిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

కావలి, కావలిరూరల్, (ఆంధ్రజ్యోతి) : మధుసూదన్‌రావుకు నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు కావలికి వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు మృతుడి భార్య, పిల్లలు కశ్మీర్‌లో జరిగిన ఘటనను తెలిపారు. ఇదంతా విని వారి చలించి పోయారు. ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, ఎమ్మెల్యేలు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకర్ల సురేష్, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తదితరులు విడివిడిగా, సమూహంగా మధుసూదన్‌రావు భార్య, పిల్లలతో మాట్లాడి, ఓదార్చరు. పవన్‌కల్యాణ్‌కు మధుసూదనరావు భార్య కామాక్షి ప్రసన్న జరిగిన ఘటనను వివరిస్తూ కన్నీరుమున్నీరయ్యింది. ఉగ్రవాదులు చాలా క్యాజువల్‌గా వచ్చి నరమేధం సృష్టించి వెళ్లారంటూ బోరుమంది. మృతుడి తల్లిదండ్రులతోపాటు బంధువులను ఓదార్చిన పవన్ ప్రభుత్వం తప్పక ఆదుకుంటుందంటూ భరోసా ఇచ్చారు.



సమతామూర్తీ.. నమోస్తుతే!



సమతామూర్తి, విశిష్ట అద్వైత సిద్ధాంతకర్త భగవద్రామానుజాచార్యుల 1008వ అవతార ఉత్సవాలు నెల్లూరులోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం తిరుమంజ నం, సాయంత్రం మంగళ శాసనోత్సవం, పేట ఉత్సవం జరిగాయి.

జూలైలో కొత్త పింఛన్ల మంజూరు?

- కసరత్తు ప్రారంభించిన అధికార యంత్రాంగం
- ఇప్పటికే 5వేల దరఖాస్తుల పెండింగ్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న పేదలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. జూలైలో కొత్త పింఛన్ల మంజూరుకు కసరత్తు ప్రారంభించింది. గత వైసీపీ హయాంలో వివిధ రకాల పింఛన్ల కోసం సుమారు ఐదు వేల మంది పేదలు దరఖాస్తు చేసి ఉన్నారు. రోజులు గుడుస్తున్నా పింఛన్లు మాత్రం మంజూరు కాలేదు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ల కోసం అర్హులు నిరీక్షిస్తుండగా, అనర్హులు అనేకమంది అప్పనంగా పింఛన్లు తీసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పార్టీల ముద్ర వేసి పలువురు అర్హులకు పింఛన్లు తొలగించి, అనర్హులకు మంజూరు చేయించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనర్హుల ఏరివేత ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్నా రద్దయిన వారికి పునరుద్ధరించాలని నిర్ణయించింది.

దివ్యాంగులకు పింఛన్లు

జిల్లాలో 29,409 మంది దివ్యాంగులు పెన్షన్లు పొందుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగుల కేటగిరీలో బోగస్ సదరం ధ్రువపత్రాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరుకు ముందే వాటిని పరిశీలించేందుకు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో సదరం శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పరిశీలన కార్యక్రమం వేగంగా జరుగుతోంది. ఈ పెన్షన్లతోపాటు బెడ్ రిడన్ పింఛన్లు పొందుతున్న వారు కూడా ఉన్నారు. తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలతో మంచానికే పరిమితమైన వారు జిల్లాలో 1274 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.15వేల పింఛను అందుతోంది. వీరిలో చాలామంది అనర్హులు ఉన్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. వైద్య ఆరోగ్య శాఖ నివేదిక ఆధారంగా త్వరలో అనర్హుల వివరాలు వెల్లడికానున్నాయి. వాస్త వంగా మంచానికే పరిమితమైన వారికి పింఛన్లు అందుతాయి. అనర్హులను పక్కన పెడతారు. అంతేగాక కొత్తవారికీ పింఛన్లు మంజూరు చేయనున్నారు. అలాగే, కుటుంబ యజమాని కోల్పోయిన మహిళలకు కేవలం 15రోజుల వ్యవధిలో పింఛను అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే 1,749 మందికి (స్పౌస్) ఆ పెన్షన్లు మంజూరై అందుతున్నాయి. జిల్లాలో కొత్త వారికీ పెన్షన్ల మంజూరుకు రంగం సిద్ధమవుతోంది.

స్పౌజ్ పింఛన్ల మంజూరుకు ఉత్తర్వులు

స్పౌజ్ పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 2023, డిసెంబరు 1 నుంచి 2024, అక్టోబరు 31వతేదీ వరకు పింఛను తీసుకుంటూ మరణించిన కుటుంబ యజమాని స్థానంలో వారి భార్యకు వితంతు పింఛను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు, ఎమ్పీడీవోల లాగిన్‌లో నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం ఆప్షన్ ఇచ్చిందని పేర్కొన్నారు.


'మీకు సబ్సిడీ లోన్ కావాలంటే మేము చెప్పాల్సిందే! కుల సంఘం నాయకులం కాబట్టి అధికారులు మా మాటే వింటారు. లోన్ ఇప్పించే బాధ్యత మాది. అయితే, మీకొచ్చే రుణంలో కొంత మాకు ఇవ్వాలి. ఈలోపు అడ్వాన్సుగా అందులో సగం డబ్బు ఇవ్వండి.'

అంటూ కొందరు దళారులు అమాయకులపై వల విసురుతున్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా అంతా పారదర్శకంగా రుణాల మంజూరు ప్రక్రియ చేపట్టినా కొందరు దళారులు ఎస్సీ కార్పొరేషన్‌కు వచ్చే అమాయకులకు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నారు. ఒక్కో లోన్‌కు రూ.30 వేలు చొప్పున బేరం కుదుర్చుకోగా, ముందుగా రూ.15 వేలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. గత నెలలో ఇదే మాదిరిగా బీసీ కార్పొరేషన్‌లో కూడా కొందరు దళారులు జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించగా అధికారులు బ్రేకులు వేశారు. ఇప్పుడు ఎస్సీ కార్పొరేషన్ వంతు వచ్చింది.

కమీషన్ ఇస్తే లోన్ ఇప్పిస్తాం!

- ఎస్సీ కార్పొరేషన్‌లో దళారుల దందా
- సబ్సిడీ రుణాలు ఇప్పిస్తామంటూ మోసం
- కుల సంఘాల ముసుగులో కొందరి దోపిడీ

సొంతకాళ్ల మీద నిలబడాలని ఆశించే వారికి సబ్సిడీ రుణాలు చాలా ఉపయోగకరంగా నిలుస్తాయి. ఇందులో 40 - 60 శాతం వరకూ సబ్సిడీ ఇస్తుండటంతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు పెట్టుబడికి ఇబ్బంది లేకుండా ఉంటోంది. గత వైసీపీ హయాంలోని ఐదేళ్లలో ఒక్క రుణం కూడా మంజూరు చేయలేదు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సబ్సిడీ రుణాల జాతర మొదలైంది. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్‌కు ప్రభుత్వం 1,240 యూనిట్లను మంజూరు చేసింది. ఇందుకు రూ.51.81 కోట్లతో అనుమతులు ఇచ్చింది. అందులో రూ.20.46 కోట్లను సబ్సిడీ కింద, మరో రూ.28.75 కోట్లను బ్యాంకు రుణంగా సమకూర్చనున్నారు. మిగిలిన ఐదు శాతం అంటే రూ.2.59 కోట్లను లబ్ధిదారులు చెల్లించాలి. రూ.3 లక్షలలోపు రుణాలు 226 ఉండగా వీటికి 60 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. అలానే రూ.3 లక్షల నుంచి 10 లక్షల వరకూ ఉన్న యూనిట్లు 628 ఉండగా వీటికి 40 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. ఇవిగాక ఆటోలు, ట్రక్కులు, కార్లు, ఇతర వాహనాలు కూడా మంజూరు చేస్తుండగా వీటికి 50 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. చాలా కాలం తర్వాత భారీ ఎత్తున రుణాలు మంజూరు కావడం, వాటికి సబ్సిడీ మొత్తం కూడా పెరగడంతో ఈ రుణాలు పొందేందుకు చాలా మంది దరఖాస్తులు చేసుకుంటున్నారు. వచ్చే నెల 10వ తేదీ వరకూ దరఖాస్తుకు గడువు ఉంది. ఈ క్రమంలోనే కొందరు దళారులు రంగ ప్రవేశం చేసి దరఖాస్తుదారులకు వల విసురుతున్నారు. నెల్లూరులోని అంబేడ్కర్ భవన్ వేదికగా కొందరు ఈ వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు తెలుస్తోంది. నాలుగు రోజుల క్రితం ఈ వ్యవహారంలో కొందరు దళారులు, దరఖాస్తుదారుల మధ్య పెద్ద గొడవే జరిగినట్లు సమాచారం.



బీసీ కార్పొరేషన్‌కు భారీగా దరఖాస్తులు

ఇటీవల బీసీ కార్పొరేషన్‌తోపాటు మరో తొమ్మిది కార్పొరేషన్‌లకు సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు స్వీకరించారు. బీసీ కార్పొరేషన్‌కు 1328 యూనిట్లు మంజూరు చేయగా వీటి కోసం 14973 మంది దరఖాస్తు చేసుకోవడం విశేషం. అలానే టైలరింగ్‌కు 4967 యూనిట్లు మంజూరవగా వీటికి 29097 దరఖాస్తులు అందాయి. మొత్తంగా పది కార్పొరేషన్లలో 7096 యూనిట్లకు 29097 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఒక యూనిట్‌కు నలుగురు చొప్పున దరఖాస్తున్నారన్నమాట. వీరిలో 1:2 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు ఎంపిక చేసి వారిలో అర్హులకు బ్యాంకు రుణాలు ఇప్పించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమై ఉంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

గణితమే గండి కొట్టింది!

- 'పది'లో ఎక్కువమందికి లెక్కలే తప్పాయి
- జిల్లాలో మ్యాథ్స్‌లో 3,439 మంది ఫెయిల్
- ఆ తరువాత స్థానం సైన్సుది!
- పేపర్ వ్యాల్యుయేషన్‌పై అనుమానాలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులు పలువురికి గణితం గండి కొట్టింది. జిల్లావ్యాప్తంగా ఎక్కువమంది పదిలో లెక్కల్లోనే తప్పారు. ఫెయిల్ అయిన విద్యార్థుల్లో అత్యధికంగా మ్యాథ్స్‌లో 3,439 మంది ఉన్నారు. వీరు అన్ని సబ్జెక్టులలో 60, 70, 80 శాతం మార్కులు పొందగా, ఒక్క మ్యాథమ్యాటిక్స్‌లోనే ఫెయిల్ అయ్యారు. రెండోస్థానంలో సైన్సు ఫెయిల్ అయినవారు ఉన్నారు.

వ్యాల్యుయేషన్‌పై అనుమానాలు

జిల్లాలో ఈ ఏడాది పదోతరగతిలో మొత్తం 9,045 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వీరిలో అత్యధికంగా గణితంలో 3439 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. తెలుగులో 1061 మంది, హిందీలో 122 మంది, ఇంగ్లి‌ష్‌లో 704, సైన్స్‌లో 2555, సోషల్‌లో 1164 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేకపోయారు. తాము పరీక్ష బాగానే రాసామని, తప్పక పాస్ అవుతామని చెప్పిన విద్యార్థుల్లో అత్యధిక మంది ఒక్క గణితంలో మాత్రమే తప్పడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. తమ విద్యార్థుల్లో అత్యధికశాతంమంది అన్ని సబ్జెక్టులలో ఉత్తమ మార్కులు సాధించారని, ఒక్క గణితంలో మాత్రమే ఫెయిల్ కావడం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. జవాబుపత్రాల మూల్యాంకనం హడావుడిగా చేపట్టడం, వేగవంతంగా పూర్తి చేయాలన్న ఆలోచనలతో గణితం పత్రాలను అసలు మ్యాథ్స్ టీచర్లతో దిద్దించారా ? లేక ఇతరులతో చేయించారా ? అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. దీని పరిష్కారం దిశగా పాఠశాల విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయులు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు.

రీవెరిఫికేషన్‌కు రెడీ....

గణితం సబ్జెక్టుకు సంబంధించి ప్రశ్నపత్రంలో కూడా కొన్ని లోపాలున్నా వాటిని అధిగమించి విద్యార్థులు పరీక్షలు రాశారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఫలితాలకు ముందు వచ్చిన కీ పరిశీలించుకున్న నేపథ్యంలో సైతం వారు తమకు వచ్చే మార్కులను ముందుగానే బేరీజు వేసుకుని తమతో చర్చించారని అంటున్నారు. అయితే ఫలితాలు విడుదలైన తరువాత అన్ని సబ్జెక్టులలో మంచి మార్కులు వచ్చినా విద్యార్థులకు సైతం ఒక్క మ్యాథ్స్‌లో వారు ఊహించిన మార్కులు కాకుండా ఫెయిల్ మార్కులు రావడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరువాత స్థానం సైన్సుదే..

అలాగే కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఒక్క సైన్స్ మాత్రమే ఫెయిల్ కావడంపై కూడా జిల్లాలో ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. తమ బిడ్డలకు కలిగిన నష్టాన్ని విద్యాశాఖ అధికారులు కూడా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. రీవెరిఫికేషన్ అనే అస్త్రాన్ని సంధించేందుకు సమాయత్తమవుతున్నారు. అన్ని పేపర్లలో సగటున 60శాతం మార్కులు పొంది ఒక్క సబ్జెక్ట్ ఫెయిల్ అయితే ఆ సబ్జెక్టుకు రీవాల్యుయేషన్ చేస్తే తమ బిడ్డలకు న్యాయం జరుగుతుందని అంటున్నారు.

వేసవిలో చిన్నారులు జాగ్రత్త

- సీడబ్ల్యూసీ చైర్మన్ మాధవి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఎండలు తీవ్రంగా ఉన్నాయి, పిల్లలకు వేసవి సెలవులు ఇచ్చారు, ఈ తరుణంలో చిన్నారుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సీడబ్ల్యూసీ చైర్మన్ మాధవి పిలుపునిచ్చారు. గురువారం కొండాయపాలెంలో అబైడింగ్ ట్రస్ట్ కార్యాలయంలో బాలలకు పౌష్టికాహారం పంపిణీ జరిగింది. ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులపై లైంగిక వేధింపులు జరిగితే 1098 నెంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అబైడింగ్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ టైటాస్ నిర్మల్‌కుమార్, జయప్రకాష్, సిస్టర్ రమ, ఫాదర్ లివింగ్‌స్టన్, కాంత్రికుమార్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	198
స్కిన్‌లెస్	218
కోడిగుడ్ల ధర (100): 420	

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

లింగసముద్రం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని కందుకూరు డీఎల్‌పీవో కృష్ణమోహన్ చెప్పారు.గురువారం ఆయన ఎంపీడీవో కట్టా శ్రీనివాసులుతో కలిసి మండలంలోని చినపవని, పెదపవని గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లోని తడిపొడి చెత్తను క్లాప్‌మిత్రల ద్వారా చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు.దీనివల్ల గ్రామాల్లో దోమల వ్యాప్తి తగ్గి వ్యాధులు రావన్నారు. గ్రామాలు కూడా చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంటాయని చెప్పారు. ఈ కేంద్రాల్లో తయారయ్యే వర్మీ కంపోస్టు ఎరువును రైతులకు విక్రయించాలన్నారు.ఈ సందర్భంగా కృష్ణమోహన్ ఎంపీడీవో శ్రీనివాసులుకు, పంచాయతీ కార్యదర్శి షేక్ రవీద్‌బాషాకు పలు సూచనలు చేశారు. నిరుపయోగ కేంద్రాలను వినియోగంలోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గ్రామీణులకు వెసులుబాటు

● ఏపీవో ఎన్ఆర్ అబ్బుల్లా, ఉలవపాడు



ఉలవపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు గ్రామీణులకు కొంత ఆర్థిక బలం చేకూర్చేలా ఉన్నాయి.దీంతో రోజువారి కూలీలు పెరిగారు. మండలంలో సుమారు 10,000 జాబ్ కార్డుదారులు ఉన్నారు. రోజుకి సుమారు 3700 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు.

?: ఉపాధి పనులకు స్పందన ఎలా ఉంది.

!: రోజువారీ ఉపాధి కూలి రేటు పెరగడంతో మండలంలోని అన్ని గ్రామాల నుంచి పనుల సంఖ్యలో కొత్త జాబ్ కార్డులకు దరఖాస్తులు వస్తున్నాయి.

?: ఎండలకు కూలీలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

!: కూలీలు ఉదయం 6 గంటలకే పని ప్రాంతానికి చేరుకుంటారు. మస్టర్లు, ఫొటో క్యాప్చర్ అనంతరం తిరిగి 10 గంటలకు వెళ్లిపోతారు. వారు నీడ తీసుకునేందుకు టార్పాలిన్ పట్టలతో షెల్టర్ ఏర్పాటు, మంచినీళ్ల క్యాన్లు, పనిచేసే సమయంలో డీహైడ్రేషన్ కాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కోసం ఫస్ట్‌ఎయిడ్ బాక్సు ఏర్పాటు చేస్తున్నాం.

?: జాబ్‌కార్డులకు దళారులు డబ్బులు వసూళ్లు చేస్తున్నారా..

!: నూతనంగా జాబ్‌కార్డులు కావాల్సిన వాళ్లు నేరుగా తమ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చు. మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన పనిలేదు.

ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన మధుసూదనరావుకు నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు గురువారం కావలికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నాదెండ్ల మనోహర్, ఆనం, సత్యకుమార్, ఎమ్మెల్యేలు, అధికారులు వచ్చారు. మధుసూదనరావు భార్య పిల్లలు కశ్మీర్‌లో జరిగిన దాడుల సంఘటనలు తెలిపి కన్నీరుమున్నీరుగా విలపించారు. మధుసూదనరావు బాధాప్తిలను, ఇతర కుటుంబసభ్యులను వారు ఓదార్చారు. పవన్ కల్యాణ్‌కు మధుసూదనరావు భార్య కామాక్షి జరిగిన సంఘటనలు చెప్పుకుని బోరున విలపించారు. పవన్‌ను చూసేందుకు అభిమానులు కావాలిపై ఎగబడ్డారు.

- కావలి, (ఆంధ్రజ్యోతి)





విలపిస్తున్న మధుసూదన్ కుటుంబ సభ్యురాలు, ఓదార్చుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్



ప్రజలకు పవన్ అభివాదం



మధుసూదన్‌రావు కుటుంబసభ్యులతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



మధుసూదన్‌రావు మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రులు ఆనం, సత్యకుమార్, ఎమ్మెల్యే సోమిరెడ్డి

టీడీపీ కుటుంబాలకు అండగా ఉంటాం..

కలిగిరి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ కుటుంబాలకు తాము అండగా ఉంటామని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకటరామారావు,ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. వారిద్దరూ కలిగిరి గురువారం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బొల్లినేని స్వగ్రామమైన పెద్దపాడులో మాజీ సర్పంచి చావా బ్రహ్మానందనాయుడు తండ్రి కొండపనాయుడు మంగళవారం మృతి చెందారు.దీంతో చిన్నకర్మ హాజరై నివాళులు అర్పించారు. అనంతరం కావలిముస్తాపురంలో విద్యుత్‌షాక్‌తో చనిపోయిన సంజీవి చెంచునాయుడు దశదినకర్మకు, సిద్ధనకొండూరులో సీనియర్ నాయకుడు గంగినేని రంగారావు పినతల్లి అన్నపూర్ణమ్మ దశదినకర్మకు హాజరై నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఆయా గ్రామాల్లో వీరిని పార్టీ సీనియర్ నాయకులు, పలువురు కార్యకర్తలు కలసి గ్రామ సమస్యలు, వర్తమాన రాజకీయాలపైనా చర్చించారు.



మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని, మేకపాటిలతో మాట్లాడుతున్న పెద్దపాడు గ్రామ టీడీపీ నాయకులు

సాంకేతికతతో టీడీపీని ముందుకు నడిపించండి

జలదంకి, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీని ముందుకు తీసుకుపోవడంలో సాంకేతికతను జోడించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డితో కలిసి గురువారం ఎమ్మెల్యే మండలంలోని తిమ్మసముద్రంలో నిర్వహించిన గ్రామకమిటీ సమావేశంలో పాల్గొని పార్టీ నాయకులు, క్రియాశీల సభ్యులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎన్డీఏకూటమి ప్రభుత్వం కేంద్రంలో, రాష్ట్రంలో చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివిధ రూపాలోనూ, సోషల్‌మీడియా ద్వారాను ప్రజల చెంతకు తీసుకువెళ్లాలన్నారు. మాజీ ఎమ్మెల్యే వంటేరు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నిత్యం నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తీరుస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు టీ. మధుసూదనరావు, పీ.మధుమోహన్‌రెడ్డి, కంచర్ల వినోద్‌నాయుడు, పూనూరు బాస్కర్‌రెడ్డి, మునగాల తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిమ్మసముద్రం సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి

ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం





అల్లూరు, కొండాపురం ఎంపీడీవో కార్యాలయాల్లో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎంపీడీవో, అధికారులు, సిబ్బంది

అల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రజినీకాంత్, డిప్యూటీ ఎంపీడీవో పెంచల వీరేంద్ర గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరిపాల నాధికారి పీ.వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● సమన్వయంతోనే పంచాయతీల అభివృద్ధి

పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే అధికారులు, ప్రజలు సమన్వయంగా కృషి చేస్తేనే సాధ్యపడుతుందని ఎంపీడీవో రజినీకాంత్ తెలిపారు. మండలంలోని పురిణిలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పెంచల వీరేంద్ర, ఉపసర్పంచి తాండ్ర శ్రీనివాసులు, వార్డు సభ్యులు, వైద్య ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం, (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం మండలపరిషత్ కార్యాలయంలో అధికారులు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఆదినారాయణ గాంధీ, అంబేడ్కర్, చిత్రపటాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ, ఎంఈవో-2 ఆనందరావు, ఏవో శేషారావు, ఎమ్‌పీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో తండ్రికి నివాళి

కందుకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండముడుసుపాలేనికి చెందిన తలమంచి వంశీ తనతండ్రి శ్రీనుప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళిగా గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్‌ వద్ద రక్తదానం చేశారు. వర్ధంతి అంటే ఏదో కార్యక్రమాలు చేపట్టడం కాకుండా ఇలా రక్తదానం చేయటం ద్వారా యువతకు ఆదర్శంగా నిలవటం పట్ల బ్లడ్‌బ్యాంక్ డాక్టరు పాజ్జిన్, కందుకూరు రెడ్‌క్రాస్ ఛైర్మన్ చెన్నా రామాంజనేయులు వంశీని అభినందించారు.



రక్తదానం చేస్తున్న తలమంచి వంశీ

ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన



ఉగ్రదాడిని ఖండిస్తూ అల్లూరులో నిర్వహించిన నిరసన ర్యాలీ

అల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడులను ఖండిస్తూ అల్లూరులో నిరసనలు వెల్లువెత్తాయి. గురువారం సాయంత్రం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పొతకమ్మండ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎల్లు సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో దీపాలు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆలయం కోటిక సెంటరు వద్ద భారీగా నిరసన ర్యాలీ చేపట్టారు. పాతబస్టాండు కూడలి వద్ద దీపాలతో నిరసన తెలిపారు. మృతులకు వారు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేయటం హేయమైన చర్య అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సమాజంలో సామరస్యం పట్ల ఇలా అమానుషంగా ప్రవర్తించటం దారుణమని, ఆటువంటివారిని సమూలంగా నిర్మూలించాలని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మరో ప్రకటనలో ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. పర్యాటకులపై ఉగ్రవాదుల కాల్పులు జరపడం ఆటవిక చర్య అని ఆమ్ ఆద్మీపార్టీ జోనల్ కోఆర్డినేటర్ నేతి మహేశ్వరావు ఒక ప్రకటనలో ఖండించారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

కందుకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28న టీఆర్ఆర్ ప్రాంగణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. జాబ్‌మేళాకు హాజరుకాదలచిన యువకులు ఏపీ ప్రభుత్వ నైపుణ్య వెబ్‌సైట్‌లో తమ పేర్లు ముందుగా నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

క్యాన్సర్ రోగుల కోసం జుట్టు దానం

కందుకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బృందావనానికి చెందిన పీ తరుణ్ క్యాన్సర్ రోగుల కోసం తన జుట్టును దానం చేశారు. మూడేళ్లపాటు పెంచిన తన జుట్టును హైదరాబాద్‌లోని హెయిర్ డొనేషన్ సంస్థ ద్వారా దానం చేశారు. క్యాన్సర్ చికిత్సలో జుట్టు కోల్పోయే పేషెంట్లకి ఈ జుట్టుతో విగ్గులు తయారుచేసి అందిస్తారని, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు తనవంతుగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.



జువ్వలదిన్నెలో మాక్‌డ్రిల్

బిట్రగుంట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నెలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ నిబంధన తహసీల్దార్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీవో వంశీ నాన్యనతో కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏపీ ఎస్‌డీఆర్‌ఎం శాఖ సిబ్బంది తుఫాన్, వరదలు వంటివి సంభవించినప్పుడు ఎలాంటి సహాయక చర్యలు చేపడతామో వాటిని వివరిస్తూ పరికరాలతో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కావలి డీఈ జెనర్ది, ఏడీఈ రవికుమార్, ఏఈ జదరయ్, ఎడీవో శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎస్సై బొజ్జ, మెరైన్ ఎస్సై కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు చేపట్టాల్సినసహాయక చర్యలను వివరిస్తున్న ఏపీ ఎస్‌డీఆర్‌ఎం సిబ్బంది

ఈత కోసం మహిళలకు ప్రత్యేక సమయం

మున్సిపల్ కమిషనర్ అనూష

కందుకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉప్పుచెరువు వద్ద మున్సిపాలిటీ నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌లో మహిళల కోసం ఈనెల 28 నుంచి ప్రత్యేక సమయం కేటాయించామని మున్సిపల్ కమిషనర్ కే. అనూష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.మాస్టర్ ట్రైనర్ పర్యవేక్షణలో మహిళలు, బాలికలకు ఈత నేర్పించే ఏర్పాటుకూడా చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం అరున్నర నుంచి 8 గంటల వరకు మహిళల కోసమే కేటాయించామని, నేషనల్ లెవల్ స్విమ్మర్ దాసరి లక్ష్మీదుర్గ ఈ సమయంలో అందుబాటులో ఉండి ఈత నేర్పిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు మున్సిపల్ కార్యాలయంలో కానీ, స్విమ్మింగ్ పూల్ వద్దకానీ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు ఉపయోగం

అల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు రెండు విధాలా ఉపయోగమని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కొత్తపాలెంలో గురువారం రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ముందుగా భూసార పరీక్షల నిమిత్తం అవసరమైన మట్టి నమూనాలను తీసుకున్న అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కలిగి ఉండాలని, మట్టి నమూనాల పరీక్షలతో భూసారం పెరుగుతుందని, దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి స్వాతి, పంచాయతీ కార్యదర్శి సిరిశ్వరి, నాయకులు ఎన్. శ్రీనివాసులు, ఎం. సురేంద్ర, హరీష్ పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెరటితోటను పెంచుకోవాలి



కిచెన్ గార్డెన్‌పై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎవో సుమాంజలి

దగదర్తి (బిట్రగుంట), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పెరటిలో కూరగాయలు, ఆకుకూరలను పెంచుకుంటే ఆరోగ్యకర ఆహారాన్ని తీసుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ స్టేట్ అధికారిని సుమాంజలి అన్నారు. దగదర్తి మండలం వలిసేన్నపేటలో గురువారం టీం లీడర్ హరిచందన ఆధ్వర్యంలో గురువారం కాయగూరల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా పెరటితోటలు వాటి వలన వచ్చే లాభాలు, కల్తీ లేని ఆహారం తినడమే కాకుండా వ్యాపారం చేసుకునే విధానాని స్టేట్ అధికారి వివరించారు.



రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

లింగసముద్రం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షెడ్యూల్ కులాలకు చెందిన వారు ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ మంజూరు చేసే రుణాలకు మే 13 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు వయోపరిమితి 21 నుంచి 50 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఆధార్‌కార్డు, కులం, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఫొటో, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నంబరుతో సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ ద్వారా అందలేని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

కందుకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు 1973-74 బ్యాచ్ పదవతరగతి విద్యార్థులు గురువారం కార్డ్‌లెస్ మైక్, యాంప్లిఫైర్ బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ మైక్‌సెట్‌ను పాఠశాలకు అందించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావటం అభినందనీయమన్నారు. వీళ్ల మాదిరిగానే మరికొందరు ముందుకు వస్తే పాఠశాల ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మందిరాజు మురళీ, దొనపలి రమేష్, ఎస్సై సంధానీబాషా, అల్లలి ఉమామహేశ్వరరావు, ముచ్చెలి ఉమామహేశ్వరరావు, బొమ్మిశెట్టి కోటేశ్వరరావు, గోనుగుంట సుబ్రహ్మణ్యం, ఉరిమి వెంకటసుబ్బారావు, ఏకాంబరం సత్యనారాయణ, ఉపాధ్యాయులు రమణయ్య, పెరుగు ప్రసాద్, గుమ్మడి వెంకటేశ్వరరావు, శ్రీనిధి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్


అమ్మవారి చీరల వేలం

అల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరు పేటలో వెలసి ఉన్న పోలేరమ్మ ఆలయంలో గురువారం అమ్మవారి చీరలను వేలం వేశారు. ఆలయ ఈవో బిట్టి బాబు, పాలక మండలి సభ్యుల సమక్షంలో ఈ వేలం నిర్వహించారు. అమ్మవారి చీరలను దక్కించుకునేందుకు పలువురు పోటీ పడ్డారు. ఈ వేలంలో మొత్తం రూ.47,850 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.

సెల్‌టవర్ల ఏర్పాటుకు స్థల పరిశీలన

కొండాపురం, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్‌ను వినియోగదారులకు చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంటున్నదని టెలికాం అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ తాటికొండ అనూష తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో 20 సెల్ టవర్లు ఏర్పాటుకు కేంద్రం అనుమతించిందన్నారు. తహసీల్దార్ కోటేశ్వరావు సూచనమేరకు మండలంలో శెట్టిపాలెం, వెలిగండ్ల, మర్రిగుంట గ్రామాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు ఆమె అధికారులతో కలిసి స్థలపరిశీలన చేశారు. ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సహకారంతో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వీఆర్‌వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కావలిటౌన్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం వెంగళరావునగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సయ్యద్ మనీబాషా, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, చేపూరు ప్రభయ్య, విజయ్ దేవరకొండ, జాగో సేవాసంస్థ అధ్యక్షుడు షేక్ జమీర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మండల సమైక్య సమావేశం

కొండాపురం, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొదుపు గ్రూపులకు సంబంధించి మండల సమైక్య సమావేశం గురువారం కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఏపీఎం కొతాల్ రావు మాట్లాడుతూ పొదుపు గ్రూపులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మీపై గ్రామాల్లో సభ్యులకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో విజయమారు సీసీఈవో పద్మజకుమారి, ఏరియా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, జీ.సౌరిం, ఎస్ డీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

కావలి రూరల్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సూరిశెట్టి రమేష్(37) అనారోగ్యంతో చెన్నై ఎంజీఎం వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మృతునికి భార్య పిల్లలున్నారు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇష్టానుసారం స్తంభాల ఏర్పాటు

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన ఏర్పాటు చేస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.గ్రామంలో ప్రస్తుతం ఉన్న స్తంభాలు ఏళ్ల క్రితం ఏర్పాటు చేసినవి.పాత స్థానంలో వారం నుంచి కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నారు. అయితే కొన్ని స్తంభాలు పాతవాటి పక్కన కాకుండా ఆర్అండ్‌బీ రోడ్డుకు దగ్గరగా ఏర్పాటు చేస్తున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు.

సన్ స్ట్రోక్ !





మూలపేట రామయ్యబడి రోడ్డు

బోసిపోయిన నీలగిరి సంఘం కూడలి



నగరంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో నిర్మానుష్యంగా రహదారి



సూరీడు సుర్రుమంటున్నాడు. ఎండవేడిమి భరించలేక వృద్ధులు, పిల్లలు అల్లాడుతున్నారు. ఇక రోజువారి పనుల కోసం ఇళ్లలో నుంచి బయటకు వచ్చేవారు వడగాలులకు బెంబేలెత్తిపోతున్నారు. ఎన్ని శీతలపానీయాలు తాగినా దాహం తీరకపోవడంతో అల్లాడుతున్నారు. దీంతో పనులకు వెళ్లేందుకు కూడా సాహసం చేయలేక ఇళ్లలోనే ఉండిపోతున్నారు. ఎంత తీవ్రత నేపథ్యంలో రహదారులు, ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)



పెరిగిన ధరలతో నత్తనడకన జరుగుతున్న ఇంటి నిర్మాణం

ఇళ్లు కట్టేదెలా.. ?

- నింగినంటుతున్న నిర్మాణ సామగ్రి ధరలు
- నిర్మాణదారులపై భారం

సంగం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగానికి ఎంతో అవసరమైన సిమెంట్, ఐరన్ ధరలు నింగినంటుతు ఒడడంతో ఇళ్ల నిర్మాణాలు ఎలా చేపట్టాలా అని నిర్మాణదారులు మదనపడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బస్తా సిమెంట్ రూ. 350, టన్ను ఐరన్ రూ. 54 వేల నుంచి 55 వేలు పలుకుతోంది. జిల్లాలో ప్రస్తుతం పల్లె పండుగ పథకంలో సిమెంట్ రహదారులు, డ్రైనేజి కాలువల నిర్మాణంతోపాటు వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అదేవిధంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజనతోపాటు, వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిన పేదల ఇళ్లు పూర్తిచేయడానికి కూటమి ప్రభుత్వం అదనపుసాయం ప్రకటించింది. ఇసుక మాత్రం ఉచితంగా లభిస్తుంది. ఇసుక లభ్యత ఉన్నా, సిమెంట్, స్టీల్ ధరలు పెరగడంతో నిర్మాణదారులపై భారం పడింది. ప్రభుత్వ కాలనీ లబ్ధిదారులు సైతం ముందుకు రావడంలేదు. కాగా, జూన్ 12వ తేదీ నాటికి ఎన్టీఆర్ గృహ నిర్మాణాలు పూర్తిచేసి రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా ఆశించిన స్థాయిలో నిర్మాణాలు జరగడం లేదు. దీంతో గృహ నిర్మాణశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

సోమశిల నీటిమట్టం 51.438 టీఎంసీలు

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి 51.438 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

మలేరియాతో తస్మాత్ జాగ్రత్త

- దోమల వల్ల ప్రబలే ప్రాణాంతక వ్యాధి
- జిల్లాలో తగ్గుముఖం
- అయినా అప్రమత్తత అవసరం
- దోమల నివారణతోనే సాధ్యం
- ప్రైవేట్‌లో ఆసుపత్రుల్లో ఎక్కువగా కేసులు
- నేడు ప్రపంచ మలేరియా నివారణ దినం

జిల్లాలో పల్లెలతో పోల్చితే పట్టణ ప్రాంతాల్లో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. నెల్లూరు, కావలి, ఆత్మ కూరు, కందుకూరు తదితర పట్టణాల్లో పూర్తి స్థాయిలో దోమల నివారణ జరగక పోవడంతో దోమల విజృం భణ కారణంగా వ్యాధి గ్రస్తులు నమోదవు తున్నాయి. అదేవిధంగా అటవీ ప్రాంతాలకు సమీపాన ఉండే సీతారామపురం, మర్రిపాడు, దుత్తలూరు, ఉదయగిరి, రాపూరు తదితర మండలా ల్లోనూ మలేరియా కేసులు నమోద వుతున్నారు. పల్లెల్లో నూ పారిశుధ్యలేమితో దోమలు బెడద ఎక్కువగానే ఉంటోంది. దోమల నివారణ కోసం నిర్దేశించిన ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం కూడా మొక్కుబడిగా మారింది.

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : దోమల వల్ల సోకే ప్రాణాంతక వ్యాధుల్లో మలేరియా ఒకటి. ఒకప్పుడు ఈ వ్యాధిసోకితే ప్రాణాలు కాపాడు కోవటం కష్టమ య్యేది. కానీ, ప్రస్తుతం ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి రావడంతో అవసరమైన చికిత్సలు అందుతున్నాయి. అయినా నేటి సమా జంలో అన్నీ ప్రాంతాల్లో దోమలు దండయాత్ర చేస్తుండటంతో మలేరియా వ్యాధిని అలక్ష్యం చేయకుండా అప్రమ త్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం కేవలం ఒక్క మలేరియా కేసు మాత్రమే నమోదయింది. అయితే ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రం వీటి ఇప్పటి వరకు 75 కేసులు ఉన్నట్లు సమాచారం. 1898లో సర్ రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త భారతదేశంలో పరిశోధనలు చేసి మలేరియా వ్యాధిని నిర్ధారించారు. ఇందుకుగాను 1902లో ఆయనకు నోబెల్ బహుమతి లభించింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 25వ తేదీని మలేరియా నివారణ దినంగా జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.



మలేరియా అంతం మనతోనే అన్ననినాదాన్నిచ్చింది.

ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ఉండాలి : డీఎంహెచ్‌వో



మలేరియా నివారణ పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, అధికారులు

జిల్లాలోని ప్రతీ ఒక్కరు మలేరియా వ్యాధి విషయంలో జాగ్రత్తగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత సూచించారు. ఆమె కార్యాల యంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. అనుమానిత మలేరియా బాధితులు దగ్గరలోని పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకుని వ్యాధినిర్ధారణ అయితే చికిత్సలు పొందాలన్నారు. చిన్న పిల్లలు, గర్భిణులకు ఈ వ్యాధి మరింత ప్రమాదకరమని చెప్పారు. ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని వెల్లడించారు. మలేరియా నివారణ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఎం హెచ్‌వో డాక్టర్ ఖాదర్ వలి, మలేరియా నివా రణ అధికారి హుస్సే నమ్మ, నోడల్ అధికారి డాక్టర్ దయాకర్, డెమో కనకరత్నం, ఏఎంవో నాగార్జున రావు తదితరులు పాల్గొన్నారు.





ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని ఒలకబోయిస్తున్న అధికారులు (ఫైల్)

ముందస్తు జాగ్రత్తలు ఇలా..

- లార్వా దశలోనే దోమల నివారణకు చర్యలు చేపట్టాలి
- మలాథియాన్, సింథటిక్ పైరత్రాయిడ్, డీడీటీ వంటి దోమల మందును మురికి గుంతల్లో పిచికారీ చేయాలి.
- ఫాగింగ్ మిషన్ల ద్వారా దోమల నివారణకు పొగ పెట్టాలి.
- ఇంటిలోపల, బయట నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- దోమతెరలు వాడాలి. ఇంటి కిటికీలు, తలుపులకు మెష్‌లు బిగించుకోవాలి.
- తాగి వదిలేసిన కొబ్బరి బోండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు, పనికిరాని వస్తువులలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- ఎయిర్‌కూలర్లు, ఫ్లవర్‌వాజ్, పూలకుండీలలో నీటిని తరచూ మార్చాలి.

మలేరియా వ్యాధిగ్రస్తుల గణాంకాలు

సంవత్సరం	వైద్యశాఖ నిర్ధారణ	ప్రైవేటు ఆసుపత్రి
2021	12	226
2022	3	205
2023	1	141
2024	6	120
2025	1	75

(ఇప్పటి వరకు)

నివారణ చర్యలు తీసుకుంటున్నాం

జిల్లాలో మలేరియా నివారణ చర్యలు తీసుకుంటున్నాం. నాలుగు రకాల ప్లాస్మోడియం క్రిముల ద్వారా మలేరియా వ్యాధి సోకుతుంది. దోమల కుట్టకుండా ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే కాలువలు, చెరువుల్లో దోమల నిర్మూలనకు గంబూజియా చేపలను వదలటం జరిగిం ది. సమస్యాత్మక 209 గుంతలను గుర్తించి అక్కడ దోమల నివారణకు చర్యలు చేపడుతున్నాం. ఫాగింగ్ మిషన్‌లు కూడా పంపిణీ చేశాం. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల నివారణ చర్యలు చేపడుతున్నాం. మలేరియా దినోత్సవం సందర్భంగా అన్నీ పీహెచ్‌సీలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- హుస్సేనమ్మ (జిల్లా మలేరియా నివారణ అధికారి)

రేపు దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉన్న క్రికెట్ ప్రాంగణంలో శనివారం దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా దివ్యాంగుల క్రికెట్ సంఘం కార్యదర్శి పీ మనోహర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ సంఘం సహకారంతో జరిగే ఈ ఎంపికలకు ఫిజికల్ డిజేబిలిటీ, బ్లైండ్, వీల్‌చెయిర్, డెఫ్ కేటగిరీల్లోని క్రీడాకారులు హాజరు కావచ్చని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన సదరం సర్టిఫికెట్‌తో పాటు వైట్ డ్రెస్ కోడ్, క్రికెట్ కిట్‌తో సంబంధిత తేదీ ఉదయం 9 గంటల్లోపు హాజరు కావాలని సూచించారు. జిల్లాకు ఎంపికైన క్రీడాకారులు జిల్లా పోటీలతోపాటు, రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

గంజాయి విక్రయ ముఠా అరెస్ట్

- ఐదు కేజీల సరుకు స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం నుం చి తక్కువ ధరకు గంజాయిని తీసుకు వచ్చి నెల్లూరు నగరంలోని కొందరు వ్యక్తులకు విక్రయిస్తున్న ముఠాను సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను సంతపేట స్టేషన్‌లో నగర డీఎస్పీ పీ సింధు ప్రియ గురువారం వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం బరంపూర్‌కు చెందిన రంజిత్ నాయక్ కొన్నేళ్ల క్రితం ఉపాధి ని మిత్తం నెల్లూరు రూరల్ మండలం కొత్తకాలువ ప్రాంతానికి వచ్చాడు. చెడు వ్యసనాలకు బానిసైన రంజిత్ సులభంగా డబ్బు సంపాదించడం కోసం గంజాయి విక్రయాన్ని మార్గంగా ఎంచుకు న్నాడు. ఒడిశాలో కేజీ గంజాయిని రూ.5వేలకు కొనుగోలు చేసి నెల్లూరుకు తీసుకువచ్చేవాడు. నగరంలోని ప్రగతినగర్‌కు చెందిన షేక్ హుస్సేని అలియాస్ హుస్సేన్, షేక్ రఫీ అలియాస్ గాంధీ, నారాయణ రెడ్డిపేటకు చెందిన రాపర్తి అలియాస్ నాపర్తి భాను ప్రకాష్, కిసాన్‌నగర్‌కు చెందిన పూడి వంశీకృష్ణకు ఆ కేజీ గంజా యిని రూ.20 వేలకు విక్ర యించే వాడు. వారు గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలో నింపి ప్యాకెట్ రూ.300 చొప్పున విక్రయిస్తూ కేజీ గంజాయిని రూ.50 వేలకు అమ్ము కొనేవారు. ఇలా జరుగుతున్న గంజాయి విక్రయాలపై పక్కా సమాచారం అందుకున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథ రామయ్య నిందితులపై నిఘా ఉంచారు. బుధవారం నగరంలోని పెన్నానది పొర్లుకట్ట వద్ద రంజిత్ నాయక్ గంజాయిని మిగిలిన నలుగురికి విక్రయిస్తుండగా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముఠాను పట్టుకున్న పోలీసులను డీఎస్పీ అభినందిం చారు. ఈ కార్యక్రమంలో సీఐ దశరథ రామారావు, ఎస్ఐ బాలకృ ష్ణ, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పగిలిన రాళ్లపాడు-రోళ్లపాడు పైపులైన్

- 48 గ్రామాలకు ఆగిన మంచినీటి సరఫరా

లింగసముద్రం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తుండడంతో లింగసముద్రంలో రెండు చోట్ల రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం ప్రధాన పైపులైను పగిలిపోయింది.దీంతో లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లోని 48 గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. బుధవారం సాయంత్రం గ్రామంలోని పెట్రోలు బంకు వద్ద, గొల్లపాలెం వద్ద కాంట్రాక్టర్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు మెషిన్‌తో గుంతలు తీస్తుండగా, పైపులైన్‌కు తగిలి పగిలి పోయింది.దీంతో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నీరు వరదలా ప్రవహించింది.గురువారం ఉదయం సిబ్బంది పైపులైన్‌కు మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టారు.ఈ పనులు రాత్రికి పూర్తవుతాయని వారు చెప్పారు. సంబంధిత అధికారులు, పథకం నిర్వాహకులు స్పందించి శుక్రవారం నీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

అతిథి అధ్యాపకుల కొనసాగింపు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులను వేసవి సెలవుల విరామం అనంతరం 2025-26 విద్యాసంవత్సరానికి ఏడాదిపాటు కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలోని వివిధ కళాశాలల్లో పనిచేస్తున్న 36 మంది అతిథి అధ్యాపకులను మరో ఏడాదిపాటు కొనసాగించనున్నారు. వీరంతా ప్రభుత్వ నిబంధనలకు లోబడి కళాశాలల్లో విధులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సహకార రంగంలోనే షుగర్ ఫ్యాక్టరీని కొనసాగించాలి

కోవూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కోవూరు చక్కెర కర్మాగారాన్ని సహకార రంగంలోనే కొనసాగించాలని అఖిల భారత చెరకు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి రవీంద్రన్ డిమాండు చేశారు. చక్కెర ఫ్యాక్టరీ ఆవరణలో గురువారం జరిగిన చెరకు రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు సహకార రంగంలోనే చక్కెర ఫ్యాక్టరీల్ని నడుపుతుండగా ఆంధ్రలో సహకార రంగానికి ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని మండిపడ్డారు. చక్కెర కర్మాగారం కొనసాగింపునకు కోవూరు రైతులు సాగిస్తున్న ఆందోళన ప్రశంసనీయం అని కొనియాడారు. చెరకుకు మద్దతు ధర టన్నుకు రూ.5500 చేయాలన్నారు. కేంద్రం స్వామినాథన్ కమిషన్ నిర్ణయాల్ని పట్టించుకోవడం లేదని చెప్పారు. అనంతరం తమిళనాడు చెరకు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం మాట్లాడారు. కోవూరు చక్కెర కర్మాగారం యజమానులు రైతులే అని, ఫ్యాక్టరీపై ప్రభుత్వానికి ఎలాంటి హక్కులేదన్నారు. సహకార రంగంలోనే ఫ్యాక్టరీని కొనసాగించేం దుకు రైతులందరూ ఐక్యంగా పోరాడలన్నారు. చెరకు రైతుల సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు రఘురామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో చెరకు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కర్రి అప్పారావు, రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎం సూర్యనారాయణ, నాయకులు జొన్నలగడ్డ వెంకమరాజు, పులి శ్రీరాములు, మూలి వెంగయ్య, గోనె దయాకరరావు, గండవరపు శేషయ్య, ప్రసాదరెడ్డి, హనుమంతరావు, మల్లికార్జునరెడ్డి, బాబు పాల్గొన్నారు.

29 నుంచి అంగ్రు వజ్రోత్సవాలు

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(అంగ్రు) ఆవిర్భవించి 60 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా గుంటూరు సమీపంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం లాంఫాంలో ఈ నెల 29 నుంచి వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ లలితా శివజ్యోతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండ్రోజులు జరిగే ఈ కార్యక్రమంలో చిన్న కమతాల్లో సుస్థిరమైన నికర ఆదాయం పొందగలిగే సాంకేతిక పరిజ్ఞా నంపై సదస్సు ఉంటుందని తెలిపారు. వ్యవసాయంతోపాటు అనుబంధ శాఖల సాంకేతికతకు సంబంధించిన ప్రదర్శనలు ఉంటాయని, ఆసక్తి కలిగి న రైతులు 9989623828, 7981644675 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమో దు చేసుకోవాలని సూచించారు. కేవీకే నుంచి రెండు బస్సులను ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.

29లోగా డీఎడ్ పరీక్ష ఫీజు చెల్లించాలి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : డీఎడ్ 2023-2025 బ్యాచ్ విద్యార్థులు 4వ సెమిస్టర్ పరీక్షలకు ఫీజులను ఈనెల 29వతేదీలోగా చెల్లించాలని డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులు నాలుగు సబ్జెక్ట్‌లకు రూ.250, మూడు సబ్జెక్టులకు రూ.175, రెండు సబ్జెక్టులకు రూ.150, ఒక్క సబ్జెక్ట్‌కు రూ.125 చొప్పున సంబంధిత తేదీలోగా చెల్లించాలన్నారు. అపరాధ రుసుము రూ.50తో మే 7వతేదీలోగా చెల్లించవచ్చన్నారు. పూర్తి వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాల ని కోరారు.

ఓపెన్ స్కూల్ రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు అవకాశం

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు వారికి వచ్చిన మార్కులపై సందేహాలుంటే రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో బాలాజీరావు మరో ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి మే 5వతేదీ వరకు ఏపీఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి సబ్జెక్ట్ జవాబుపత్రం రీకౌంటింగ్ కు రూ.200, రీవెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించాలన్నారు. అలాగే రెండు విభాగాల్లోనూ మే 19 నుంచి 24వతేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు, మే 26 నుంచి 30వతేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 26 నుంచి మే 5లోగా ఫీజులు చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు అభ్యసన కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్స్ నుంచి హెడ్‌మాస్టర్ పదోన్నతి కోసం సీనియారిటీ జాబితాను డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈవో ఇంకో ప్రకటనలో పేర్కొన్నారు. జాబితాపై అభ్యంతరాలుంటే శనివారం సాయంత్రం 5 గంటల్లో తగిన ధ్రువపత్రాలతో తెలియచేయవచ్చన్నారు.


నేటి నుంచి నోషనల్ ఖాతాల స్పెషల్ డ్రైవ్

- జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 95 వేలకుపైగా ఉన్న నోషనల్ ఖాతాల పరిష్కారానికి శుక్రవారం నుంచి నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాం బర్‌లో విలేకరులతో మాట్లా డారు. 1,84,298 సర్వే నెంబర్లలోని 95,060 నోషనల్ ఖాతాలకు సంబంధించి ప్రతిరోజూ జిల్లాలోని నాలుగు డివిజన్ల నుంచి రెండేసి మండలాల చొప్పున మొత్తం రోజుకు 8 మండలాలకు సంబంధించిన నోషనల్ ఖాతాలను పరిశీలిస్తామని చెప్పారు. ముఖ్యంగా అసైన్డ్ భూములు, రిజిస్టర్డ్ భూములు, చుక్కల భూములు, పౌతి (మరణించిన వారి సంబంధించిన) సాదా బైనామా సంబంధించిన నోషనల్ ఖాతాలను పరిశీలించి రెగ్యులరైజ్ చేస్తామని తెలిపారు. ఒక్క సాదా బైనామా భూములను నోషనల్ ఖాతా నుంచి తప్పించేందుకు ప్రస్తుతం అవకాశం లేదన్నారు. మిగిలిన వాటికి సంబంధించి నోషనల్ ఖాతా సమస్యలను పరిష్కరించే వీలుందన్నారు. రైతులు ఒక్కరుగా వారి సమస్యల పరిష్కారం కోసం తిరగడం కాకుండా ఆయా మండలాల్లోని అన్నీ నోషనల్ ఖాతాలను సాధ్యమైనంత వరకు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇందువల్ల దాదాపు 2,37,000 మంది రైతులు సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. తొలిరోజు పైలట్ ప్రాజెక్టుగా 8 మండలాల నోషనల్ ఖాతాలను పరిశీలించి ఎదురవుతు న్న సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. తద్వారా అన్నీ మండలాల్లోని నోషనల్ ఖాతాల సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

ఉగ్రదాడిపై ఆగ్రహం

- న్యాయవాదుల నిరసన
- కొవ్వొత్తులతో మృతులకు నివాళి



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ న్యాయవాద పరిషత్ అధ్వ ర్యంలో గురువారం న్యాయవా దులు జిల్లా కోర్టు ప్రాంగణంలో నిరసన తెలియజేశారు. ముష్క రుల దాడిలో మరణించిన వారికి నివాళులు అర్పిం చారు. దాడికి పాల్పడిన వారిని భార త ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దామా ధమరేశ్వర్, వైవీ సురేష్, కుడుముల రవికుమార్, షేక్ నన్నేసాహెబ్, వేలూరు రంగారావు, పీసీ కృష్ణయ్య, శివ పార్వతి తదితరులు పాల్గొన్నారు. కాగా, న్యాయవాదులు కోర్టు మెయిన్ గేట్ వద్ద సాయంత్రం కొవ్వొత్తులు వెలిగించి ఉగ్రదాడిలో చనిపోయిన వారికి నివాళులు అర్పించారు. భవిష్యత్తులో ఇలాంటి ఉగ్రదాడులు జరగకుండా కేంద్రం గట్టి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కుడుముల రవికుమార్, ఎస్ రామకృష్ణ ప్రసాద్, జల్లి పద్మాకర్, జీ బాల సుబ్రహ్మణ్యం, పీ హర్షవర్ధన్ రెడ్డి, ఎస్ అంకయ్య, పీ శంకరయ్య పాల్గొన్నారు.

పాక్ జెండాను దహనం చేసిన బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట,ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల నేపథ్యంలో ఢిల్లీలో పాక్ హైకమిషన్ సంబరాలు చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు గురువారం నగరంలోని మూలాపేట అలం కార్ సెంటర్‌లో పాక్ జాతీయ జెం డాలను దహనం చేశారు. నాయకుడు మిడతల రమేష్ మాట్లాడుతూ ఉగ్రవాదులు మతం ఎంచుకొని కాల్పులు జరపడం, పాక్ సరిహద్దులో యుద్ధ సన్నాహాలు చూస్తుంటే భారత్‌లోని హిందువులపై ఇస్లామిక్ తీవ్ర వాదులు ద్వేషంతో ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న నిర్ణయాలు హర్షణీయమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి మాట్లాడుతూ ఉగ్రవాద సంస్థలను పాక్ ప్రభుత్వం, పాక్ సైన్యం పెంచి పోషిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, పద్మావతి, నాగలక్ష్మి, అల్లూరు నాగేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.